# పూర్ణిమ / యామిని

ఆ రోజు మంగళవారం.

ఆఫీసులోకి పోస్ట్‌మాన్ రాగానే అప్పటిదాకా నడుస్తూన్న టైపురైటరు చప్పుడు ఆగిపోయింది.

టైపుచేస్తున్న పూర్ణిమ కుతూహలంగా మేనేజరు టేబిల్ మీద పోస్ట్‌మాన్ పెడుతూన్న ఉత్తరాల కట్టవైపుచూస్తూంది.

దాన్ని గమనించిన మేనేజరు నారాయణ, ప్యూను గోపాలం ఒకరిముఖా లొకరు చూసుకున్నారు.

నారాయణ మనసులో కలిగిన వ్యంగ్యభావం అస్పష్టంగా అతని ముఖంమీదకు వచ్చింది.

గోపాలం ఉత్తరాల దొంతర తీసుకొని ఆఫీసు ఉత్తరాలూ పెర్సనల్ ఉత్తరాలూ వేరుచేసేడు.

"సో మేడమ్! మీ కేమీ ఉత్తరం రాలేదు," అన్నాడు ఆత్రుతగా చూస్తున్న పూర్ణిమవైపు చూసి.

నారాయణ చిన్నగా నవ్వేడు.

గోపాలం కవర్లన్నీ చింపి లోపలి కాగితాలు ఒకదాని పై ఒకటి పేర్చుతున్నాడు.

టైపురైటరుమీద రెండుచేతులూ ఆన్చుకొని నిరుత్సాహంగా ఎటో చూస్తూ ఆలోచనలో మునిగిపోయింది పూర్ణిమ.

"బాస్ వచ్చి పదిహేను నిముషాల తర్వాత మళ్ళీ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళాలన్నారు. వెళ్ళేముందు గవర్నమెంటుకు మన ఎక్స్‌పోర్టు బిజినెస్‌ను గురించి వ్రాసిన లెటరు సైన్‌చేసి వెడతానన్నారు...." నారాయణ పూర్ణిమనుద్దేశించి అన్నాడు.

పూర్ణిమ వినలేదు.

"మిస్ పూర్ణిమా!"

"యస్సర్!" పూర్ణిమ ఉలిక్కిపడింది.

"ఎక్స్‌పోర్ట్ బిజినెస్ లెటర్...."

"అయిపోయిందండి. అదే టైపుచేస్తున్నాను," అని గబగబా టైపుచెయ్యడం మొదలుపెట్టింది పూర్ణిమ, అప్పుడే శేఖర్ లోపల అడుగుపెట్టేడు.

ఆఫీసులో అందరూ విష్ చేసేరు.

పూర్ణిమ తన పనిధోరణిలో శేఖర్‌ను గమనించనేలేదు.

శేఖర్ అలవాటుప్రకారం ఒక్క చూపులో ఆఫీసునంతా కలయజూసి తన కేబిన్‌లోకి వెళ్ళేడు.

మరో అయిదు నిముషాల్లో గోపాలం పూర్ణిమ దగ్గరకొచ్చి "బాస్ పిలుస్తున్నారు మేడమ్!" అన్నాడు.

పూర్ణిమ లేచి లోపలకు వెళ్ళింది.

"గుడ్‌మార్నింగ్ సర్!"

"వెరీ గుడ్‌మార్నింగ్!" అని శేఖర్ తన టేబిల్‌మీద కాగితాలు చూస్తూనే, "గవర్నమెంటుకు నిన్న సాయంత్రం నేను డిక్టేట్‌చేసిన లెటరు...."

"అయిపోయింది సార్! తీసుకొస్తాను."

పూర్ణిమ టైపురైటర్ దగ్గరకు వెళ్ళి అప్పుడే టైపుచేసిన లెటరు తీసుకొని తిరిగి కేబిన్‌లోకి వెళ్ళింది.

"ఇది వెంటనే డిస్పాచ్ కావాలి!" అని లెటర్ సంతకం పెడుతూ పరిశీలనగా లోపల చదివి పెదవి నొక్కిపట్టి తల అడ్డంగా ఆడించి పూర్ణిమవైపు చూసేడు.

ఆమెకు అర్థంకాక ఏమిటన్నట్లు చూసింది.

"చూడు పూర్ణిమా! మధ్యలో రెండు లైన్లు ఎగిరిపోయేయి," అన్నాడు శేఖర్.

పూర్ణిమ నమ్మలేనట్లుగా లెటర్‌వైపు చూసి గత్యంతరం లేక "అయామ్ సారీసర్!" అంది.

"ఇంపార్టెంట్ లెటర్స్ కొంచెం జాగ్రత్తగా టైప్ చెయ్యాలి పూర్ణిమా! ఇప్పటికే ఆలస్యం అయిపోయింది."

"ఐదు నిముషాల్లో మళ్ళీ టైపుచేసి తీసుకొస్తాను సర్!" అని పూర్ణిమ వెళ్ళబోయింది.

"నేను ఎయిర్‌పోర్టుకు వెడుతున్నాను. టైము లేదు," అని లేచి "ఆల్‌రైట్! ఓ గంటలో వస్తాను. తిరిగి టైప్‌చేసి గెస్ట్‌హౌస్‌కి పంపించు," అని పూర్ణిమ వెనకాలే బయటకు వచ్చేడు శేఖర్.

"బాస్ లెటర్ సైన్ చేసేరా?" అన్నాడు నారాయణ శేఖర్ వెళ్ళిపోగానే.

"లేదు, రీటైప్ చెయ్యమన్నారు," అంది పూర్ణిమ టైప్‌రైటర్‌లో కాగితం పెడుతూ.

"ఓ! ఈవేళ మంగళవారం కదూ!" అని వినబడేటట్లు గొణుక్కున్నాడు నారాయణ.

పూర్ణిమ చురుక్కున చూసింది అతనివైపు.

టైపురైటర్ రోలర్ స్పీడుగా చప్పుడు చేసుకుంటూ పరిగెట్టడం మొదలుపెట్టింది.

## 2


శేఖర్ ఎయిర్‌పోర్టుకు వెళ్ళేసరికి అప్పుడే ప్లేన్ లాండ్ అవుతూంది.

అయిదు నిముషాల తర్వాత ప్లేన్‌లోంచి గాంగ్వేమీదికి వస్తూన్న ప్రయాణీకులను ఆత్రుతగా చూస్తున్నాడు శేఖర్.

"ఏం చెయ్యమంటావ్ అన్నయ్యా! నాకు పెళ్ళిచేసి నీకు దూరం చేసుకున్నావు."

"అలా అనకమ్మా!....ఎలా ఉన్నారు మీరు?"

"చాలా బాగున్నాం. కాని ఒంటరిగా ఉన్న నిన్ను తలచు కొన్నప్పుడు మాత్రం అన్నీ ఉన్నా మనసంతా ఏదో దిగులు



గులాబిరంగు చీరలో కూలింగ్ గ్లాసెస్ పెట్టుకొని.... యస్! లక్ష్మి వచ్చేసింది. శేఖర్ చేతులు ఊపుతూంటే కొంచెం దగ్గరకు వచ్చేక గుర్తుపట్టింది లక్ష్మి. తానుకూడా సంతోషంతో చేతులు ఊపింది. శేఖర్ మనసు సంతోషంతో పొంగి పోయింది. పరుగెత్తుకొని లక్ష్మి గేటుదగ్గరకు వచ్చేసరికి అక్కడికి వెళ్ళి నిలబడ్డాడు. రెప్ప వాల్చకుండా కొంచెం సేపు అలాగే చూస్తూ నిలబడ్డారు ఇద్దరూ. తనివితీరా ఆమెను చూసుకొని వెళ్ళి ఆమె ఎటాచీ తీసుకొని వచ్చేడు. లక్ష్మిని కార్లో కూర్చోపెట్టుకొని బయలుదేరేలోపల గతమంతా ఒక్కసారి కళ్ళముందు కదిలిపోయింది. ఒక్కపూట కడుపు నిండా తిండి తినలేని తాను తన ప్రాణంకంటె ఎక్కువైన తన చెల్లెల్ని ఈనాటికి ఈ స్థితిలో ఉంచగలిగినందుకు మనసంతా సంతృప్తి నిండింది. కొంతసేపు ఆనందాతిరేకంలో ఏదీ మాట్లాడలేకపోయాడు. కారు స్టార్ట్ చేసేడు. కారులో, "ఒక్కగానొక్క చెల్లెలు తప్ప ఈ ప్రపంచంలో మరెవ్వరూ తోడులేని అన్నయ్యను ఇన్నిరోజులు విడిచి పెడితే ఎలాగమ్మా!" అన్నాడు.

అనిపిస్తుంది. నీ సుఖం అంతా నేను దోచుకున్నా ననిపిస్తుంది."

"అంత మాటనకమ్మా! నీ సుఖంకంటె నాకు సంతోషా న్నిచ్చేది మరేముంది చెప్పు! ఎటొచ్చీ ఎప్పుడూ నిన్ను విడిచిపెట్టి ఉండలేదు కనుక పీలయినంత తరచుగా చూడా లనిపిస్తుంది....నువ్వు వచ్చి ఏడాది అయిపోలేదూ!...."

"అయింది. నాకైతే నాలుగురోజుల కోసారివచ్చి నిన్ను చూసిపోవాలని ఉంటుంది. దేశంకాని దేశమై చేరరాని దూరాలయిపోయేయి. ఈసారైనా ఆయనకు ఢిల్లీలో ఏదో కాన్ఫరెన్సు ఉందంటేనూ ఓసారి నిన్ను చూస్తేకాని ఉండలే నని మంకుపట్టు పట్టి వచ్చేసేను."

"బావగారుకూడా వస్తున్నారు కదూ!"


"లేదన్నయ్యా! టైముంటే తప్పకుండా వచ్చేవారే. కాని ఆయనకు ఊపిరితీసుకోడానికూడా టైముండటంలేదు. నిన్ను ఏమీ అనుకోవద్దని మరీ మరీ చెప్పమన్నారు.

కాంపౌండులోంచి కారు లోపలకు వెడుతూంటే ఆశ్చర్యంగా చూసింది లక్ష్మి. ఆమె ఆశ్చర్యంలో ఎంతో తృప్తికలిగింది శేఖర్‌కు.

ఆఫీసు. ఆఫీసు వెనకాల ఫాక్టరీ. దాని వెనకాల గెస్ట్‌హౌస్. గెస్ట్‌హౌస్ ముందు కారాగింది.

లోపలకు వెళ్ళేసరికి శేఖర్ ఇంటిదగ్గరనుండి వచ్చిన వంటవాడు టిఫిన్‌చేసి తయారుగా ఉంచేడు. శేఖర్, లక్ష్మి టిఫిన్ తీసుకుంటున్నారు.

తనకు అన్నీ తానే అయిన చెల్లెలితో శేఖర్ ఆమె ఇదివరకు వచ్చి వెళ్ళినప్పటినుంచీ బిజినెస్ ఎంత అభివృద్ధిచెందిందో, ఫాక్టరీ ఎంత పెద్దది చేసేడో, చాలా ఉత్సాహంగా చెప్తున్నాడు.



ఇన్నీ వింటూ లక్ష్మి నిరుత్సాహంగా అన్న కళ్ళల్లోకి చూస్తోంది, ఆ ఉత్సాహం వెనకాల శూన్యాన్ని వెదుకుతూన్నట్లు.

"అదేమి టలాచూస్తున్నావ్!" అన్నాడు శేఖర్.

"ఏంలేదన్నయ్యా! నీ చుట్టూ సంపద రోజు రోజుకూ ఎంతెంతగా పెరుగుతుందో నీ ఒంటరితనం నా కళ్ళకంత కొట్టొచ్చినట్లుగా కనబడుతూంది."

"లక్ష్మి!"

"అవునన్నయ్యా!కావిరోజుల్లో నీ కడుపుమాడ్చుకొని ఉన్న రెండుముద్దలూ నాకు పెట్టి తల్లీదండ్రీ లేని నన్ను ఆ లోటు కనబడకుండా పెంచేవు. నా సుఖంకోరి నన్నో యింటిదాన్ని చెయ్యాలనే ఆరాటంతో నన్ను దూరంచేసుకున్నావు! ఇంకా ఇలా వంటవాడినీ, ఫాక్టరీ యంత్రాల్నీ పెట్టుకొని ఎన్నాళ్ళు కాపురంచేస్తా వన్నయ్యా! ఓ వదిన నీ యింటిలో తిరిగే వరకూ నాకు మనశ్శాంతి ఉండదు."

సరిగా అప్పుడే పూర్ణిమవచ్చి గుమ్మందగ్గర నిలబడింది.

గోపాలం ఉత్తరాలు తీసుకొచ్చి శేఖర్‌ముందుంచేడు.

"ప్లీజ్ కమిన్!" అన్నాడు శేఖర్ పూర్ణిమను చూసి. పూర్ణిమ లోపలకు వచ్చింది.

హఠాత్తుగా ఆమెను చూసిన లక్ష్మి ఆమె అందానికి ఆశ్చర్యపోయింది.

నిండైన విగ్రహం, పసిమిఛాయ, నిర్మలమైన విశాలమైన కన్నులు,ఎత్తు చెక్కిళ్ళు,అస్పష్టమైన చిరునవ్వు, అందమైన పలువరుస – దానికి తగినట్లు లేత నీలిరంగు చీరమీద

రంగు రంగుల పువ్వులు ప్రింటుచేసిన నైలెక్స్ చీరలో పూర్ణిమను చూసి దృష్టి మరల్చుకోలేకపోయింది లక్ష్మి.

"రా పూర్ణిమా!....నా చెల్లెలు లక్ష్మి. ఇప్పుడే ఢిల్లీనుంచి వచ్చింది. స్టేట్స్‌లో ఉంటూంది."

"నమస్కారమండి," అంది పూర్ణిమ.

ఆమె నోట్లోంచి ముత్యాలు రాలినట్లనిపించింది లక్ష్మికి.

"పూర్ణిమ నా ఆఫీసులో క్లార్కు, స్టెనోగ్రాఫరు, పియే అన్నీ ఆమె ఒకరోజు. ఆఫీసుకు రాకపోతే నాకు ఊపిరి సలుపదు," అన్నాడు శేఖర్.

"కూర్చోండి," అంది లక్ష్మి.

పూర్ణిమ కూర్చొని తాను టైపుచేసి తెచ్చిన లెటరు ముందుంచింది. శేఖర్ లెటర్ సంతకంచేసేడు.

ఈ లోపులో లక్ష్మి కాఫీ కలిపి పూర్ణిమకుకూడా ఇచ్చింది. కొంచెం మొహమాటపడబోయి శేఖర్ సైగచూసి కాఫీ తీసుకుంది పూర్ణిమ.

ఆమె కదలికల్లో తెరలు తెరలుగా కదులుతూన్న అందాలను విస్మితురాలై చూస్తూంది లక్ష్మి.

కాఫీ తాగి లెటర్ తీసుకొని "వస్తానండీ!" అని మరో సారి మర్యాదగా లక్ష్మివైపు చూసి గుమ్మంవైపు నడిచింది పూర్ణిమ.

ఉత్తరాల దొంతర చూస్తున్న శేఖర్, "పూర్ణిమా! ఇందులో నీదో ఉత్తరం ఉంది," అన్నాడు.

పూర్ణిమ ఉత్సాహంగా వెనక్కు తిరిగింది.

ఆమె కళ్ళల్లో ఆనందాన్ని చూస్తూ ఉత్తరాన్ని అంది చ్చేడు శేఖర్.

"థాంక్యూ సర్!" అని పూర్ణిమ ఉత్తరం తీసుకొని వెళ్ళిపోయింది.

లక్ష్మి ఆమె వెళ్ళినవైపే చూస్తూండిపోయింది.

"ఏమిటలా చూస్తున్నావ్?" శేఖర్ అడిగాడు.

"ఏమీలేదు. ఇంత పలుకుబడీ సంపదా ఆర్జించుకున్నావు! ఇంతింత అందమైన అమ్మాయిలు నీదగ్గర పనిచేస్తున్నారు. ఆమెకూ పెళ్ళయినట్లు లేదు. నీకు ఇన్ని సంవత్సరాలు ఈ ప్రపంచంలో ఆడదాని మీదకు మనసే పోలేదా? ఆమె అందానికి ఆడదాన్ని నేనే ఆశ్చర్యపోయేనే! మగవాడవు నువ్వెలా మామూలుగా ఆఫీసుపని చేసుకోగలుగుతున్నావు అని ఆలోచిస్తున్నాను."

"ఆ అమ్మాయి అయితే నేను పెళ్ళిచేసుకోడానికి సిద్ధమే!" అన్నాడు శేఖర్.

"నిజంగా! అయితే నేను పెళ్ళిచేసే వెడతాను," అంది లక్ష్మి శేఖర్ నవ్వేసేడు.

"పిచ్చి తల్లీ! పెళ్ళి నువ్వనుకున్నంత సులభం కాదమ్మా! నామీద వల్లమాలిన ప్రేమతో నా ఒంటరితనాన్ని పోగొట్టాలనే ఆలోచనతో ఉన్నావు కనుక నీకు అలా అనిపిస్తూంది...."

"ఇందులో ఏముందన్నయ్యా! మీ ఇద్దరికీ నచ్చి...."

"అదేనమ్మా! నచ్చడం అంటే నాలుగుగంటల ఆకలి ఆపడానికి నచ్చే వంటపదార్థంలాంటిది కాదుగా! అనాథలుగా మొదలైన మన జీవితాల్లో ఆకలి మంటలు చల్లార్చుకొని ఒక మనిషిగా మనగలిగే స్థితి వచ్చేసరికే కొంత వయస్సు గడిచిపోయింది. భూతంలాంటి గతం తిరిగి నీ భవిష్యత్తులో తిరిగి రాకుండా నిన్నో మంచిచోటుకు చేర్చాలన్న తపనలో మరికొంత వయసు గడిచిపోయింది. ఆ తర్వాత నాకు తోడు కావాలన్న కోరిక ఉంది. కాని పాలపొంగులాంటి వయసు దాటిపోయి జీవితంలో ఇంత అనుభవం పెంచుకున్న నేను నాకు మనసుకు పూర్తిగా నచ్చిన అమ్మాయి దొరికేవరకూ పెళ్ళిచేసుకోలేను. దొరికినా ఆ అమ్మాయికి నేను నచ్చక పోవచ్చుగా!...."

"ఎందుకు నచ్చవు? ఇంత చదువు, సంస్కారం, అందం, సంపద...."

"ఇవన్నీ చూసే దృష్టినిబట్టి హెచ్చుతగ్గులవుతూ ఉంటాయి. జీవితంలో దేవుడిచ్చిన వాటి నెన్నింటినో రూపం, తెలివి....ఇటువంటి వాటికి మనం చేయగలిగిందేమీ లేదు. కనీసం జీవితాంతం తోడుగా ఉండే భర్తను ఎవరిష్టం వచ్చినవాళ్ళను వాళ్ళు ఎన్నుకుంటూ ఉంటారు. వాళ్ళకూ ఓ గతం ఉంటుంది. పరిచయా లుంటాయి. ప్రేమలుంటాయి ద్వేషా లుంటాయి. నచ్చితే నచ్చడం–నచ్చకపోతే నచ్చక పోవడం. దానికి మరొకరు కారణాలు అడిగి అభిప్రాయం మార్చే ప్రసక్తే ఉండదు...."

"అది సరే! ఇంతకీ ఈ అమ్మాయి సంగతి...."

శేఖర్ గంభీరంగా నవ్వేడు.

"ఆ అమ్మాయి ఒక వింత అమ్మాయి. ఆమె కంపెనీలో చేరి ఆరు సంవత్సరాలయింది. ఆమె వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌లో వంటరిగా ఉంటూంది. అంత సూటిగా ఆలోచించే మనిషిని, అంత నిజాయితీగా ఉండే మనిషిని అంత శ్రమించే మనిషిని ఇప్పటివరకూ నేను చూడలేదు. ఆమె ఆఫీసుకు వచ్చినప్పుడు నేను ప్రత్యేక శ్రద్ధతో చూడడం వలన ఆమె కెన్ని చీరలున్నాయో లాంటి వివరాలుమాత్రమే కొన్ని తెలుసు. అంతకుమించి ఆమెనుగురించి నాకేమీ తెలియదు...."

"అయితే....ఆమెను గురించిన వింతేమిటి?"

"ఆ అమ్మాయికి రవి అనే అతని దగ్గరనుండి ప్రతి మంగళవారం ఓ ఉత్తరం వస్తుంది. అదికూడా నేను ఆఫీసు స్టాఫ్ అనుకుంటూంటే విని ఈ మధ్యనే గమనించేను. బహుశా అతడామె ప్రియుడు కావచ్చు. ఏ కారణంచేతనయినా ఆ రోజు ఆమెకు ఆ ఉత్తరం రాలేదో.... ఇంకామె మనలో ఉండదు. ఉత్తరం ఆమె చేతికి రావాలి, ఆమె మామూలు మనిషి కావాలి. అంతెందుకూ! ఈరోజు మంగళవారంకదా? పొద్దున్న ఉత్తరం రాలేదు. వచ్చిందేమో పొరపాటున నా ఉత్తరాల కట్టలో పడి ఆమెకు చేరలేదు. చాలా ఇంపార్టెంట్ లెటర్ ఒకటి టైపుచేస్తూ అందులో తప్పులు కొట్టింది. ఇందాకా నేను ఆమె ఉత్తరం ఇచ్చినప్పుడు ఆమె ముఖంలో ఆనందం చూసేవా!"

"చిత్రంగా ఉందే!" అనుకుంది లక్ష్మి చేతికి చిక్కిన అవకాశం జారిపోయినట్లు బాధపడుతూ.

## 3

ఆఫీసు కాగానే పూర్ణిమ నౌబత్‌పహాడ్ ఎక్కింది.

అస్తమిస్తూన్న సూర్యుడి బంగారురంగు కాంతులలో పదేపదే చదువుకున్న ప్రియుడి ఉత్తరం మళ్ళీ విప్పింది.

డియర్ పూర్ణిమా,

కనులు మూసుకోగానే ఎడబాటు అనే మాటకు అర్థం లేదనిపిస్తుంది. కమ్మని కలలు కంటాను. కలల్లో నీ వెచ్చని కౌగిల్లో నిదురిస్తాను. చెంపకు చెంపచేర్చి పెదవులకు పెదవులు కలిపి భాషకు అందని భావాలను అనువదించకుండానే గ్రోలేస్తాను. పరిసరాలకు అతీతమై అంతా నీవే అన్నీ నీవే అయి సుఖసాగరంలో ఉక్కిరిబిక్కిరిగా ఈదులాడుతూంటాను. మనసునిండా నిండిఉన్న నీకూ నాకూ మధ్య దూరమేమిటనుకుంటాను.

కాని కనులు తెరచి చూసి మనసు చెదిరిపోయి.... ఎక్కడ? నువ్వెక్కడ? ఈ మనుషులు—ఈ పరిధులు—ఈ ఊళ్ళు—ఈ మైళ్ళు .... రెక్కలుకట్టుకు ఎగిరివచ్చి నీ ప్రక్కన వాల్తాను. ఉండవలసిన క్షణంకంటె ఒక్క క్షణం నీకు దూరంగా ఉండను. నన్ను మన్నిస్తావు కదూ! నాకోసం ఎదురుచూస్తూంటావు కదూ!

నీ

రవి

ఉత్తరం ఎన్నిసార్లు చదువుకున్నా తనివితీరలేదు. మనసు రెక్కలు కట్టుకొని తియ్యని ఊహలోకాల్లోకి తేలిపోయింది. పున్నమి చంద్రుడి వెండివెన్నెల్లో బంగారు కలలు కంటూ పూర్ణిమ అలాగే నింగిలోకి చూస్తూ వెల్లకిలా పడుకొని ఉండిపోయింది.

పూర్ణిమ ఇంటికెళ్ళేసరికి రాత్రి ఎనిమిదిగంటలు దాటిపోయింది.

ప్రక్కగదిలో ఉన్న సుమిత్ర మెస్‌కు వెళ్ళకుండా ఆమె కోసం ఎదురుచూస్తూంది.

ఇద్దరూ కలిసి భోజనానికి వెళ్ళేరు.

భోజనం చేస్తూంటే సుమిత్ర అంది.

"వచ్చే శని ఆదివారాలు రెండురోజులూ శలవులు పూర్ణిమా! చిన్న పిక్నిక్ ఒకటి ఏర్పాటు చేసేము. నువ్వు కూడా వస్తున్నావు."

"సారీ సుమిత్రా! నేను రాలేను."

"నువ్వు తప్పకుండా రావాలి. నువ్వు రాకపోతే నేను కూడా వెళ్ళను .... ఎందుకు ఎప్పుడూ ఇలా దూరంగా ఉంటావు?"

"అదేంలేదు సుమిత్రా! మీరు వెళ్ళిరండి."

"నథింగ్ డూయింగ్! నువ్వు రాకపోతే అసలు ప్రోగ్రాం అంతా కేన్సిల్ చేసేస్తాను."

"ప్లీజ్!"

"ప్లీజ్‌లేదు ఏమీలేదు. నేనెప్పుడూ నిన్నింత పట్టుపట్టి అడగలేదు. కనీసం నాకోసమయినా...."

పూర్ణిమ కాదనలేకపోయింది.

ఆ రాత్రి నిద్రలో హఠాత్తుగా మెలకువవచ్చి లేచింది పూర్ణిమ.

బయట అంతా గోల గోల! తనూ వెళ్ళి చూసింది. హాస్టల్‌లో ఎవడో దొంగతనానికొచ్చేడని పట్టుకున్నారు. అప్పటికే వాడి బట్టలు చిరిగిఉన్నాయి. కంటికింద కమిలిపోయిఉంది.

మరో కొద్దిసేపట్లో ఇద్దరు పోలీసులు వచ్చేరు.

దొంగతనానికి వచ్చేడని కొందరు, చివరిరూమ్‌లో ఉన్న అమ్మాయి గదిలోకి వచ్చేడని కొందరు అరుస్తున్నారు.

పోలీసులు వచ్చి వాడి కాలర్ పట్టుకొని ఎందుకొచ్చేవని అడుగుతున్నారు.

చివరిరూమ్ ప్రక్కన మంచినీళ్ళ కుళాయి చూసి నీళ్ళు త్రాగుదామని వచ్చేననీ, అది ఆడవాళ్ళ హాస్టల్ అని తెలీదనీ అంటున్నాడు వాడు.

వాడి కాలర్ పట్టుకుని బయటకు ఈడ్చుకుపోయేరు పోలీసులు.

హాస్టల్లో ఆడవాళ్ళంతా ఇద్దరూ ముగ్గురూ గుంపులుగా చేరి ఇదివరకు జరిగిన దొంగతనాలూ, అత్యాచారాలూ చిలవలు పలవలుగా చెప్పుకుంటున్నారు.

పూర్ణిమ తనగదిలోకివెళ్ళి నిద్రపోవడానికిప్రయత్నించింది.

నిద్ర పట్టటంలేదు. తెలీకుండా మనసు జ్ఞాపకాల్లోకి జారిపోయింది.

అవి పూర్ణిమ కాలేజిలో ఫైనల్ ఇయర్ చదువుతున్న రోజులు. అది ఎలక్షను సీజను.

ఆ రోజు లేడీస్ వెయిటింగ్ రూమ్ దగ్గర నాలుగు పొడుగాటి అందమైన కార్లు ఆగేయి. వాటిలోంచి ఓ ఇరవై మంది పైలా పచ్చీసుగా ఉన్న స్టూడెంట్స్ దిగేరు. అందరూ మాడ్ డ్రెసెస్‌లో ఆడంబరంగా ఉన్నారు. వాళ్ళలో బాబూరావ్ అనే అతను ముందుకొచ్చి యువరాజులా ఉన్న ఆనంద్‌ను పరిచయం చేసేడు.

"ఇతను ఆనంద్! మీ అందరికీ ఇతను తెలిసే ఉంటాడని నాకు తెలుసు. అయినా పరిచయం చెయ్యడానికి కారణం ఏమిటంటే ఇతను కాలేజి యూనియన్ సెక్రటరీగా నిలబడుతున్నాడు. మీ అందరికీ కానుకలుగా కుంకుమ భరిణెలు ఇస్తున్నాడు...."

అంటూంటే ప్రక్కన ఉన్న ఇంకొకతను ఎర్రటి కాగితంతో ప్యాక్ చేసిన పెద్ద పొట్లంలోంచి ఒక్కొక్క భరిణె తీసి ఆడపిల్లలందరికీ ఇస్తున్నాడు.

"....ఇవి ఒక్కొక్కటి యాభైరూపాయలు. వీటికే అయిదువేల రూపాయలు ఖర్చుపెట్టేడు. మీరందరూ మీ ఓట్లు ఆనంద్‌కి వేస్తారనీ తప్పకుండా గెలిపిస్తారనీ ఆశిస్తున్నాము. ఎలక్షను అయిపోయిన వెంటనే మీకు స్పెషల్ పార్టీ ఒకటి ఏర్పాటు చేయిస్తున్నాము...." సరిగా అదే సమయానికి ఆనంద్‌కు పోటీగా నిలబడ్డ రవి కూడా అక్కడికి వచ్చేడు.

డాబుసరిగా వున్న వీరందరి మధ్య మామూలు బట్టల్లో అరిగిన చెప్పుల్లో ఉన్న అతని ముఖం సీరియస్‌గా గంభీరంగా ఉంది.

అతన్ని చూడగానే అంతకుముందు వచ్చినవారిలో గుసగుసలు ప్రారంభమయ్యేయి.

"బికారి రాముడు లేడీస్ దగ్గరకు కాన్వాసింగుకు వచ్చేడ్రోయ్!" బాబూరావ్ పక్కనున్న సుబ్బారావ్ గట్టిగా అన్నాడు.

రవి కత్తి దూసినట్లు చూసేడు.

"పాంప్లెట్స్ కూడా అచ్చు వేయించుకోలేక పోయేడుట. మరేం పంచిపెడదామని వచ్చేడురా?" మరో కంఠం.

"అడుక్కుతినేవాడేం పంచిపెడతాడు ఎంగిలాకులుతప్ప!" ఇంకో కంఠం.

"మీరు చెప్పదలచుకున్నది చెప్పి పంచదలచుకున్నది పంచి వెళ్ళండి. మైండ్ యువర్ ఓన్ బిజినెస్!" ఆవేశంతో అరచేడు రవి.

"పిట్ట కూతపట్టిందిరోయ్!" అంటూ అందరూ రవి చుట్టూ మూగేరు.

"ఏం కూసేవురా?" అన్నాడు వారిలో కాస్త ఒడ్డూ పొడుగూ ఉన్న ఒకడు.

"ఐసే మైండ్ యువరోన్ బిజినెస్!" ఉద్రేకంతో ఎర్రబడిన రవి ముఖంలో జంకూ గొంకూ లేదు.

"మళ్ళీ అను," అంటూ బాబూరావు చెయ్యిచేసుకున్నాడు.

"ఐసే ఇట్ ఎ థౌజండ్ టైమ్స్!" అంటూ అరచేడు రవి. వెంటనే అందరూ కలసి రవిమీద పడ్డారు.

ఆడవాళ్ళందరూ అదుర్దాపడడమేకాని మరేం చెయ్యలేకపోయారు.

రెండునిముషాలలో రవి బట్టలు చిరిగిపోయాయి. చేతులూ తలకూ గాయాలయ్యేయి. తల గాయంలోంచి రక్తం కారుతూంది.

"ఇప్పుడేమంటావురా?" అన్నాడు బాబూరావు.

"అదే అంటానురా పిరికిపందా! నువ్వు పదిమంది అండ చూసుకొని నన్ను కొట్టగలిగేవు గాని నీలో ఏముందిరా! ఆ పని ప్రాణంలేని పిట్టకూడా చేస్తుందిరా!"

"ఎక్కువ మాట్లాడితే ప్రాణాలు తీసేస్తాను."

"ప్రాణాలు తియ్యడం, తీస్తాననడం అంత సులువుకాదు. ప్రాణాలు తీస్తే హంతకుడివవుతావు. కటకటాల వెనకాల నిలబడతావు...." ముందుకు వచ్చిన బాబూరావు ఒక్కడుగు వెనక్కి వేసేడు. కాని రవి ఆగలేదు.

"....నువ్వు నా ప్రాణం తియ్యగలవేమో గాని నన్ను ఓడించలేవురా! ఆడవాళ్ళ దగ్గరకొచ్చి కుంకుమ భరిణెలు పంచడం మగతనం కాదురా! దమ్ముంటే నీ కేండిడేట్‌ని గెలిపించి అప్పుడు నా దగ్గరకు రారా!...." రవి కళ్ళల్లోంచి చాకుల్లా వస్తున్న చూపులకు నిలువలేకపోయాడు బాబూరావు. శరీరబలం ఓడిపోయినట్లు గుర్తించేక మరో ఆయుధం లేక బాబూరావుకు ఎవరూ అండగా నిలిచి మాట్లాడలేకపోయారు.

".... వెనకడుగులు వేస్తున్నారేమిరా! రండిరా! కొట్టండిరా! మీరు నన్ను కొట్టగలరుగాని ఓడించలేరురా!"

ఏదో మహాశక్తిని చూసినట్లు అందరూ వెనుక తగ్గేరు. ఆనంద్ ముఖం చిన్నబోయింది. మరో రెండు నిముషాల్లో కార్లన్నీ వెళ్ళిపోయాయి.

లేడీ స్టూడెంట్సు ముందు రక్తంకారుతూన్న గాయాలతో చిరిగిన బట్టలతో నిలబడ్డాడు రవి.

"నేను మీకు చెప్పదలుచుకున్నదానికంటే ఎక్కువ చూసేరు మీరు. ఆర్థికంగా, సాంఘికంగా ఉన్నత స్థానాల్లో

ఉన్న ఈ నరరూప రాక్షసులకు పేదవాడి రక్తాన్ని చూసే దాకా నిద్రపట్టదు. వీళ్ళ యీ దౌర్జన్యం మనిషి రక్తం రుచి చూసిన పులి దౌర్జన్యంలా కొనసాగుతూనే ఉంటుంది. వాళ్ళ ఉన్నత స్థానాన్ని నిరంతరం కాపాడుకోడానికే వాళ్ళు రాళ్ళతో కొట్టి లేదా కుంకం భరిణెలు పంచి అధికారాన్ని మాత్రం చేయిదాటిపోకుండా చూసుకుంటారు....” రవి ముఖంమీద రక్తం కణతమీద నుంచి క్రిందికి జారింది.

“గాయం రక్తం కారుతుంది. ముందు డిస్పెన్సరీకి నడవండి. కట్టు కట్టించుకోండి.” తను అంది.

రవి తన కళ్ళల్లోకి చూసేడు. తన కళ్ళల్లోకి కన్నీళ్ళు పొంగివచ్చేయి.

“మీ కళ్ళల్లో కన్నీళ్ళు చూస్తున్నాను. కన్నీళ్ళు కనికరాన్ని సూచిస్తాయి. ఎవరి కనికరం మీదా ఆధారపడడం నాకు ఇష్టం ఉండదు.”

తను కళ్ళు తుడుచుకుంది.

“మీ అందరినీ సూటిగా అడుగదలచుకున్నాను. మీ కంటి ముందు జరిగిన ఈ దౌర్జన్యాన్ని ప్రతిఘటించే ఆత్మస్థైర్యం, ధైర్యం మీకున్నాయా! ఉంటే మీరందరూ నాతో కలవండి.... ఆ ధైర్యమే లేకపోతే మీ ఓటు కూడా నాకు వద్దు.”

అప్రయత్నంగా తను “ఓట్ ఫర్ రవీ!” అని అరచింది.

వెంటనే వంద కంఠాలు తిరిగి అదే నినాదాన్ని అరిచేయి.

లేడీస్ అందరూ కలసి ముందు ప్రిన్సిపాల్ రూమ్‌కు వెళ్ళి జరిగిన దారుణాన్ని చెప్పేరు.

ఆనంద్ అండ్ కంపెనీ సస్పెండు అయ్యేరు.

ప్రతీ ఎలక్షను మీటింగులోనూ లేడీస్ అందరూ ఒక్కరూ తప్పకుండా పాల్గొన్నారు.

రవి స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీగా ఎన్నికయ్యేడు.

## 4

పిక్నిక్‌కు సుమారుగా పాతికమంది వచ్చేరు.

టేప్‌రికార్డర్లూ, రికార్డ్ ప్లేయర్లూ పెట్టుకొని ఆట పాటల్లో మునిగిపోయారు.

వారి మధ్యనుంచి సుమిత్ర కంటబడకుండా తప్పించుకొని పూర్ణిమ మెల్లగా ఉస్మాన్‌సాగర్ చెరువు గట్టుమీద కొచ్చింది. అరగంటసేపు నడిచింది. పిక్నిక్ జట్టు మాటలు కూడా వినబడటంలేదు.

చెరువు గట్టునే పెద్దచెట్టు నీడలో కూర్చుంది.

నీలాకాశంలో దూదిపింజెల్లాంటి తెల్లటి మేఘాలు చూస్తూ కూర్చుంది.

మేఘాలలో మారుతున్న ఆకారాలు మనసులో మాయనీ స్మృతులలోకి తీసుకొనిపోయాయి.

కాలేజి రోజుల్లో పిక్నిక్.

తనూ రవీ అందరికీ దూరంగా వెళ్ళిపోయారు. సన్నని తుంపరలో ఒకరి నడుముకొకరు చేతులు చుట్టుకొని అడుగులో అడుగు వేసుకుంటూ ఎంతదూరం నడిచేరో, ఎంతసేపు నడిచేరో తెలియలేదు. రవి సడెన్‌గా టైము చూసేడు.

“అరె! మనకు టైమే తెలీలేదు పూర్ణిమా! చాలా దూరం వచ్చేసేం! అరగంటలో మన ట్రెయిన్ వచ్చేస్తుంది.”

ఇద్దరూ పరుగెట్టేరు. ఎలాగయినా అపాలన్నట్లుగా. హోరున వర్షం మొదలయ్యింది.

ప్లాట్‌ఫారమ్ మీదకు వెళ్ళేసరికి అప్పటికే రైలు కదిలింది. ఆయాసంతో తనకు ఊపిరాడటంలేదు. పరిగెత్తలేక తాను ఆగిపోతూంది.

రైలు దగ్గర కొచ్చేసేరు. కాని రైలు వేగం పుంజుకుంది.

“రెండడుగులు పరిగెత్తు పూర్ణిమా!”

“ఇంక నా చేతకాదు రవీ!” ఆగిపోయింది తాను.

ఒక్కక్షణంలో తనను పొదివి పట్టుకొని ఎగిరి రైలెక్కేడు. తను హడలిపోయింది. కొంతసేపటిదాకా ఆ షాక్‌లోంచి కోలుకోలేకపోయింది.

రవి నవ్వుతుంటే మందలింపుగా చూసింది.

“ఏమిటంత సాహసం?”

“ఎక్కవలసిన రైలు కదలిపోతుంటే ఎగిరి గంతు వెయ్యకపోతే ఎలా?”

“కిందపడితే తెలిసేది! కాళ్ళు విరిగేవి.”

“కుంటివాళ్ళం అయ్యేవాళ్ళం. కాళ్ళు విరిగి కుంటివాళ్ళవుతే ఫరవాలేదు. కాళ్ళుండి కదలలేని కుంటితనం మాత్రం నాకు అసహ్యం.”

“ఇప్పుడింతలో మునిగిపోయేదేమిటి? తరువాత రైలుకు వెళ్ళేవాళ్ళం.”

రవి సీరియస్‌గా బయట వర్షంలోకి చూస్తున్నాడు.

“ఏమో పూర్ణిమా! జీవితంలో నెక్స్ట్ ట్రెయిన్ కోసం ఎదురుచూసే ఓర్పు నాలో లేదు. ఏమో తర్వాత మరో ట్రెయిన్ వస్తుందని గ్యారంటీ ఏమిటి?”

రవి ఆవేశానికి ఆశ్చర్యపోయింది పూర్ణిమ.

“ఆల్‌రైట్! ఇప్పుడు కాళ్ళు విరక్కుండా రైలెక్కేసేంగా! ఫర్‌గెట్ ఎబౌటిట్!” అంది తాను.

“యూ నో! జీవితం కొన్నిక్షణాల దారం! అందులో ఏ క్షణమూ కోల్పోకూడదు! మామూలు మనిషిగా ఉండే మనిషి

మహోన్నతమైన స్థితికి చేరాలంటే ఆ దూరాలు కాలినడకతో చేరేవికాదు. పరిగెత్తాలి. దూకాలి. సాహసించాలి! నాకు మటుకు లైఫ్ ఈజ్ యాన్ అడ్వెంచర్!" రవి ఏదో ఆవహించినట్లు మాట్లాడుతున్నాడు.

"ఇంక లెక్చర్ ఆపు! అందరూ వింటున్నారు." అంది తను.

"మైగాడ్! ఇక్కడున్నావా తల్లీ! నా ప్రాణం పైనే పోయింది." సుమిత్ర కంఠం విని ఉలిక్కిపడింది పూర్ణిమ.

"నేనెంత భయపడిపోయానో తెలుసా! కమాన్! లెటజ్ గో!" ఇద్దరూ లేచి వెనక్కి నడిచేరు.

## 5

శేఖర్ ఆఫీసులోకి వచ్చేసరికి పోస్ట్‌మాన్ ఉత్తరాల కట్ట విప్పుతున్నాడు.

"గోపాలం! పోస్టంతా కేబిన్‌లో పెట్టు! లెట్ మి సీ ది ఆర్డర్స్ ఫస్ట్!" అన్నాడు శేఖర్.

శేఖర్ వెనకాలే గోపాలం ఉత్తరాలు లోపలకు తీసుకొని వెళ్ళేడు.

"అవి అక్కడుంచి వెళ్ళు. మళ్ళీ పిలుస్తాను."

గోపాలం బయటకు వెళ్ళిపోయాడు.

శేఖర్ ఒక్కొక్క ఉత్తరమే ఏ కంపెనీనుంచి వచ్చిందో చూస్తూన్నాడు.

హఠాత్తుగా ఓ ఉత్తరం దగ్గర శేఖర్ ఆగిపోయాడు. ఆ కవరుమీద ఎర్రని కరెక్టింగ్ ఫ్లూయిడ్ చారలు గీసినట్లుగా ఒలికింది. శేఖర్‌కు అంతకు ముందురోజు ఆఫీసులో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

ముందు రోజు ఉదయం వచ్చిన ఉత్తరాలలో ఒక మాన్యుఫాక్చరింగ్ తన కంపెనీమీద నెల రోజుల క్రితం సప్లై కోసం పెట్టిన ఆర్డరు కేన్సిల్ చేసింది. కారణం నెలరోజులయినా సప్లైచెయ్యకపోవడమే!

తను కేబిన్‌లోంచి విసురుగా బయటకు వచ్చేడు.

మేనేజరు నారాయణ హార్స్ రేసెస్ బుక్ చూసుకుంటున్నాడు. తనను చూసి ఉలిక్కిపడి రేస్‌బుక్ డ్రాయర్లో దాచేడు.

"దీని ఆర్డర్ చూపించండి?" తను ఆర్డరు కేన్సిలుచేసిన కాగితం నారాయణకు చూపించేడు.

నారాయణ తన టేబిల్‌మీద కాగితాలన్నీ వెదికి ఆర్డర్ బయటకు తీసేడు. అది రెండువేల రూపాయల ఖరీదు చేసే ఇంజనీరింగు స్పేర్‌పార్ట్సుకి ఆర్డరు.

"నేనెన్నిసార్లు చెప్పాను. ఆర్డర్స్ విషయంలో ఒక్క రోజుకూడా ఆలస్యం చెయ్యవద్దని! ఆఫ్టరాల్ మనం బ్రతుకుతూన్నది దీనిమీద! ఈ ఆర్డరు వచ్చి నెలరోజులయినా సప్లై కాలేదంటే ఆఫీసు ఎంత చక్కగా పనిచేస్తూందో తెలుస్తూంది" అన్నాడు తాను.

"అయామ్ సారీ సర్!" అన్నాడు నారాయణ తలవంచుకొని. కాని అతని ముఖంలో మాత్రం పశ్చాత్తాపమేంలేదు. అందుకే తనుకూడా తరువాత మాట అనకుండా ఉండలేకపోయాడు.

"ఇప్పుడు సారీ అంటే లాభం ఏమిటి? ఇది రెండువేల రూపాయల ఆర్డరు! దీనిమీద కంపెనీకి రెండు వందల రూపాయల లాభం వచ్చేది. ఇది మీ జీతంలోంచి తీసుకోమంటారా?"

"నిజానికి ఇందులో నా పొరపాటేమీ లేదుసార్!" అన్నాడు నారాయణ.

"అయితే ఎవరిది పొరపాటు?"

"ఇది పూర్ణిమ టేబిల్‌మీది పేపర్స్‌లో కలిసిపోయిఉందని నిన్ననే తీసుకొచ్చింది సార్!" నారాయణ పెదవుల చివర కుటిలపు చిరునవ్వు కనపడుతోంది. 'నాతో ఇంత తీవ్రంగా మాట్లాడేవు గాని ఆమెతోకూడా ఇలాగే మాట్లాడుతావా!' అన్నట్లుంది ఆ నవ్వు. అందుకే తానుకూడా కంఠం మార్చడానికి వీలులేకపోయింది.

పూర్ణిమ స్టెన్సిలు టైపుచేస్తూ కరెక్టింగ్ ఫ్లూయిడ్‌తో ఏదో కరెక్టు చేస్తూంది. తను ఆమెవైపు తిరగటంచూసి లేచి నిలబడింది.

"మేనేజర్ చెప్పింది నిజమేనా?"

"యస్సర్!"

"అసలీ లెటరు నీ టేబిల్‌మీదకు రావలసిన అవసరం?"

"అదే నాకూ అర్థంకాలేదు సార్! ఏమయినా తప్పు నాదే! రెండువందల రూపాయలు నా జీతంలోంచి రికవర్ చేయించండి!" పూర్ణిమ చాలా సమయస్ఫూర్తిగా ఆమాటన్నా చుట్టూవున్న వాళ్ళల్లో వచ్చిన రియాక్షన్ చూసేసరికి తనకు చాలా చికాకనిపించింది. అక్కడ ఆఫీసు ఉద్యోగుల మధ్య ఓడిపోయి నిలబడితే పనిసాగదు.

"వాట్ నాన్సెన్స్! హౌ డేర్ యూ టాక్ లైక్ దట్! ఈవేళ రెండు వందలయింది. రేపు రెండు లక్షలవుతుంది. ఆర్యూ వర్త్ టూ లాక్స్! రేపు రెండు లక్షలు నీ జీతంలోంచి రికవర్ చేయించగలనా!" తను చేతిలో పేపర్స్ ఆమె టేబిల్‌మీద విసిరేడు.

అవి తగిలి కరెక్టింగ్ ఫ్లూయిడ్ సీసా ఒలికిపోయింది. ఆ ఎర్రని ద్రవం సీసాప్రక్కనే ఉన్న కవరుమీద చారలు గీసినట్లు ఒలికింది. వెంటనే తను దాన్ని తీసి పక్కకుపెట్టి

"గోపాలం! ఇది క్లీన్‌చెయ్యి!" అని తన కేబిన్‌లోకి వచ్చేశాడు.

కాని ఎర్రని ద్రవం ఒలికిన ఆ కవరు మాత్రం....

శేఖర్ చేతిలో కవరు చూసుకున్నాడు. అదే కవరు.అది పూర్ణిమకు వచ్చింది. వెనక్కు తిప్పి చూసేడు. 'రవి' అని వుంది. ఏ ఊరునుంచి వచ్చిందో పేరు లేదు. పోస్టల్ స్టాంపులు చూశాడు. అన్నీ హైదరాబాదువే. అంటే నిన్న పూర్ణిమే ఈ ఉత్తరం రాసి పోస్టులో వేసుకుందా?!

ఈ రోజు మంగళవారం. మంగళవారం ఆమెకు రావలసిన ఉత్తరం ఇదే! మరో ఉత్తరం ఆమెకు రాలేదు. అయినా అనుమానం తీరక ఆమె దస్తూరీవున్న ఫైల్స్‌తెప్పించి ఎడ్రసు వ్రాసిన అక్షరాలు దానితో పోల్చిచూసేడు. అది నిస్సందేహంగా ఆమె దస్తూరీయే!

అయితే 'రవి' పేరుతో వచ్చే ఉత్తరాలన్నీ ఆమెకుఆమే వ్రాసుకుంటుందా! మరి రవి ఎవరు? ఈ ఉత్తరాలు ఆమె వ్రాసుకుంటే వాటికోసం అంత ఆతృతతో ఎదురుచూడడం ఎందుకు? అది చదవగానే ఆ ఆనందానికి అర్థం ఏమిటి? శేఖర్‌కు ఏమీ అర్థంకాలేదు. అయినా మనసుకు సమాధానం దొరకక ఉత్తరాలన్నీ తనే బయటకు తీసుకొని వెళ్ళి ఆఫీసు ఉత్తరాలన్నీ నారాయణ టేబిల్‌మీద ఉంచేడు.

"వీటిలో ఆర్డర్సన్నీ ఈ రోజే కంప్లయన్స్‌కి పంపండి!"

"యస్సర్!"

"ప్రతిరోజూ పోస్టు రాగానే ముందుగా నా దగ్గరకు పంపండి!"

"ఓకే సర్!"

ఫాక్టరీలో వాళ్ళకి వచ్చిన పెర్సనల్ లెటర్స్ గోపాలానికిచ్చి అక్కడ ఇచ్చిరమ్మన్నాడు.

పూర్ణిమ కవరు తనే ఆమె చేతికిచ్చి పరిశీలనగా ఆమె ముఖంవైపు చూసేడు.

హఠాత్తుగా ఆమెకళ్ళల్లో వెలిగిన కాంతి, ఆమెముఖంలో ఉత్సాహం....శేఖర్‌కు చాలా ఆశ్చర్యం కలిగించింది. శేఖర్ తన సీటులో కూలబడ్డాడు. ఎంత ఆలోచించినా జవాబు దొరకలేదు.

మొదటి చూపులోనే మనసును దోచుకున్న ఆమె అందం క్రమంగా పనిలోగాని మరే విషయంలోగాని ఆమె ప్రదర్శించిన ప్రత్యేక వ్యక్తిత్వం పూర్ణిమను శేఖర్‌కు అత్యంత సన్నిహితంగా తీసుకొచ్చేయి. ఆమెనతడు అంత ఆసక్తితో పరిశీలిస్తున్నాడనేది ఆమెకు తెలీదు. ఆమెను పరిశీలించిన కొలదీ ఆమెపట్ల అభిమానం, గౌరవం పెరగటమేగాని తరగటంలేదు. చివరకు సాహసించి తన మనసులో ఆలోచన


భక్తిని పెంచుటకు

భగవంతుని వశపరచుకొనుటకు కోరిన కోర్కెలు సిద్ధింపజేసుకొనుటకు

ఉపయోగించండి

అంబికా దర్బార్‌బత్తి




తయారుచేయువారు:

అంబికా కెమికల్ ప్రోడక్ట్స్ (రిజిష్టర్డ్)

పవర్‌పేట, ఏలూరు, ఆంధ్రప్రదేశ్

ఆమెకు చెప్పాలనుకొన్నప్పుడే ఆమె ఉత్తరాల సంగతి శేఖర్‌కు తెలిసింది. అంత క్రమశిక్షణ ఉన్న మనిషి ఒక ప్రియుడంటూ వుంటే ఆమెను తన భార్యగా ఊహించడం ఎంత పొరపాటో శేఖర్ గ్రహించేడు. ఆ రోజునుంచీ ఆమె ప్రణయ భావాన్ని అంగీకరించి, గౌరవించి ఆమెపట్ల ఒక మంచి స్నేహితుడిగా అభిమానాన్నే ఉంచుకున్నాడు శేఖర్. కాని ఈ రోజు ఈ సంఘటన తర్వాత క్రమశిక్షణతో తాను ఏర్పరచుకొన్న కట్టడులన్నీ చెల్లాచెదురై పోయేయి. ఆమె ఏదో తీవ్రమైన మానసిక వేదనకు గురి అవుతూన్నట్లు కన బడుతుంది. ఆమెకెలాగైనా సహాయం చెయ్యాలి. ఎలా?

దాని వెనుక ఆమె తనది కావడానికి అవకాశం ఉందనే ఆశకూడా అస్పష్టంగా ఉంది. అదేజరిగితే తనవంటి అదృష్ట వంతుడు మరొక డుండబోడనుకున్నాడు శేఖర్. రాత్రంతా ఇవే ఆలోచనలతో నిద్రపట్టక పరుపుమీద అటూ యిటూ దొర్లుతున్నాడు శేఖర్.

మండుతూన్న కనురెప్పలు బరువుగా మూసుకున్నాడు. ఏదో శరీరానికి తగిలినట్లయి మత్తుగానే కళ్ళుతెరిచిచూసేడు శేఖర్.

పాలనురుగులాంటి తెల్లని పట్టుచీరలో బొండుమల్లెల దండలు కురులలో తురుముకొని తన ఛాతీమీదకు తనరెండు చేతులూ ఆన్చుకొని వాటిమీద గడ్డాన్ని ఆన్చుకొని రెప్ప వాల్చకుండా తన కళ్ళలోకి చూస్తోంది పూర్ణిమ.

సన్నని చిరునవ్వుతో వెలుగుతోన్న పెదవులు — ఆరాధనతో చూస్తూన్న చూపులు-తనకే శాశ్వతమైనట్లు ఆ భంగిమ — శేఖర్ ఆమెను ఇంకా మీదికి లాక్కొని పెదవులకు పెదవులు కలిపి కౌగిలి బిగించేడు.

కల చెదిరిపోయింది. తలగడలో పూడ్చుకొన్న తలను బయటకు తీసి చుట్టూ చూసేడు శేఖర్.

బయట పండువెన్నెల. లేచి బాల్కనీలో పచార్లు చేస్తూ తీయని కలను పదేపదే గుర్తుకు తెచ్చుకుంటూ మిగిలిన రాత్రంతా జాగారం చేసేడు శేఖర్.

## 6

ఆ నాటినుండి ఎలాగైనా ఆమె సమస్యను అర్థంచేసుకోవాలనీ, వీలయితే దాన్ని తానే పరిష్కరించాలనీ ఆరాటపడుతున్నాడు శేఖర్.

ప్రతిరోజూ పోస్టు సరాసరి ముందు శేఖర్ కేబిన్‌లోకే వస్తోంది. మంగళవారంనాడు పూర్ణిమకు ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. అవి ఆమె దస్తూరీలోనే ఉంటున్నాయి. కాని ఈ విషయమై ఆమెతో చర్చించడానికే తగిన అవకాశందొరకటం లేదు.

*Deepavali Greetings*
*to our Valued Clients & Well Wishers*

**GOLDEN PRESS**
**Gowliguda, Hyderabad. Phone : 44338**

*Specialists in*
Carton Printing, Box Making, Varnishing and
Quality Letter Press & Offset Printers.

ఆలోచించి ఆలోచించి శేఖర్ ఒక నిర్ణయానికి వచ్చాడు. రెండు మూడు వారాలు ఆమెఉత్తరాలు ఆమెకు అందకుండా చూడాలి. దాని పరిణామాన్ని చూడాలి. బహుశా అదొక్కటే ఆమెతో ఈ విషయం మాట్లాడటానికి తగిన అవకాశం ఇవ్వవచ్చు.

ఆమె ఉత్తరాలు తీసి తన డ్రాయర్లో పెట్టడం మొదలు పెట్టేడు శేఖర్.

మూడు వారాలు గడిచేయి.

పూర్ణిమలో అనుకొన్న విధంగా చాలా మార్పువచ్చింది. ఇంచుమించుగా ఆమె రోజులో చాలామేర పరధ్యాన్నంగా ఉంటుంది. ఆమె చేసే పనిలో తప్పులు కుప్పలుగా దొర్లిపోతున్నాయి. అది ఆమె గమనించినట్లే కనబడటంలేదు. ఆఫీసులో ఆమె అంటే అందరికీ ఒక హాస్యాస్పదమైన అభిప్రాయం కలుగుతూంది. అది వారి మాటల్లో చేతల్లోకూడా బయటపడుతూంది. ఆమె మామూలు పరిస్థితుల్లో ఉంటే ఎవరికి వారికి తగిన జవాబు చెప్పేది. ఇప్పుడు ఆమె దాన్ని గమనించినట్లు కూడా కనబడటంలేదు.

శేఖర్‌కు చటుక్కున కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ఒక చిన్న సంఘటన గుర్తుకొచ్చింది.

తను రెండురోజులు ఫాక్టరీ బిజినెస్ పనిమీద బొంబాయి వెళ్ళివచ్చేడు.

తాను ఆఫీసుకు వచ్చేసరికి పూర్ణిమ కంఠం కొంచెం తీవ్రంగా వినబడుతూంటే లోపలకు రాకుండా బయటే నిలబడి విన్నాడు.

"....నారాయణగారూ! రొమాన్స్ అనేది భార్యాభర్తల మధ్య, ప్రేయసీ ప్రియులమధ్య ఏకాంతంలో ఇద్దరికీ ఇష్టమై చేసుకొనే పని. బయట ప్రపంచంలో మిగిలిన మనుషులతో అదికాక, ఇంకా వేరే పనులూ, వేరే బంధాలూ వేరే మర్యాదలూ ఉంటాయి. ఏ ఆడదాన్ని చూసినా ఒక్క రొమాన్సే గుర్తుకు రావటం పెద్ద జబ్బు. ఇది ఆఫీసు! నేను పరాయి దాన్ని! ఇది గుర్తుపెట్టుకొని ప్లీజ్ ట్రై టు బిహేవ్ యువర్ సెల్ఫ్! దిసీజ్ మై ఫస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్!"

తాను లోపలకు వచ్చేడు. నారాయణ ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు.

పూర్ణిమ ముఖం మామూలుగానే ఏమీ జరుగనట్లుగానే ఉంది.

అటువంటి పూర్ణిమ ఈరోజు తనచుట్టూ మనుషులు తన గురించి ఎగతాళిగా మాట్లాడుతూన్న మాటలుకూడా వినిపించుకోనంత పరధ్యాన్నంగా ఉంటూంటే శేఖర్‌కు చాలా జాలి కలిగింది.

ఏమయినా ఇంక ఆలస్యం చేయడానికి వీలులేదు. ఈ


*With the Best Compliments for Diwali*

BOMMANA : CLOTH
CLOTH : BOMMANA
BOMMANA : FASHION
FASHION : BOMMANA

**BOMMANA**

**FASHION CREATORS**

రోజు సాయంత్రం ఆఫీసు అయిన తర్వాత పూర్ణిమతో ఈ విషయం గురించి మాట్లాడటానికి నిశ్చయించుకున్నాడు శేఖర్.

సరిగా సాయంత్రం నాలుగయ్యేసరికి పూర్ణిమ కేబిన్‌లోకి వచ్చింది.

"యస్!" ఆమె ముఖంలోకి చూసేడు శేఖర్.

"నా ఫ్రెండ్‌తో కొంచెం షాపింగ్‌కు వెళ్ళాలి, ఓ గంట ఆఫీసునుంచి తొందరగా వెడతాను."

"ఓ.కె."

పూర్ణిమ వెళ్ళిపోయింది.

సరిగా ఆఫీసు మూసే టైముకు తన చిన్ననాటి స్నేహితుడి దగ్గర్నుంచి శేఖర్‌కి టెలిఫోను వచ్చింది.

ఆ రోజే సిటీలోకి వచ్చేననీ సాయంత్రం ఆరుగంటలకు తానున్న హోటల్లో ఎదురుచూస్తూంటాననీ చెప్పేడు.

కారులో వెడుతూన్న శేఖర్ హఠాత్తుగా బ్రేకుతొక్కాడు ఎదురుగా కనబడ్డ దృశ్యానికి ఆశ్చర్యపోయేడు.

రోడ్డుకు రెండోవైపున పూర్ణిమ పరుగెడుతూంది. ఆమె పరుగెడుతూన్నవైపు దూరంగా ట్రాఫిక్ సిగ్నల్ ముందు కార్లాగి ఉన్నాయి. ఆమె అటువైపే చూస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్‌లో ఎర్రదీపం ఆరి ఆకుపచ్చ దీపం వెలిగింది. కార్లన్నీ ముందుకు వెళ్ళిపోయాయి. పూర్ణిమ నిలిచిపోయింది.

శేఖర్ కారు గిరుక్కున రెండోవైపుకు తిప్పేడు. కారు ఆమె పక్కన ఆపేసరికి ఆమె స్నేహితురాలు సుమిత్ర కూడా ఆమె దగ్గరకు వచ్చి నిలబడింది. ఆమెకూడా పూర్ణిమ వైపు ఆశ్చర్యంగానే చూస్తూంది.

"ఎక్కడికైనా లిఫ్ట్ కావాలా?" శేఖర్ అడిగేడు.

పూర్ణిమ శేఖర్‌ను చూసి తడబడింది.

"అక్కర్లేదండి," అంది పూర్ణిమ.

ఆమె ఏదో దాస్తున్నట్లనిపించింది శేఖర్‌కు.

"పోనీ మీ హాస్టల్ దగ్గర డ్రాప్ చెయ్యనా?"

"నో! థాంక్యూ సర్! ఇద్దరం వెళ్ళిపోతాము," అంది పూర్ణిమ.

శేఖర్ చేసేదిలేక కారు తిప్పి బయలుదేరేడు. కాని మనసులో ఆందోళన తొలగిపోలేదు. కొంచెందూరం కారు నడిపి పక్కకు ఆపి వెనక్కు తిరిగి చూసేడు. పూర్ణిమా, సుమిత్రా కలిసి నడుస్తున్నారు. సుమిత్ర ఏదో మాట్లాడుతుంది.

ఇంతలో ఒక టాక్సీ వాళ్ళకు ఎదురొచ్చింది. పూర్ణిమ టాక్సీ ఆపింది. సుమిత్రకేదో చెప్పి పూర్ణిమ అందులో


మా ఖాతాదార్లకూ, శ్రేయోభిలాషులకూ దీపావళి శుభాకాంక్షలు

# శ్రీ శ్రీనివాస పేపర్ కన్వర్టర్స్

పేపర్ రీల్స్ కటింగ్‌లో నిపుణులు

* అత్యంతాధునికమైన యంత్రములతో దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా నిలుస్తున్న సంస్థ.
* మీ పనిని నమ్మకంగా, సక్రమంగా, సత్వరంగా చేసి ఇవ్వగలము.
* బయటి ఊళ్ళ ఖాతాదారులకు రీల్స్ కట్ చేసి రవాణా చేయగలము.
* అత్యంత సరసమైన రేట్లు.
* ఖాతాదారులు నిర్దేశించిన సైజులకు, వైట్ ప్రింటింగ్ పేపర్ రీల్స్ న్యూస్‌ప్రింట్ రీల్స్ కట్ చేసి ఇవ్వగలము.

**రీలుకు వీలైనన్ని ఎక్కువ రీములు — వేస్టేజి అతి తక్కువ**

**ఇదీ మా ధ్యేయం**

**ఒక్క ప్రయత్నం మీకు మాపై నమ్మకం కలిగించగలదు.**

## శ్రీ శ్రీనివాస పేపర్ కన్వర్టర్స్

6-1/ఎ, మురుగేశ మొదలి స్ట్రీట్, కొండితోపు, మద్రాసు-600 001.

ఫోన్ : 21520

కూర్చుంది. టాక్సీ దూసుకుపోయింది. సుమిత్ర నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

టాక్సీ కనబడినంతసేపు శేఖర్ అటే చూస్తూ ఉండిపోయాడు.

మర్నాడు పూర్ణిమ ఆఫీసుకు రాగానే ఈ సమస్య పూర్తిగా ఆమెతో మాట్లాడాలనుకున్నాడు శేఖర్.

కాని పూర్ణిమ మర్నాడు ఆఫీసుకు రాలేదు.

సాయంత్రం ఆఫీసు అయినతర్వాత పూర్ణిమ హాస్టలుకు వెళ్ళేడు శేఖర్.

పూర్ణిమ ఉదయమే బయటికి వెళ్ళిందనీ ఎక్కడికి వెళ్ళిందో ఎప్పుడు వస్తుందో తెలియదనీ సుమిత్ర చెప్పింది.

సుమిత్ర టెలిఫోను ఎక్స్చేంజిలో పనిచేస్తుందని తెలుసు కొని ఎందుకైనా మంచిదని ఆ టెలిఫోను నెంబరు తీసుకున్నాడు శేఖర్.

ఆ మర్నాడు కూడా పూర్ణిమ ఆఫీసుకు రాలేదు.

సుమిత్రకు టెలిఫోను చేస్తే పూర్ణిమ బొంబాయి వెళ్ళిందనీ మూడు నాలుగు రోజులలో రావచ్చనీ తెలిసింది.

ఏరోజు కారోజే ఆమె వస్తుందని ఎదురుచూడడంలో పదిరోజులు గడిచిపోయాయి.

ఈలోపులో ఆఫీసులో ఒక మనిషి తక్కువకావడం వలన పని బకాయిపడిపోతూందనీ ఇంకొకళ్ని చేర్చుకోవడం మంచిదనీ మేనేజరు పోరు ఎక్కువయిపోయింది.

మరోసారి సుమిత్రకు టెలిఫోనుచేసిచూద్దా మని శేఖర్ టెలిఫోను రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు.

కేబిన్ అద్దంలోంచి ఆఫీసులోకి వస్తూన్న పూర్ణిమ కనబడింది.

శేఖర్ మనసులోంచి పెద్ద బరువు దించినట్లయింది. వెంటనే పిలిచి కారణం తెలుసుకోవాలనిపించింది. ఏమైనా తొందరపడకుండా ఆమెను ఆందోళనపరచకుండా నెమ్మదిగా అడగడం అవసరం అనిపించింది. పైగా ఒకమూల ఉత్తరాలు తాను దాచిపెట్టడంవల్ల పరిస్థితి ఇక్కడిదాకా వచ్చిందేమోననే బాధకూడా మనసులో ఉంది. ఉత్తరాల సంగతి గుర్తుకురాగానే అదే మంచి సాకని తోచింది. వెంటనే పూర్ణిమను పిలిపించేడు. పూర్ణిమ లోపలికి వచ్చింది.

శేఖర్ గుండెలో ముల్లు గుచ్చినట్లయింది.

పదిరోజుల్లోనూ పూర్ణిమ సగానికి సగం చిక్కిపోయింది. చూపుల్లో ఇదివరకున్న విశ్వాసం, కాంతీ లేవు. బెదురు బెదురుగా చూసింది.

"కూర్చో పూర్ణిమా!" ఎంతో జాలితో మర్యాదగా అన్నాడు శేఖర్. ఆమె ఏదో నేరంచేసినదానిలా కూర్చుంది.

*With the best compliments of*

**EAST COAST BEER & WINES**

*Prop :* **G. B. Choudary**

Nalam Choultry Shop, Main Road, Rajahmundry-2

**Phone : 3025**

***Available on Wholesale and Retail***

**BRANDY, WHISKY, RUM, GIN, WINE, BEER.**

"నువ్వు ఆఫీసుకు రాక పదిరోజులు దాటిపోయింది."

"యస్సర్!"

"కనీసం లీవు అప్లికేషన్ కూడా పంపలేదు."

"నో సర్! సారీ సర్!"

"ఆరోగ్యం బాగులేదా?"

"బాగానేవుంది."

"చాలా చిక్కిపోయావు. ఇన్నిరోజులూ ఊళ్ళోనే ఉన్నావా?"

"....యస్సర్!"

ఎన్ని ప్రశ్నలడిగినా మూసిన తలుపుల వెనుకనున్న వస్తువులా ఆమె మనసులో ఉన్న బాధే అర్థంకావటంలేదు.

డ్రాయర్లో ఉన్న ఉత్తరాల సంగతి గుర్తుకొచ్చింది. అవయినా కాస్త ఆమెకు సంతోషం కలిగిస్తాయనే ఉద్దేశ్యంతో డ్రాయరు తెరిచి ఉత్తరాలు తీసి, "ఇవి నువ్వు ఆఫీసులో లేనప్పుడు వచ్చేయి," అని ఉత్తరాలు ఆమె ముందుంచేడు. హఠాత్తుగా, ఆమె చూపులు తీవ్రంగా మారిపోయాయి. వెంటనే ఆ ఉత్తరాలు తీసుకుని బయటకు వెళ్ళిపోయింది.

ఆమెను కేబిన్ అద్దాల్లోంచి గమనిస్తూనే ఉన్నాడు శేఖర్.

ఆమె సీటువద్దకు వెళ్ళి ఆ ఉత్తరాలు పరపరా చింపి చెత్తబుట్టలో పారేసింది.

ఉత్తరాలు ఎంతో ఆత్రుతతో పదే పదే చదువుకొనే ఆమె వాటిని కనీసం ఒక్కసారయినా చదవకుండా చింపెయ్యడం శేఖర్ మనసులో జవాబులేక ఉన్న ఎన్నో ప్రశ్నలకు మరోటి చేర్చింది.

## 7

ఆనాటినుంచీ పూర్ణిమలో కొంత మెరుగు కనబడింది. రెండునెలలు గడిచేసరికి శారీరకంగా చాలావరకూ ఆరోగ్యంగానే కనబడుతూంది. కాని అప్పుడప్పుడు మాత్రం పరధ్యాన్యంలో పడుతూంటుంది. అప్పుడుమాత్రం ఆమె ఎవరితో సంభాషించగల స్థితిలో ఉండదు. శేఖర్ ఆమెను ఆ స్థితిలో రెండు మూడుసార్లు చూసేడు.

మరో ముఖ్యమయిన విషయం ఏమిటంటే ఈ రెండు నెలలూ పూర్ణిమకు ఒక్క ఉత్తరంకూడా రాలేదు. ఆఫీసులో కూడా మిగిలిన ఉద్యోగుల మధ్య ఆమె గౌరవం మళ్ళీ పెరుగుతూన్నట్లుంది.

ఆమె మానసికస్థితి బాగుండనప్పుడు మాత్రం అందరూ ఆమెకు దూరంగా ఉండేవారు.

ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆమెతో ఈ విషయం

*With the best compliments of*

# Pioneer Automobiles
&
# Pioneer Tyres

Raja Ramamohan Roy Road, Visakhapatnam-1

Phones : 2224 ; 3430

చర్చించడం శేఖర్‌కు వీలుకాలేదు. ఏదో కారణంగా వాయిదా పడుతూనే వచ్చింది. కాని అతని మనసులో ఉన్న కుతూహలం మాత్రం చావలేదు.

ఆ రోజు సాయంత్రం శేఖర్ పూర్ణిమను డిక్టేషన్‌కు పిలిచేడు.

అతను చెప్తున్నాడు. ఆమె వ్రాస్తూంది.

మధ్యలో ఏదో ఆలోచిస్తూ చెప్పింది మరచిపోయి శేఖర్ ఆమెను ఏమి వ్రాసేవు, అని అడిగేడు.

ఆమె మాట్లాడలేదు. మళ్ళీ ప్రశ్నించేడు. ఆమె తలెత్తి ఏమిటని అడిగింది.

“నా ప్రశ్న వినలేదా?”

“సారీ! మళ్ళీ చెప్పండి.”

“ఏమివ్రాసేవు?”

పూర్ణిమ చివరివాక్యాలు రెండూ చదివింది.

ఆమె మామూలు ధోరణిలో లేదని గమనించేడు శేఖర్. అసలు విషయం అడగాలని ఉంది. కాని ఆమె మళ్ళీ అర్థం చేసుకొనే స్థితిలో ఉన్నట్లు లేదు.

ఆఫీసు అయిపోయే టైముకూడా కావచ్చింది.

“ఈ రోజుకు వెళ్ళు పూర్ణిమా! ఈ లెటర్ రేపు చూద్దాంలే!” అన్నాడు. పూర్ణిమ లేచి వెళ్ళబోయింది.

“ఒక్క నిముషం!” అన్నాడు శేఖర్.

ఆమె వెనక్కి తిరిగింది.

“రేపు ఆఫీసుకు రాగానే ఒకసారి నాకు కనబడు!”

“యస్సర్!” మళ్ళీ వెళ్ళబోయింది.

“ఎందుకో తెలుసా?”

“నో సర్.”

“నేను నీతో ఒక విషయం డిస్కస్ చెయ్యదలచుకున్నాను.”

“ఓ. కె సర్.”

“దేన్ని గురించో తెలుసా?”

“నో సర్.”

“ఎబౌట్ యువర్‌సెల్ఫ్! నిన్ను గురించే!”

పూర్ణిమ తల వంచింది.

“వస్తావుకదూ!”

“ఆల్‌రైట్ సర్.” పూర్ణిమ వెళ్ళిపోయింది.

మరో అరగంట తర్వాత శేఖర్ బయలుదేరేడు. ఆఫీసు గుమ్మం వరకూ వెళ్ళేసరికి కాబిన్‌లో టెలిఫోన్ మ్రోగింది. శేఖర్ వెనక్కివచ్చి రిసీవర్ తీసుకున్నాడు.

“హలో!”

“ఈజిట్ యూనివర్సల్ ఇంజనీరింగ్ కంపెనీ?”


*With best Compliments for Diwali*

# M/s. SREE LAKSHMI AGENCIES

12/235, State Bank Road, GUDIVADA

Phones : Off. 583 Res. 666

*Dealers in all varieties of*

**Fertilizers and Pesticides.**

**Stockists of Durga Brand Cement**

"యస్!"

"మిస్టర్ చంద్రశేఖర్ ప్లీజ్!"

"స్పీకింగ్."

"నేను బషీర్‌బాగ్‌లో ఒక డిపార్ట్‌మెంటల్ స్టోర్‌నుంచి మాట్లాడుతున్నాను. నేను ఇనస్పెక్టర్ గోవిందరావును."

"చెప్పండి."

"మిస్ పూర్ణిమ మీ ఆఫీసులో పనిచేస్తూందా?"

"యస్."

"ఆమె ఇక్కడ నా కస్టడీలో ఉంది."

"కారణం?"

"ఇక్కడ డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో ఆమె ఒక వస్తువు దొంగిలిస్తూ పట్టుబడింది."

"ఇంపాసిబుల్!" శేఖర్ తన చెవులను తానే నమ్మలేక పోయాడు.

"కాని అది జరిగింది. మీకు ఏమయినా ఇంటరెస్ట్ ఉంటే వెంటనే ఇక్కడికి రండి."

"తప్పకుండా! పదినిముషాల్లో వస్తున్నాను. ఈ లోపులో ఆమెను అమర్యాదగా ట్రీట్ చెయ్యకుండా చూడండి."

"ఓ. కె"

శేఖర్ మెదడు పనిచెయ్యడం మానేసింది.

పూర్ణిమను గురించి ఒక విషయం తెలుసుకుందామని ప్రయత్నిస్తూంటే మరో సమస్య తలఎత్తుతూంది. కాని జరిగిన వాటన్నింటిలో ఈ రోజు సంఘటన చాలా విచిత్రమైంది. వెంటనే కారులో కూర్చొని కారు స్టార్ట్‌చేసేడు.

## 8

డిపార్ట్‌మెంటల్ స్టోర్ ముందు కారాపి ఒక్క అంగలో షాపులోకి నడిచేడు శేఖర్.

షాపులో అంతా మామూలుగానే ఉంది. ఎవరెవరో ఏవో కొంటున్నారు. ఒక్కక్షణం తను విన్నదంతా అబద్ధమనీ ఎవరో తనను మోసంచెయ్యడానికి ఊరికే టెలిఫోన్ చేసేరని అనుకున్నాడు శేఖర్.

కౌంటర్ దగ్గరకు వెళ్ళి "ఇనస్పెక్టర్ గోవిందరావు ఎక్కడ?" అని అడిగేడు.

"మీ పేరు చంద్రశేఖరా?" అని అడిగేడతను.

"అవును."

"రండి," అని అతను షాపు కౌంటర్స్‌లోంచి వెనుక భాగంలోకి దారితీసేడు. శేఖర్ అతని వెనుకనే వెళ్ళేడు. చివరకు ఒక చిన్న గదిలోకి వెళ్ళేడు. అక్కడ పోలీసు యూనిఫారంలో ఒకతను ఉన్నాడు. అతని పాకెట్‌మీద


*With Best Compliments of:*

**PRISMA SALES**

**3-5-170/1/1, Narayanaguda, Hyderabad-500029**

Phone : 56684

*Distributors for*

**Sumeet**

**Mixers**



గోవిందరావు అని ఉంది. అతని ప్రక్కనే పూర్ణిమ తల వంచుకొని స్టూలుమీద కూర్చొంది.

శేఖర్ గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది.

"అయామ్ చంద్రశేఖర్. ప్రొప్రయిటర్ ఆఫ్ యూనివర్సల్ ఇంజనీరింగ్ కంపెనీ."

ఇనస్పెక్టరు గోవిందరావు కరచాలనంచేసి జరిగిందంతా చెప్పేడు. పూర్ణిమవైపు రెప్పవాల్చకుండా చూస్తూ శేఖర్ అంతా విన్నాడు.

పూర్ణిమ షాపులోనికి వచ్చి ఏదో వస్తువు చూపించమని అడిగి అతను షోకేసులోంచి అది తీసేలోపల ప్రక్కనే చేతికి అందుబాటులో ఉన్న స్ఫటికంతో చేసిన ఈ క్యూరియో తీసుకొని హేండ్‌బ్యాగ్‌లో వేసుకుంది.

శేఖర్‌కు తాను వింటూన్న దేనిమీదా నమ్మకం కలగడం లేదు.

"నేను ఆమెతో రెండునిముషాలు వేరుగా మాట్లాడవచ్చా!" అన్నాడు శేఖర్.

"తప్పకుండా." గోవిందరావు పక్కగదిలోకి తప్పుకున్నాడు.

"ఏమిటీది పూర్ణిమా!" పూర్ణిమ ముఖం తన వేపు తిప్పుకున్నాడు శేఖర్. ఒకసారి అతని కళ్ళల్లోకి చూసి చూపులు మరల్చింది పూర్ణిమ.

"అది నిజమేనా?"

"నిజమే. నేను దాన్ని దొంగతనం చేస్తుంటేనే పట్టుకున్నారు." నిశ్చలంగాఉంది పూర్ణిమ కంఠం. శేఖర్ ఆ వస్తువువేపు చూసేడు. తపోముద్రలో ఉన్న బుద్ధుడి స్ఫటిక శిల్పం అది.

"ఎందుకీ పనిచేశావు?"

పూర్ణిమ జవాబు చెప్పలేదు.

"ఇది నీకు ఎంత చెడ్డపేరు తెస్తుందో ఆలోచించేవా?"

శేఖర్ ప్రశ్నలు అతనికే వినిపిస్తున్నాయి.

కొద్ది క్షణాల తర్వాత గోవిందరావు లోపలికి వచ్చేడు.

శేఖర్ అన్నాడు, "పూర్ణిమ ఆరు సంవత్సరాలకు పైగా నా ఆఫీసులో పనిచేస్తోంది. ఆమె శ్రమ చెయ్యకుండా దేనికీ ఆశపడే మనిషికాదు. అటువంటి బాధ్యత తెలిసిన మనిషిని నే నిప్పటివరకూ చూడలేదు. కాని ఈ పని తాను చేసేనంటూంది. ఇది నాకు నమ్మశక్యం కాకుండా ఉంది. ఎటువంటి పరిస్థితు లీమెను ఈ పనికి ప్రోత్సహించేయో ఊహించలేకుండా ఉన్నాను. ఈ ఒక్కసారి ఈమెను మీరు మన్నించి వదిలేస్తే నేనెంతో కృతజ్ఞుణ్ణిగా ఉంటాను. దీనివలన వచ్చే కళంకం ఆమె భవిష్యత్తుకు చాలా దెబ్బ తీస్తుంది. ప్లీజ్!" శేఖర్ ఎంతో ప్రాధేయపడ్డాడు.


*Diwali Greetings to all our Patrons and Well Wishers*

## NOTA BENE ENTERPRISES,

(WHOLESALE ELECTRICAL DISTRIBUTORS)
III-S-30, Lal Bahadur Stadium,
HYDERABAD-500 001.

Tel : 37409 Grams : "NOBEEN"

**Products Handled :**

* 'MDS' Loadster Miniature Circuit Breakers & Distribution Boards. * 'Schangler PVC Flexible Conduits & Compression Glands etc. * 'Essen' Controlgear like Pilot Lamps, Micro Switches, Metal Clad Plugs & Sockets etc. * 'Larsen & Toubro' Switchgear * 'Nobeen' Automatic Voltage Stabilisers, Voltage Cutouts etc. * 'Stanley' Iron Clad Switch Fuses and Distribution Boards. * 'Tenby' India range of Electrical Switchgear like Piano Switches, Plugs, Sockets, Tumbler Switches etc. * 'Dowell's' Cable lugs & sockets * Brass Cable Glands, Insulation Tapes * Concorde Light Fittings. * 'Seeco' Servo-Stabilisers, Plating Rectifiers dimmerstats.

"అలాగే. కాని ఒక్క విషయం. ఈ మధ్య చాలా దొంగతనాలు ఇటువంటివి జరిగేయని మాకు కంప్లెంట్సు వచ్చేయి. ఒకసారి ఈమె యిల్లు సోదాచేసి ఏమీ లేకపోతే ఈమెను విడిచివేస్తాను. కాని ఆమె ముందు నడవడికకు మీరు బాధ్యత తీసుకోవలసి ఉంటుంది."

"సర్టెన్లీ!" శేఖర్ ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

ఆమె తరఫున షాపు యజమానికి క్షమాపన చెప్పుకొని పూర్ణిమను వెంటబెట్టుకొని గోవిందరావుతో పూర్ణిమ హాస్టలుకు వెళ్ళేడు.

పూర్ణిమ గదిలోఉన్న అలమారు తెరిచేసరికి శేఖర్ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు.

అదో చిన్నసైజు మ్యూజియంలా ఉంది. అందులో పది పన్నెండు ఎంతో విలువైన వస్తువులు అందంగా పేర్చబడి ఉన్నాయి. వాటికి వాటి ధరల చీటీలు షాపుపేర్లతో సహ ప్రేలాడుతున్నాయి.

"ఇవన్నీ నువ్వు దొంగతనంచేసి తెచ్చినవేనా?" గోవిందరావు తీక్షణంగా పూర్ణిమ కళ్ళల్లోకి చూసి అడిగేడు.

అవునన్నట్లు పసిపిల్లలా తలాడించింది పూర్ణిమ.

"సౌ అయామ్ సారీ మిస్టర్ శేఖర్! ఐ కాంట్ ఒబ్లైజ్ యు!" అన్నాడు గోవిందరావు.

శేఖర్‌కు కడుపులో దేవినట్లయి కళ్ళు తిరుగుతూన్నట్లుగా అనిపించింది.

చేష్టలుడిగి పక్కనున్న కుర్చీలో కూలబడ్డాడు.

**9**

"ఇన్నేళ్ళుగా మీ కంపెనీలో పనిచేస్తూన్న ఆమె ప్రవర్తన, ఆమె నిజాయితీకి మీరిచ్చే ప్రశంసలు ఆమెకు తప్పకుండా సహాయపడతాయి. కాని అసలు మనవరకైనా ముందు ఆమె ఎందుకీ పని చేసిందో అర్థంచేసుకోడానికి ప్రయత్నించండి," అన్నాడు లాయరు కృష్ణమూర్తి శేఖర్‌తో.

పూర్ణిమపైన ఆమె చేసిన దొంగతనాలకు కేసు బుక్ చేసేడు గోవిందరావు.

శేఖర్ తన ఫాక్టరీ లాయరు సలహాపై లీడింగ్ క్రిమినల్ లాయరు కృష్ణమూర్తికి కేసు అప్పగించేడు.

పూర్ణిమకు తాను జామీను ఉండి బెయిల్‌మీద విడిపించేడు. ఆమె దొంగతనం చేసిన విషయం పరిచయంఉన్న అందరిలోనూ ఆ నోటా ఈ నోటా పొక్కిపోయింది.

ఆమె నేరం తెలిసినవారి మధ్య జీవితం ఇంకా కష్టమవుతుందని తన స్నేహితుడి ఇంట్లో పూర్ణిమను ఉంచేడు శేఖర్.


*With the best wishes*
*and Diwali Greetings*

*for all kinds of Paints*

**Sreenivasa Paints Stores**

College Road, Gudivada, Krishna District A.P.

Phone No: 694

*Managing Partner:* **K. Sivaramakrishna**

*Best wishes*
*and*
*Diwali Greetings*

**VIJAY GAS COMPANY**

Agents : "Calgas"

*Proprietor :*
P. LAKSHMANA RAO
*Secretary :* Lions Club of Gudivada
*Managing Partner*
Sree Lakshmi Auto Financiers

**M. M. ENTERPRISES**

9/146, Main Road, Gudivada.

Phone : Off : 398 Res. 388 Grams : Calgas

ఆఫీసులో మాత్రం ఈ మాటలు చర్చకు రాకుండా నారాయణతోనూ, ఫాక్టరీలో ఒకరిద్దరితోనూ సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు.

"అదే నాకూ అర్థంకావటంలేదు. ఎందుకంటే దొంగ తనం ఆమె మనస్తత్వానికి విరుద్ధం. మూడు సంవత్సరాల క్రితం మా ఫాక్టరీలో జరిగిన మరో సంఘటన చెప్తాను.

"నా ఫాక్టరీలో వీరాస్వామి అనే అతను పనిచేసేవాడు. తను పనిలోకి తాగి వచ్చేవాడు. నయానా భయానా చెప్పిచూస్తే లొంగలేదు. చివరకు పనిలోంచి తీసెయ్యడానికి నిర్ణయించుకుంటే వర్కర్స్ యూనియన్‌వాళ్ళు కాళ్ళావేళ్ళాపడి ఉంచమన్నారు. సరేనని దిక్కులేని అతని కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని ఒప్పుకున్నాను. వారం రోజులు తిరక్కుండానే మళ్ళీ తాగివచ్చి ఫాక్టరీలో ప్రమాదంలో ఇరుక్కున్నాడు. ప్రాణం పోగొట్టుకున్నాడు. అతని కుటుంబానికి ఎంత సహాయంచేసినా నేను తీర్చలేని కోరికలు కోరడం మొదలుపెట్టింది యూనియన్. చివరకు వాళ్ళకూ నాకూ వచ్చిన అభిప్రాయభేదాలవల్ల మూడు నెలలు ఆ ఏడాదిలో పని జరుగలేదు. ఆ సంవత్సరం విపరీతంగా నష్టంవచ్చింది. కాని వర్కర్స్ బోనస్ ఇవ్వమని పట్టుపట్టేరు.

"ఇవ్వలేనంటే వర్కర్స్ సమ్మెచేశారు. ఈసారి తమతో ఆఫీసు సిబ్బందిని కూడా కలుపుకున్నారు.

"అలా పదిరోజులు జరిగింది. కాని ఆ పదిరోజులూ పూర్ణిమ ఆఫీసుకు వచ్చింది. ఆమె లోపలకు వస్తూంటే వాళ్ళు చేసిన అసభ్యపు నినాదాలకుగానీ అమర్యాదకుగానీ ఆమె బెదరలేదు.

"ఒకరోజు ఆమె ఆఫీసుకువస్తూంటే కోడిగుడ్లు ఆమెపై విసిరేరు. ఆ రోజు ఆమెను చూస్తే ఆమెకూడా సమ్మెలో చేరితే బాగుండుననిపించింది నాకు.

"చివరకు నేను వారి బలవంతానికి కొంతవరకు తల వంచవలసి వచ్చింది. ఎందుకంటే అప్పటివరకు వచ్చిన నష్టాలు రాగా నేను వారికిచ్చే బోనసుకంటే ముందు పని ఆగిపోవటంవల్ల జరిగేనష్టం ఇంకా ఎక్కువగా కనబడింది. గత్యంతరంలేక ఒప్పుకున్నాను. నష్టం వచ్చినా వర్కర్సుకు బోనస్ ఇచ్చేను. కాని పూర్ణిమ బోనస్ తీసుకోలేదు.

ఆ మర్నాడు ఆమెను పిలచి అడిగేను.

"బోనస్ తీసుకోలేదని మేనేజరు చెప్పేడు."

"అవును".

"ఎందుకు తీసుకోలేదు."

"తీసుకోవాలనిపించలేదు."

"కారణం ఏమిటి?"

"ఇష్టాయిష్టాలకు పెద్దగా కారణాలు ఆలోచిస్తామా?"

"సరే! కొన్ని పరిస్థితులవల్ల నా పాయింట్ వాళ్ళు అర్థంచేసుకోకపోయినా నేను వాళ్ళకు బోనస్ ఇవ్వవలసి వచ్చింది. అర్థంచేసుకున్న నీకు ఇవ్వకపోవడం అన్యాయం కదూ!"

"మీరు ఇవ్వడానికి ప్రయత్నించేరుగా! మీ లోపం ఏముంది?"

"నువ్వు తీసుకుంటే నాకు సంతోషంగా ఉంటుంది".

"సారీ సర్! మీ సంతోషంకోసం నేనెలా తీసుకుంటాను. కారణం అడిగేరుగా! వినండి. మీ పాయింట్ అర్థంచేసుకున్న తర్వాత ఎలాగ తీసుకోగలుగుతాను!"

"నువ్వు నా దృష్టితో ఆలోచించడానికి ప్రయత్నించు."

"అవే మాటలు నేనూ చెప్పవలసివస్తుంది. మరోలా అనుకోవద్దు."

"పోనీ నీ విచక్షణాజ్ఞానానికి నా కాంప్లిమెంట్స్‌గా దీన్ని తీసుకో!"

"దానికీ మాటలు చాలు! థాంక్యూ వెరీమచ్ సర్!"

"ఆమె తీసుకోకుండానే వెళ్ళిపోయింది. అందుకని ఇందులో తప్పకుండా ఏదో అర్థంకాని విషయం ఒకటి ఉంది," అన్నాడు శేఖర్.

"పోనీ! రవి ప్రోత్సాహంవల్ల ఆమెకు గత్యంతరంలేక చేసి ఉండవచ్చునేమో!"

"కావచ్చు. అయినా ఆమె దొంగతనం చేసిన వస్తువులన్నీ రెండునెలల లోపలివేనని తేలింది. ఒకవేళ అలా చేసినా ఆమె వాటిని కంటికి కనబడకుండా దాచడానికీ ప్రయత్నించలేదు. అడగ్గానే తానే తీసేనని ఒప్పుకుంది. పైగా వాటినుండి షాపు చీటీలు కూడా వేరుచేయలేదు. తన స్వప్రయోజనానికి ఒక్క వస్తువుకూడా వాడుకోలేదు."

"అంతా నిజమే! ఇవన్నీ ఆమెకు విధించే శిక్షను తగ్గించడానికి పనికిరావచ్చు. కాని ఆమె నేరం చెయ్యలేదన్నది మనం కోర్టులో చెప్పగలిగి ఉండాలి. కనీసం ఆమెవరకు అయినా నేరం చెయ్యలేదన్న మాట ఆమె అనాలి. ఈ విషయమే ఆమెకు అనేకసార్లు చెప్పవలసివచ్చింది".

"ఏమంది?"

"సరేనంది."

"అయితే నేనుకూడా చెప్పి చూస్తాను."

"అంతేకాదు. ఏ విధంగానైనా నేరం ఆమెమీద మోపడానికి కోర్టులో ప్రాసిక్యూషన్ వారు రకరకాలుగా ప్రశ్నలడుగుతారు. వాటన్నింటికీ నేను చెప్పిన పద్ధతిలో జవాబు చెప్పాలి."

"అది నేను చూసుకుంటాను. ఆమె ఏ ప్రశ్నకు ఏ జవాబు చెప్పాలో మీరు వివరంగా చెప్పండి."

"సరే! రేపు సాయంత్రం ఆమెను తీసుకొని రండి. వీటిని గురించి వివరంగా మాట్లాడుకుందాం."

"అలాగే!" శేఖర్ కృష్ణమూర్తి ఆఫీసులోంచి బయటకు వచ్చేడు.

## 10

కోర్టుహాలు కిక్కిరిసి ఉంది జనంతో.

బోనులో పూర్ణిమ నిలబడి ఉంది. ఆమె ముఖంలో ఎటువంటి సంచలనమూ లేదు.

కాని ఇంతమంది జనంమధ్య నేరస్తురాలిగా బోనులో నిలబడ్డ ఆమెను చూస్తూంటే శేఖర్ గుండె తరుక్కుపోతూంది.

తనకు తెలిసినదానికంటే ఆమెను తాను ప్రేమిస్తున్నానని గ్రహించేడు.

విచారణ మొదలుకాగానే పబ్లిక్ ప్రాసిక్యూటరు పూర్ణిమ చేసిన నేరాన్ని వివరించేడు.

దానికి ఆమె సమాధానం చెప్పేముందు భగవద్గీత తీసుకొచ్చి దానిమీద చేయిపెట్టి ఆమెను ప్రమాణం చెయ్యమన్నారు.

ఆమె భగవద్గీత మీద చెయ్యిపెట్టింది. ఆమె ముఖంలో నిర్మలత్వానికి ఆశ్చర్యపోయేడు శేఖర్. ఆ పరిసరాల్లోంచి ఎక్కడికో దూరంగా చూస్తున్నట్లుంది ఆమె.

"నేను దేవునిసాక్షిగా నిజమే చెప్తాను."

అంత మనస్ఫూర్తిగా ఎవరూ ప్రమాణం చెయ్యలేదనిపించి శేఖర్‌కు చివరకు ఏమి చెప్తుందోనని భయం కలిగింది.

"ప్రాసిక్యూషన్‌వారు నీ మీద ఆరోపించిన నేరాన్ని నువ్వు ఒప్పుకుంటున్నావా?" జడ్జి అడిగేడు.

"అవును. వారుచెప్పిన ప్రతివస్తువూ నేనువెళ్ళిదొంగతనం చేసిందే. చదువుకొని సంస్కారవంతురాలయి ఈ సమాజంలో బాధ్యత చూపించవలసిన నేను నీచాతినీచమయిన పని చేసేను. నేను అన్నివిధాల శిక్షకు అర్హురాలినే. మీ రూల్స్ ప్రకారం ఈ నేరాలకు ఎంత కఠినమైన శిక్షఉందో అంతా విధించండి. ఐ డిజర్వీట్ ఆల్"

పూర్ణిమ కళ్ళవెంబడి బొటబొటా కన్నీళ్ళు కారిపోయాయి.

శేఖర్ గొంతులో ఏదో ఉండలా అడ్డుపడింది.

కోర్టులో అలజడి ప్రారంభమయింది. జడ్జిగారే ఇంకా ఆశ్చర్యంనుంచి కోలుకున్నట్లులేదు. పబ్లిక్ ప్రాసిక్యూటర్


మమ్మల్ని ఆదరిస్తున్న మా శ్రేయోభిలాషులకు, మా ఖాతాదారులకు,
లారీ యజమానులకు, లారీ కార్మికులకు అందరికీ

మా దీపావళీ శుభాకాంక్షలు!

* అన్ని ప్రాంతాలకు * అన్ని వేళలలో

లారీలు సప్లయి చేయుటయే
మా ప్రత్యేకత !

ఇట్లు :
ఎగ్జిక్యూటివ్ కమిటీ

* ఆరవీటి లక్ష్మయ్య * కిలారి అప్పారావు * నర్సపల్లి తాతారావు
* మత్సా లక్ష్మణరావు * రఘుమండ్ల వెంకటేశ్వరరావు

THE NATIONAL LORRY SUPPLIERS ASSOCIATION

Transport Contractors & Lorry Suppliers

INNISPET, RAJAHMUNDRY-1

Phones: 5195 & 5236

ముఖం చిన్నబోయింది. క్రిమినల్ లాయరు కృష్ణమూర్తి నవ్వుకున్నాడు.

అంతరాంతరాల్లో శేఖర్‌కు ఎందుకో కొంత సంతృప్తి కలిగింది. అవును. ఆ దొంగతనాలు మాత్రం ఎందుకు చేసిందో అర్థంకాకపోయినా కోర్టులో ఆమె చెప్పిన ప్రతి అక్షరం ఆమె వ్యక్తిత్వానికి ప్రతిబింబంగా ఉంది.

పది నిముషాల తర్వాత అలజడి తగ్గింది.

కేసు విచారణ వారంరోజుల తర్వాతకు వాయిదా వేసేరు జడ్జి.

వారం రోజుల తర్వాత మరో ఆరు నెలలు కేసును వాయిదా వేసేరు. కాని ఈలోపల ముద్దాయియొక్క చర్యలు దొంగతనం కావాలని చేసినట్లుగా లేదనీ దీని వెనుక ఏవో తీవ్రమైన మానసిక సంఘర్షణ ఉండి ఉండవచ్చనీ దానికి తగిన కారణాలు తెలిసేవరకూ శిక్ష విధించడం సబబుకాదనీ నిర్ణయించి పూర్ణిమయొక్క సాంఘిక పరిస్థితులను ఈ లోపున పూర్తిగా దర్యాప్తు చేయాలని ఆర్డర్సువేసేరు.

ఆ దర్యాప్తు బాధ్యత ప్రొబేషన్ ఆఫీసరు వివేకానందానికి అప్పగించారు.

కేసు పూర్తిగా స్టడీచేసి వివేకానందం చేసిన మొదటి పని ఏమిటంటే అతను శేఖర్‌ను కలిసి ఆమె మానసిక పరిస్థితి అప్పటికంటె దిగజారకుండా ఉండడానికి ఆమెను ఉద్యోగం లోంచి తొలగించరాదనీ ఆమె నిత్యకృత్యాల్లో ఎటువంటి మార్పు రారాదనీ సూచించేడు.

వివేకానందాన్ని చూడగానే శేఖర్‌కు కూడా ఎందుకో పూర్ణిమ సమస్య పరిష్కారాని కొస్తుందనే అనిపించింది. తాను కూడా ఆమె శ్రేయోభిలాషినేననీ ఆమె మంచికి తాను అన్నివిధాల సహకరించగలననీ చెప్పేడు.

## 11

అదొక మారుమూల పల్లెటూరు.

ఊరి చివర దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతున్నాయి.

గుడి మండపంలో రామభజన జరుగుతూంది.

భక్తులందరూ భజనపారవశ్యంలో ఊగిపోతున్నారు. ఒక పన్నెండేళ్ళపిల్లవాడు మండపం చివర కూర్చున్న ఒక పిల్లవాడి చెవిలో ఏదో చెప్పేడు. ఆ వార్త ఒకరినుండి ఒకరికి పాకి రెండో చివరఉన్న ఒక పండు ముదుసలి చెవిలో పడింది. ఆమె కావిరంగు తేలిన చిరిగిన తెల్లబట్ట కట్టుకుంది.

ఆమె శరీరంలాగే శిధిలావస్తలోఉన్న చేతికర్రను ఆసరాగా చేసుకొని బట్టకొంగు తలమీదకు లాక్కొని


**ANDHRA PRADESH STATE FILM DEVELOPMENT CORPORATION LTD.**

(A State Government Undertaking)
"GRUHAKALPA," M.J. Road, Hyderabad-500001.

**GIVING FILLIP FOR DEVELOPMENT OF FILM INDUSTRY IN ANDHRA PRADESH**

| | |
|---|---|
| **LOANS FOR CONSTRUCTION OF CINEMA HALLS**<br>Loans are restricted for towns/villages with a population of 50,000 and below<br>Total outlay not to exceed Rs. 6.00 lakhs<br>Loan upto Rs. 3 lakhs or 2/3 whichever is less | **PROGRESS AS ON 15-9-78**<br>Loans sanctioned for construction of 93 Cinema Halls—Rs. 216.62 lakhs |
| Loan repayable in 84 monthly instalments Interest @ 15% with a rebate of 3% for punctual payment on due dates | Number of Cinema Halls commenced business—40 |
| **LOANS FOR CONSTRUCTION OF FILM STUDIOS, LABORATORIES ETC..**<br>Loan assistance upto 70% to 80% of the cost of the project<br>Interest @ 9% for first 5 years and 12% for subsequent 10 years | Loans sanctioned to 5 Film Studios—Rs. 75.09 lakas |
| **DOCUMENTARIES AND NEWSREELS**<br>Purchase and production of documentaries on behalf of Government of Andhra Pradesh and supply to departments of Andhra Pradesh Government for exhibition through their field units. | Number of documentaries produced—5<br>Number of documentaries supplied to A.P Government Departments—37 |

***And many more other activities for the growth of Film industry in Andhra Pradesh***

*Managing Director :* A. R. BAJI

అడుగడుక్కీ తడిమిచూసుకుంటూ మండపందాటి బయటకు వచ్చింది.

"వారేనండి!" అని వివేకానందానికి ఆ ముదుసలిని చూపించేడు మొదట వార్త తెచ్చిన పిల్లవాడు.

వివేకానందం ముందుకువచ్చి ముసలావిడకు తన చేయి ఆసరానిచ్చేడు.

"నమస్కారం మామ్మగారూ! నేను మీతో మాట్లాడాలని పనికట్టుకుని పట్టంణంనుంచి వచ్చేను."

"ఎవరు నాయినా నువు?" అంటూ ముఖం పోల్చుకోడానికి ప్రయత్నించింది ముసలమ్మ.

"నన్ను మీరిదివరకు చూడలేదు. కాని మీ తమ్ముడు శ్రీనివాసరావుగారి కుటుంబంతో కొంచెం పరిచయం ఉంది.... ఇక్కడ కూర్చుందామా లేక...."

"నడు నాయనా! గుడిగోడకవతలే నా కొంపా ఉంది. అక్కడికే వెడదాం," అందామె.

అదికూడా పూర్తిగా జీర్ణావస్థలో ఉన్న పూరిపాక. మట్టిగోడలు చౌడు రాలుతున్నాయి. వెడుతూనే ఆ నడక అలసటకే ఆమె గుమ్మంలో చతికిలబడింది. ఆయాసంతో రొప్పుతూంది. ఆమె సైగ గ్రహించి వివేకానందం ప్రక్కనేఉన్న ఒక చింకిచాప పరుచుకొని కూర్చున్నాడు.

తాను తెచ్చిన పళ్ళను సంచిలోంచి తీసి భక్తితో ఆమె పాదాలముందు ఉంచేడు. అంత అభిమానంతో ఆమె కెవరూ ఏమీ ఇవ్వలేదేమో ఆమె నమ్మలేనట్లుగా వివేకానందంవైపు రెప్పవాల్చకుండా చూసింది. జీవిత సంధ్యలోఉన్న ఆమె ముఖంలోని ఆ ముద్ర వివేకానందానికి ఎన్నో కథలు అస్పష్టంగా సూచించింది.

"శ్రీనివాసరావు నాకు చివరి రోజుల్లో పరిచయం. వాళ్ళ స్వగ్రామం ఇదేనని తెలిసి ఇటువెడుతూ వాళ్ళవాళ్ళెవరయినా ఉంటే ఓసారి శ్రీనివాసరావును చూసినట్లే ఉంది. మీరంటే ఆయనకు ఎంతో అభిమానం...."

ఎక్కడో ముసలమ్మకు లింకుదొరికింది. పాత జ్ఞాపకాలూ మాసిపోయిన మమతలూ వ్యథలూ కథలుగా గుర్తుకొచ్చేయి.

వివేకానందం వింటూ కూర్చున్నాడు.

"....శ్రీనివాసు కొండమీద దేవుడంత గొప్పవాడు. మా అమ్మానాన్నల సంతానంలో కడపటివాడు. అందరి మధ్య ముద్దుగా ముద్దుకృష్ణుడిలా పెరిగేడు. ఏ ఆట ఆడితే ఏ పాట పాడితే ఏ చదువు చదువితే అందులోనే ఫస్టు. వాడి కేగాలి సోకిందో చదువుకొనే రోజుల్లో స్వాతంత్రం స్వాతంత్రం అంటూ అందులో దిగేడు. అష్టైశ్వర్యాలు వదిలి


***With Best Compliments from:***

# SUNIL ENGINEERING COMPANY

*Dealers in*

Workshop Machinery, Garage Equipments, Wood Working Machinery, Dairy Equipments, Wet-Grinders

***Specialists in:***

Gas & Arc Welding Equipments and Accessories etc.

**Pandit Jawaharlal Nehru Road,**

**Opp. Tarapet Goods-Shed, Vijayawada - 520 001**

Phones : Office : 77357
Resi : 73332

ఖద్దరు బట్టలు కట్టుకొని ఖద్దరుబట్టలమ్ముతూ రోడ్లమ్మట తిరిగేవాడు. ఎప్పుడింటికొస్తాడో ఎప్పుడు రాడో తెలిసేది కాదు. ఉన్నట్లుండి నెలలు తరబడి కనబడేవాడు కాదు. ఏమిటంటే జైలులో పెట్టేరనేవారు. మగవాడు చాటున బ్రతికే మాకు ఏదీ స్పష్టంగా తెలిసేదికాదు. ఆరోజుల్లోనే వాడి కాలేజిలో చదివే అమ్మాయి రాధాదేవితో పరిచయం అయిందట. ఇద్దరూ కలిసికూడా ఒకటి రెండుసార్లు జైలుకు వెళ్ళేరట. ఆ పరిచయమే పెళ్ళివరకూ వచ్చింది. ఆ విషయం తెలిసి మానాన్న ప్రళయకాల రుద్రుడయ్యేడు. ఏమిటంటే ఆ అమ్మాయిది భోగంకులంట! వాడు ఆయన కొడుకేగా! పట్టుదలలో మరో ఆకు ఎక్కువే చదివేడు. ఆ పెళ్ళే జరిగితే మళ్ళీ గుమ్మం తొక్కనక్కరలేదని మా నాన్న ఖండితంగా చెప్పేసేడు. ఆ రోజు వెళ్ళినవాడు తిరిగి గుమ్మం తొక్కనేలేదు. మా అమ్మ వాడికోసం బెంగపెట్టుకొని వాడిపేరు జపంచేస్తూనే ప్రాణంవిడిచింది. వాడు ఆ పెళ్ళిపేరు చెప్పుకొని బంధువులనూ ఆప్తులనూ ఆస్తినీ అన్నింటినీ దూరం చేసుకున్నాడు. ఆగర్భ శ్రీమంతుడై వుండికూడా పరాయిదేశం పొట్ట పోసుకోడానికి వెళ్ళినవాడిలా బ్రతకవలసివచ్చింది. ఏమిటో నాయనా! కాలం న్యాయం వాడివైపే ఉందని ఋజువు చేసింది. బంధువులు వెలివేసేరనే రోషంతోనేమో కులం వేశ్యాకులమైనా పతివ్రతలను తలదన్ని బ్రతికింది రాధాదేవి. ఇంకా మావాళ్ళల్లోనే అల్లరిచిల్లరగా తిరిగి తరతరాలు కూర్చొని తిన్నా తరగని ఆస్తిని తరంమారగానే ఈ స్థితికి తీసుకొచ్చేరు. ముద్దుల తమ్ముడిని ఒక్కరోజు ఇంటికి పిలచి విస్తరివేసి భోజనం పెట్టలేకపోయాననే బాధ నాకు మిగిలింది గాని వాడి గౌరవానికి ఎక్కడా ఏలోటూ రాలేదు. అందరూ అందలాలెక్కించి ఊరేగించేరు. ఆరేళ్ళక్రితం వాడు పోయేముందు కూడా అయినవాళ్ళందరూ నన్ను దిక్కులేనిదాన్ని చేసినా వాడే నాకు దిక్కై ఆదుకున్నాడు. నెలనెలా నా రోజు గడవటానికింత పంపేవాడు.... మేరువు పర్వతంలాంటి కొంప కూలి చెట్టుకొకరూ పుట్టకొకరూ అయి చెదిరిపోగా పొట్ట చేత్తోపట్టుకొని వెళ్ళినవాడే కాలేజీలో లెక్చరరుగా చేరి ప్రిన్సిపాలయి బుద్ధికి బృహస్పతిలా బతికేడు...."

## 12

మద్రాసు మహానగరం సాయంత్రం అయిదుగంటలకు సముద్రం నేలమీదకు నిప్పులు చెరుగుతూంది.

వివేకానందం టి. నగర్‌లో బస్సుదిగేడు. రెండడుగులు ముందుకువేసి ప్రక్కవీధిలోకి నడుస్తూన్న ఒక యువతిని వెంకట్రామ అయ్యర్ వీధి ఎక్కడని అడిగేడు. ఈ పక్క రోడ్డే అని చెప్పిందామె. నెలలు నిండి అడుగులో అడుగు

*With the best compliments of*

**SRI RAMDAS MOTOR TRANSPORT LIMITED**

**RAJAHMUNDRY**

వేసుకుంటూ నడుస్తోంది ఆమె. వివేకానంద తొందరగా ముందుకు నడచి వెళ్ళిపోయాడు. ఇంటినంబరు చూసుకొని ఒక యింటిముందుకెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కేడు.

పదేళ్ళ పిల్లవచ్చి తలుపు తీసింది.

"వరదరాజన్‌గారు మీ నాన్నగారా అమ్మా!"

"అవును."

"ఉన్నారా?"

"లేరు. ఇంకా ఆఫీసునుంచి రాలేదు."

"మీ అమ్మగారు?"

"డాక్టరు దగ్గరకెళ్ళేరు. వచ్చేవేళయింది."

"అయితే ఇంకో పావుగంట పోయేక మళ్ళీ వస్తాలే." అని వెనక్కి తిరగబోయేడు వివేకానందం.

"కావలిస్తే ఇక్కడ కూర్చోవచ్చు. కూర్చోండి." అంది అమ్మాయి,

వివేకానందం కూర్చున్నాడు. పక్కనున్న పత్రికలేవో తిరగేస్తున్నాడు.

"అమ్మా ఎవరో వచ్చేరే!" అని అమ్మాయికంఠం విని లేచి నిల్చున్నాడు.

వచ్చినామెను చూడగానే ఆశ్చర్యపోయాడు.

ఈ వీధి ఎక్కడ అని అడిగిన నిండుచూలాలే ఆమె.

"మిమ్మల్నడిగే ఇక్కడికి వచ్చేను. ఈ యింటి యజమానురాలు మీరేనని తెలియలేదు."

"వారు వచ్చేటప్పటికి రాత్రి ఎనిమిదిగంటలుదాకా కావచ్చు. ఉంటారా! లేకపోతే...."

"నేను వారికోసం రాలేదు. మీ కోసమే వచ్చేను...."

"నాకోసమా! నే నెప్పుడూ మిమ్మల్ని చూడలేదే!...."

"మీ పేరు శివకామి కదూ!"

"అవును."

"నా పేరు వివేకానందం. ఆంధ్రప్రదేశ్ పోలీసు డిపార్టుమెంటులో ప్రొబేషను ఆఫీసరుగా పనిచేస్తున్నాను. ఒక కేసులో కొన్ని వివరాలు కావలసివచ్చి మీ దగ్గరకు వచ్చేను...."

శివకామి ముఖంలో ఆందోళన గమనించేడు వివేకానందం.

"ఇందులో మీరు భయపడవలసిందేమీలేదు. మీకు సంబంధించిన కేసు కూడా కాదు. కాని నాకు కావలసిన వివరాలు మీకు కొన్ని తెలుసు."

"నాకేమీ అర్థంకావటంలేదు."

"మీరు కూర్చోండి. నేను ఒక అరగంటలో వెళ్ళిపోతాను. నేను అడిగిన ప్రశ్నలకు మీకు తెలిసిన వివరాలు చెప్పండి."


*With best compliments of*

# BALRAM & Co.,

**Engineers & Contractors**

**Specialists For Bridges, Buildings, Workshop and Road Repairs**

**VISAKHAPATNAM-14**

శివకామి కూర్చుంది.

"మీరు విశాఖపట్టణంలో చదివేరుకదూ!"

"అవును. అప్పుడు మా నాన్నగారక్కడ ఉద్యోగం చేసేవారు."

"మీకు పూర్ణిమ అనే అమ్మాయి తెలుసా?"

"తెలియకపోవడమేమిటి? ఆ అమ్మాయి నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్."

"ఆమెగురించి మీకు తెలిసిన వివరాలు చెప్పాలి."

ఈ లోపులో శివకామి కూతురు నిమ్మకాయ షర్‌బత్ కలిపి తీసుకొచ్చింది. శివకామి మెల్లగా చెప్పడం మొదలు పెట్టింది.

"....పూర్ణిమ ఆ కాలేజి ప్రిన్సిపాలు శ్రీనివాసరావు గారి ఒకే ఒక్క కూతురు. కాలేజిలో చేరినప్పుడే నాకామెతో పరిచయమైంది. కొద్దిరోజుల్లోనే పరిచయం ప్రాణస్నేహంగా మారింది. ఎన్నోసార్లు నేను వాళ్ళింటికెళ్ళాను. వాళ్ళింట్లో వాళ్లంతా ఎంతో మంచివాళ్ళు. కాలేజీలో ప్రిన్సిపాల్‌గారిని గురించి అందరూ ఎంతో భక్తితో గౌరవంతో చెప్పుకునేవారు.

విద్యార్థులందరికీ ఆయనంటే దేవుడితో సమానం. వాళ్ళమ్మగారు నన్నెంతో ఆప్యాయంగా చూసుకొనేవారు. పూర్ణిమ నిజంగా అపురూపమయిన అందంకలదీ. వాళ్ళ నాన్నగారిలాగే ఆమె ఏ పని చేసినా అందులో ఏ ఆక్షేపణా ఉండదు.

....మేము ఫైనలియర్ చదివేటప్పుడు ఎలక్షను రోజుల్లో పూర్ణిమకు రవి అనే అబ్బాయితో పరిచయం అయింది. మేమందరం కలిసి ఒకరోజు మా వెయిటింగ్‌రూమ్ దగ్గర జరిగిన ఒక సంఘటన మూలాన అతని తరపున కాన్వాసుచేసి అతన్ని గెలిపించేం. ఆ తర్వాత వాళ్ళిద్దరి పరిచయం ప్రణయంగా మారింది. కాలేజిలో అందరూ వాళ్ళను గురించే చెప్పుకొనేవారు. నా కా రోజు ఇంకా బాగా గుర్తుంది. ఆ సంవత్సరం వార్షికోత్సవంతోపాటు శ్రీనివాసరావుగారు ఉద్యోగంలోంచి రిటైరయే ఫంక్షనుకూడా ఏర్పాటుచేసేరు. ఆ ఫంక్షనులో ఎంతోమంది గొప్ప గొప్ప నాయకులందరూ వచ్చి ఆయన దేశానికి చేసినసేవను ఎంతగానో కీర్తించేరు. స్వాతంత్ర్యంకోసం ప్రాణాలకు తెగించి పోరాడి అది వచ్చిన తర్వాత ఆ ఉత్సాహాన్ని వదలకుండా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి ఎంతోమంది ఆదర్శవంతులయిన పౌరులను తయారు చేసిన గొప్ప ఆదర్శమూర్తి అని పొగిడేరు. ఆ తర్వాత ఆ సంవత్సరం అనేక పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు పంచేరు. ఆ రాత్రి ఇంచుమించుగా అన్ని


*With best compliments from*

**BATCHU LINGIAH & SONS**

**PAPER MERCHANTS**

6, General Bazar, Secunderabad-500 003.

Phones : 72997

**Grams : "Newsprint"**

బహుమతులూ రవే గెల్చుకున్నాడేమో ననిపించింది. అతను వేదికమీదికి ఎక్కడం దిగడంతోనే ప్రైజంతా గడిచి పోయింది. అదయిన తర్వాత నేనూ. పూర్ణిమా నాట్యం చేసేము. గ్రీన్‌రూమ్‌లో వేషం తీసేస్తుంటే రవి వచ్చి కంగ్రాచులేషన్స్ చెప్పేడు.

ఆ రోజు తన తండ్రికి అంత గౌరవం జరగడం, రవి అన్ని బహుమతులు గెల్చుకోవడం, తాను మనసు సంతోషంతో నిండి నాట్యంచేయడం — ఆరోజు తన జీవితంలో మరచిపోలేని రోజని పూర్ణిమ రవితో అంది. అందుకని నాకూ్కడా ఆరోజు గుర్తుండిపోయింది...."

"రవిని గురించి మీరేమయినా చెప్పగలరా ?" వివేకానందం అడిగేడు.

"ఏమని చెప్పను. నాకు కాలేజి రోజులు గుర్తుకు వచ్చినప్పుడు అతనొక్కడూ ప్రత్యేకంగా స్ఫురిస్తాడు. అదీకాక పూర్ణిమలాంటి ఆడదాని మనసు ఆకర్షించ గలిగేడు...."

"అంతే?"

"పూర్ణిమ పెర్ఫెక్షనిష్టు. ఏమాత్రం లోపమున్నా ఆమెకేదీ నచ్చదు."

"పూర్ణిమతో మీ కెన్నాళ్ళవరకూ పరిచయం నిలిచింది?"

"ఆ సంవత్సరం చదువు కాగానే పెళ్ళి జరిగింది. ఆ తర్వాత ఉత్తరాలలోనే విషయాలు తెలిసేయి. వాళ్ళ నాన్న గారికి గుండెపోటువచ్చి చనిపోయారనీ, తరువాత ఆరేడు నెలలకు వాళ్ళమ్మగారు కూడా పోయారనీ తెలుసు. తర్వాత నేనెన్ని ఉత్తరాలు వ్రాసినా ఆమె జవాబువ్రాయలేదు."

ఆ తర్వాత వివేకానందం పూర్ణిమ చిక్కుకున్న కేసు సంగతి చెప్పేడు.

శివకామి ముఖంమీద విస్మయముద్ర చూసేడు.

"నో నో! నేనిది ఎన్నటికీ నమ్మను. ఇందులో ఏదో మోసం ఉంది. ఆమె గొంతులో ఊపిరి ఉండగా ఆమె ఇటువంటి పని చెయ్యదు. ఆమె ఇటువంటి పనిచేస్తే ఇంక ఎవరు ఏ పని చేస్తారన్నా ఆశ్చర్యపడనక్కర్లేదు."

వివేకానందం వెళ్ళేటప్పుడుకూడా శివకామి ముఖంమీద ఏదో నమ్మలేని విషయాన్ని చూసినట్లున్నభావం చెరిగి పోలేదు.

## 13

సికింద్రాబాదు టెలిఫోన్ భవన్. చేతిలో చీటీ ప్యూనుకిచ్చి రెండవ అంతస్తు బాల్కనీలో నిలబడ్డాడు వివేకానందం. పక్కనున్న తలుపు తెరుచుకొని పదిమంది ఆడవాళ్ళు


DIWALI GREETINGS to
Our Clients and Well Wishers

**VEERALAKSHMI ENTERPRISES**

**125/F-6, Sree Balaji Complex, Sultanpet, BANGALORE-560 053**
**Grams : 'BOXBOARDS' Phone : 70004**

**Wholesale Dealers for**

**M/s. PAPER & PULP CONVERSIONS LTD., PUNE**

*Manufacturers of*

Super White Deluxe Duplex Boards, Super White Triplex Boards, Corrugated Media, Mill Boards & Unbleached Duplex Board, File Boards, Stationery Boards etc.

**M/s. EUROKOTE (INDIA) LTD., PUNE**

*Manufacturers of*

Plastic Coast Coated Boards, Papers in White & Colours.

బయటకు వచ్చేరు. వాళ్ళ మాటలతో నవ్వులతో అంతా నిండిపోయింది.

మరుక్షణంలో లోపలికెళ్ళిన ప్యూను బయటికొచ్చి "సుమిత్రాదేవిగారూ!" అని పిలిచాడు.

వెడుతున్న ఆడవాళ్ళలో ఒకామె వెనక్కి తిరిగింది. ఎర్రని అంచున్న తెల్లచీర కట్టుకున్న ఆ అమ్మాయికి సుమారు పాతికేళ్ళుదాకా ఉండొచ్చు.

"మీ కోసం ఎవరో వచ్చేరు," అని ఆమెను వివేకానందం వద్దకు తీసుకొచ్చేడు.

"నమస్కారమండి. సుమిత్రాదేవిగారు మీరేనా?"

"అవునండి."

"పనిమీద వెడతున్నారా?"

"లంచికి వెడుతున్నాను."

"నా పేరు వివేకానందం. పోలీసు డిపార్టుమెంట్‌లో ప్రొబేషను ఆఫీసర్ని. మీ పక్కరూములో ఉండే పూర్ణిమను గురించి కొన్ని వివరాలు కావాలి....మీకు అభ్యంతరం లేకపోతే ఈ పూట లంచ్ నాతో తీసుకుంటే చాలా సంతోషిస్తాను."

"ఓ.కే. ఏజ్‌యూ ప్లీజ్."

ఇద్దరూ తాజ్‌మహల్ హోటల్‌కు వెళ్ళేరు.

"ఫామిలీ రూమ్‌లో కూర్చుంటే కొంచెం మాట్లాడుకో డానికి వీలుగా ఉంటుంది," అన్నాడు వివేకానందం.

సుమిత్ర మాట్లాడకుండా లోపలకు నడిచింది. బేరర్‌కు లంచ్ ఆర్డరిచ్చేసి కూర్చున్నాడు వివేకానందం.

"ముందు ఆమెనుగురించి మీకు తెలిసిన వివరాలు చెప్పండి. తర్వాత నాకు ఏమైనా ప్రత్యేకమయిన వివరాలు కావలిస్తే అడుగుతాను. తెలిస్తే చెబుదురుగాని."

సుమిత్ర చెప్పడం మొదలుపెట్టింది.

"....సుమారు ఆరు సంవత్సరాలక్రితం ఉద్యోగంలో చేరగానే పూర్ణిమ హాస్టలుకు వచ్చి చేరింది. రాగానే వెళ్ళి రెండుమూడు గంటలు కూర్చొని బోర్ కొట్టేసేను. ఆమె చాలా ముభావంగా ఉండేది. కొత్తలో కొన్ని రోజులు ఆమె చాలా గర్విష్ఠి అనుకున్నాను నేను. కాని అది ఆమె స్వభావమే నని తరువాత గమనించేను. నాకు ఎప్పుడూ ఏదో మాట్లాడితే గాని తోచదు. అందులో పక్కరూమ్‌లోఉన్న మనిషి మాట్లాడకపోతే ఎలా? మా ఇద్దరిమధ్య మాత్రం సంభాషణ ఎప్పుడూ వన్‌వేట్రాఫిక్. మా కుటుంబం సంగతులు మా ఆఫీసు సంగతులు అన్నీ నేనామెతో చెప్తూంటాను కాని ఆమెదగ్గరనుంచి అడిగిన ప్రశ్నకు జవాబేకాని మరో అక్షరంకూడా ఎక్కువరాదు.


దీపావళి
శుభాకాంక్షలు

ఈ దీపావళి ప్రత్యేక సంచిక

**మా 14 pt. టైప్‌తో ముద్రింపబడినది.**

స్వతంత్ర టైప్ ఫౌండ్రి

**గాంధీనగర్, విజయవాడ - 520003.** ఫోన్ : 76334

*లోకల్ ఏజంట్లు :*

శ్రీ లక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, లకిడికాపూల్, హైదరాబాద్. ఫోన్ : 35842

నాకు ఇంటిదగ్గరనుండి ఉత్తరాలు చాలా తరచుగా వస్తూండేవి. ఉత్తరాలు వచ్చినప్పుడు మాత్రం పూర్ణిమ కొంచెం కుతూహలం చూపించేది. ఎవరిదగ్గర్నుంచి అని అడిగేది. జవాబు విని నేను ఉత్తరం చదువుకొనే లోపల ఏవో ఆలోచనల్లో మునిగిపోయేది.

అక్కడ ఉన్న ఇన్ని సంవత్సరాలలోనూ మరీ అవసర మున్నప్పుడు తప్ప ఆమె హాస్టల్‌లో మరెవరితోనూ మాట్లాడిన గుర్తు నాకు లేదు. హాస్టల్‌లో ప్రతివారి దగ్గరకూ ఇంచుమించుగా ప్రతిరోజూ స్నేహితురాళ్ళో బంధువులో ఎవరో ఒకరు వస్తూంటారు. కాని నాకు తెలిసినంతవరకూ ఆమెకోసం ఎవరూ హాస్టల్‌కు రాలేదు.

ఎప్పుడూ ఆమె హాస్టల్‌లో ఆమె రూముముందు బాల్కనీలో కుర్చీవేసికొని కూర్చుంటుంది. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూనో, ఆలోచిస్తూనో కూర్చుంటుంది.

హాస్టల్‌కు వచ్చిన రెండుమూడు సంవత్సరాలు ఆమెకు ఒక్క ఉత్తరం వచ్చినట్లుకూడా నేను గమనించలేదు. తరువాతకూడా హాస్టల్‌కు ఉత్తరాలెప్పుడూ రాలేదు కానీ ఆఫీసు ఎడ్రసుకు వచ్చేవనుకుంటాను. ఒకొక్కప్పుడు చదివిన ఉత్తరమే చదువుకుంటూ కూర్చొనేది.

ఒకటి రెండుసార్లు 'ఉత్తరం ఎవరిదగ్గర్నుంచి' అని అడిగేను. 'తెలిసినవాళ్ళ దగ్గర్నుంచి.' అని చెప్పింది. మరో జవాబు నేనెప్పుడూ వినలేదు.

అదీకాక హాస్టలుకు వచ్చినప్పటినుంచి ఐదారు నెలల ముందు వరకూ ఆమె దినచర్యలోకూడా ఎటువంటి మార్పూ లేదు.

ఆ తర్వాత ఒకరోజు, నేను షాపింగ్ చేసుకోవాలని పూర్ణిమకు టెలిఫోనుచేసి ఆమెనుకూడా రమ్మన్నాను. ఇద్దరం కలిసి షాపులోకి వెళ్ళబోతున్నాం. మా పక్కనుండే ఒక పొడవైన యువకుడు వెళ్ళి పక్కనే ఉన్న ఒక పొడుగాటి కారులో కూర్చున్నాడు. అతన్ని చూసి ఆమె ఒక్కక్షణం చేష్టలు దక్కి నిలబడిపోయింది. వెంటనే కోలుకొని 'రవీ,' అని పిలుస్తూ కారువైపు పరుగెత్తుకెళ్ళింది. అతను ఆమె కేక వినలేనట్లుంది. కారు కదిలిపోయింది. ఆమె నిలబడిపోయింది. కొంతదూరంలో ట్రాఫిక్ సిగ్నల్‌దగ్గర ఎర్రదీపం వెలిగి కారు ఆగిపోయింది. ఆమె మళ్ళీ పరుగెత్తింది. కాని ఆమె దగ్గరగా వెళ్ళేసరికి ఆకుపచ్చదీపం వెలగడం కారు వెళ్ళిపోవడం జరిగింది.

నేను ఆమె దగ్గరకు వెళ్ళేను. అదే టైముకు పూర్ణిమ


*With best compliments from*

**UNI - SANKYO LIMITED**

**Manufacturers of Quality Bulk Drugs**

***In Collaboration with***

**SANKYO COMPANY LIMITED, JAPAN**

*Factory :* Gaganpahad, Hyderabad - West, Andhra Pradesh

*Office :* 5-9-24/81, Shapurwadi, Hyderabad - 500 483 A. P.

పనిచేస్తూన్న కంపెనీ ప్రొప్రయిటరు తన కారులో వచ్చి మా దగ్గర ఆగేడు.

'ఎక్కడికైనా లిఫ్ట్‌కావాలా?' అని అడిగేడు.

'అక్కర్లేదు.' అంది పూర్ణిమ.

'పోనీ మీ హాస్టల్‌దగ్గర దింపుతాను,' అన్నాడాయన.

'ఇద్దరం కలిసి వెళ్ళిపోతాం' అంది పూర్ణిమ. ఆయన వెళ్ళిపోయాడు.

మేమిద్దరం వెనుదిరిగి నడుస్తున్నాము. 'కారులో ఎక్కి వెళ్ళినతను ఎవరు?' అని నేనడిగాను.

ఇంతలో ఎదురుగా ఖాళీ టాక్సీ వచ్చింది. నాకు జవాబు చెప్పకుండానే "నేను హాస్టల్లో కలుస్తాను," అని పూర్ణిమ టాక్సీలో కూర్చుంది. టాక్సీ వెళ్ళిపోయింది. ఆ రాత్రి పది గంటలవరకూ మెలకువగా ఉన్నాను. అప్పటివరకూ ఆమె రాలేదు. మర్నాడు పొద్దున్న నేను లేచేసరికే బయల్దేరి వెళ్ళిపోయింది. రాత్రి మళ్ళీ ఆలస్యంగా వచ్చింది. మరో రోజు అలాగే గడిచింది. ఆమె ఆఫీసుకు వెళ్ళటంలేదని వాళ్ళ బాస్ నాకు చేసిన టెలిఫోన్ వల్ల తెలిసింది. ఆమె చాలా అలసిపోయినట్లు నిరుత్సాహంగా కనబడింది. ఆమెతో మాట్లాడడానికే భయమనిపించేది. అయినా సాహసించి ఏమిటని అడిగేను– ఒక కారునెంబరు చూపించి దాని ఓనర్ అడ్రసు కావాలంది. అంది బొంబాయిలో రిజిస్టరు చేయించిన కారు. బొంబాయి ఆర్.టి.ఓ. ఆఫీసుకు ఉత్తరం వ్రాస్తే తెలుస్తుందన్నాను. అంత టైము లేదనీ తానే వెళ్ళివస్తాననీ అప్పటికప్పుడు కట్టుబట్టలతో బయలుదేరింది. రెండురోజుల తర్వాత వచ్చింది. అక్కడ ఏంజరిగిందో తెలియదు. ఆ తర్వాత అయిదారు రోజులు మాత్రం ఏమిటో తనలో తానే చాలా మధనపడిపోయింది. వేళకు తిండి తినేదికాదు, నిద్ర పోయేదికాదు. ఎప్పుడూ విశ్రాంతిలేకుండా రూమ్‌లో పచార్లు చేస్తూండేది. ఎడతెరిపిలేని ఆలోచన. రోజురోజుకూ చిక్కిపోయింది. వీటన్నిటికీ కారణంమాత్రం తెలుసుకోలేక పోయాను. ఆమెను అలా వదిలేస్తే ఆరోగ్యం పూర్తిగా చెడుతుందని భయం కలిగింది. ఒకరోజు బలవంతంచేసి ఆఫీసుకు పంపించేను. క్రమంగా మంచి మార్పు వచ్చినట్లే కనబడింది. మామూలుగానే ఉంది. మొన్నటి కేసు జరిగే వరకూ ఆమె అటువంటి పని చెయ్యగలదనే నాకు తెలియదు."

"ఆమె ఎందుకు ఆ దొంగతనాలు చేసివుండవచ్చని మీ రనుకుంటున్నారు."

"నాకు తల బద్దలుకొట్టుకున్నా ఊహకందని విషయం అదొక్కటే. ఆమె ఎప్పుడూ నిరాడంబరంగా ఉండేది. బయట దానధర్మాలకు ఎంతో స్వేచ్ఛగా డబ్బు ఖర్చుపెట్టేది


**A feeling of**
**total Restfulness**
**by the Scenic lake side**

**Blue sea Picnic cottages nestled along the Osmansagar lake, screened by bushy trees, is the little more refreshing spot to enjoy a week - end and holiday with families and friends.**

***An Oasis of luxury***

**BLUE SEA**

**PICNIC COTTAGES**

**Sagar Village, Gandipet, Hyderabad.**

**For Reservation Contact Phone No: 48193 or 36871**

నేనెన్నోసార్లు ఆమెదగ్గర డబ్బుతీసుకున్నాను. నా అంతట నేను గుర్తుపెట్టుకొని ఆమెకివ్వవలసిందేగాని ఆమెకై ఆమె ఎన్నడూ నోరుతెరిచి నన్ను అడుగలేదు."

## 14

అది హైదరాబాదులో శ్రీనగర్ కాలనీ. ప్రశాంతమైన వాతావరణం. సాయంత్రం ఆరుగంటలయింది. కాంపౌండు నిండా చెట్లతోఉన్న ఒక ఇంటిముందు వివేకానందం స్కూటరాపేడు.

పై అంతస్థుకు వెళ్ళి కాలింగ్‌బెల్ నొక్కగానే పూర్ణిమ తలుపు తీసింది.

"గుడీవినింగ్!" అన్నాడు వివేకానందం.

"గుడీవినింగ్! లోపలకు రండి," అంది పూర్ణిమ మర్యాదగా. లోపలకు వెళ్ళి కూర్చుంటూనే "నేను చాలా అలసిపోయి ఉన్నాను. ఏమీ అనుకోకపోతే ఒక కప్పు టీ ఇప్పించగలరా?" అన్నాడు వివేకానందం.

"మీరు అడక్కపోయినా ఇచ్చేదాన్ని. అడిగినందుకు సంతోషం," అని లోపలకు వెళ్ళింది పూర్ణిమ.

రెండునెలల్లో కొంచెం మంచి మార్పు కనబడింది పూర్ణిమలో. పూర్ణిమ బిస్కెట్లు, టీ తీసుకొచ్చింది. కాసేపు అవీ ఇవీ మాట్లాడి చివరకు వివేకానందం అన్నాడు.

"....మీ కేసు సోషల్ ఇన్వెస్టిగేషన్ నాకు అప్పగించేరు. ఆ విషయం మీకు తెలుసుకదా! ఇన్వెష్టిగేషన్ మాట అటుంచి ఒక స్నేహితుడిగా ఒక శ్రేయోభిలాషిగా నేను మీకు ఒక సలహా ఇవ్వదలచుకున్నాను. మీరు దానిని సహృదయంతో అర్థంచేసుకోవాలని ఆశపడుతున్నాను.

"మీ వ్యక్తిగత జీవితంలోని ఎన్నో విషయాలు నేను తెలుసుకున్నాను. తెలుసుకున్న తర్వాత మీమీద నాకు అపారమైన గౌరవం కలిగింది. నూటికీ కోటికీ ఒకరుగా కనబడే ఒక ఆదర్శవ్యక్తి మీరని గ్రహించేను. అయినా నా కనిపిస్తుంది, జీవితంలో ఎక్కడో మీరు దానిని తీసుకోవలసిన దానికంటె సీరియస్‌గా తీసుకున్నారేమోనని చూడండి! ప్రపంచంలో కోట్లాది మనుషులు! కోట్లాది సమస్యలు! జీవితాల్ని సమస్యలను అంకితం చేయడం తెలిసి చేసినా తెలియక చేసినా అది అవాంఛనీయం అని నా ఉద్దేశం- ఆ సమస్యకు సాధించి జీవితాన్ని సాఫీగా నడుపుకోవడం వివేకం. నేను ఎన్నిచోట్ల ఎవరినడిగినా మిమ్మల్ని వేలెత్తి చూపించినవారు లేరు. కాని ఎవరికీ మీ మనోసంఘర్షణకు కారణాలయిన నిజాలు తెలియవు. అంతవరకూ మాత్రం మీ జీవితం నాకొక మూసిన పుస్తకం. మీఅంతట మీరు తెరిస్తే తప్ప దాన్ని నేను చదవలేను. నేను ఒక పోలీసు ఆఫీసరుగా


*With Best Compliments from*

**FOAM RUBBER FACTORY**

**C-5-6, Chandulal Baradari, Industrial Estate, HYDERABAD-500 002**

**Phone : 43984**

Manufacturers of

**EXCEL FOAM**

*QUALITY RUBBER FOAM*

కాక మీరంటే అత్యంత అభిమానమున్న ఒక స్నేహితుడుగా అడుగుతున్నాను.

"ఈరోజు ఈ కాలనీలో ఒక మిత్రుడింటికి వచ్చి ఒక సారి మిమ్మల్ని చూసిపోదామని ఇలా వచ్చేను. తిరిగి నేను రేపు ఉదయం ఎనిమిదిగంటలకు వస్తాను. అందుకని రేపు ఉదయం మిగిలిన వివరాలు మాట్లాడుదాం. నేను తెలుసుకోవలసింది ఏమిటంటే మీకు అంత సన్నిహితంగా వచ్చిన రవి ఎందుకు ఎలా మీకు దూరమయ్యేడు? మీరు బొంబాయి వెళ్ళినప్పుడు ఏమి జరిగింది? మరోసారి చెప్తున్నాను. ఒక వేళ ఒక వ్యక్తి బాధ్యతలేక ప్రవర్తిస్తే దానికి మరొక అందమైన ఆదర్శమైన జీవితం పెడదారిపట్టడం చాలా దురదృష్టకరమైన విషయం. అలా కాకుండా మార్చడానికి నా ప్రయత్నం ఏమాత్రం దోహదంచేసినా అది నా అదృష్టంగా భావిస్తాను...."

వివేకానందం లేచి వెళ్ళిపోయాడు.

పూర్ణిమ ఆ రాత్రంతా రవిని గురించే ఆలోచిస్తూ గడిపింది. వివేకానందం చెప్పిన మాటల్లో గతానికి కొత్త అర్థం కనబడుతూన్నట్లుగా ఉంది. జరిగిన సంఘటనలు తిరిగి తిరిగి కళ్ళముందు నిలుస్తున్నాయి.

రవి పరిచయమయినప్పటినుంచీ తాను కావాలని ఏమీ చెయ్యలేదు.

అతడొక తేజస్సు. అతడొక చైతన్యస్రవంతి. తాను ప్రతిఘటించడానికి ఎన్నడూ ప్రయత్నించలేదు. ప్రయత్నించినా అతనికి దూరంగా ఉండగలిగేది కాదు. అన్యాయాన్ని అక్రమాన్ని ఒక్క క్షణంకూడా సహించలేని అతని ఉద్రేకం, సాహసం జీవితంలో ఏదీ తనకు అందుబాటుకాకుండా పోదు అనే అతని నమ్మకం — తలపెట్టిన పనిని సాధించడంలో ఏకాగ్రత చూపించే అతని కళ్ళల్లో కాంతి—ఆరడుగుల అతని విగ్రహం — ఆగని ఉద్రేకాలు శక్తివంతమైన అతని ముఖంమీద ముద్రించిన రూపాలు—ఆ ఆలోచనే ఒక ఉన్మాదం.

దిక్కులేనివాడై పెరిగిన అతనికి సంఘంమీద కసి. తమ ఇద్దరికీ అక్కడే అభిప్రాయ భేదం వచ్చేది. తాము చేసిన ఏపనికైనా సంఘపు ఆమోదముద్ర కావాలనేది తాను. ఓర్చుకోలేని సంఘానికి కళ్ళల్లో కారం చల్లాలి అనేవాడతను.

ఎప్పుడయినా ఫ్రెండ్స్ మోటారుసైకిలు తీసుకొని కూడా రమ్మనేవాడతను. న లు గు రూ తప్పుగా అనుకుంటారు రాననేది తాను. వెంటనే అతనికి కోపం వచ్చేసేది. ఇటువంటి పిరికితనం చాలా చెడ్డది అనేవాడు.చివరకు అతనిమాటే నెగ్గేది.


WELCOME TO

# HOTEL YATRIK

HIGH CLASS BOARDING, LODGING & RESTAURANT

Opp. Railway Station, Nampally, Hyderabad-500 001

Grams : YATRIK    Tele : 30595 (6 lines)

## Amenities

* A posh hotel in the heart of the city in Nampally
* Most Moderate Tariff
* Telephone in each room
* Tastefully decorated and lavishly furnished rooms
* All rooms with attached bath & 24 hrs. hot and cold running water
* 4 Channel music in all the rooms
* Air Conditioned Conference Hall
* Beautiful green gardens and lawns to relax
* Around Biggest Shopping Centre
* Laundry in the premises
* Tourist Taxis available
* Ample Space for car parking
* Perfumed Air Cooled rooms
* A magnificient, perfumed Air Cooled Dining hall.
* Vegetarian & Non-Vegetarian Restaurant.

## TARIFF

European plan Charges per day

| [Room only] | Non A/C | A/C |
|---|---|---|
| | Rs-P. | Rs-P. |
| Single | 25-00 | 45-00 |
| Double | 35-00 | 65-00 |
| Deluxe Room | 45-00 | 90-00 |
| Suit | 65-00 | 110-00 |
| Guest Charge | 10-00 | 15-00 |

Room Service for Breakfast & Meals etc.
Special Arrangement for Parties & Conferences.

**CHECK OUT TIME : 24 Hours.**

ఒకరోజు ఇంటిదగ్గర దింపినపుడు అమ్మ చూసింది. ఆ రాత్రి పక్కలో కొచ్చి కూర్చుని అతన్ని గురించి వివరాలు అడిగింది. అన్నీ చెప్పింది తను.

ఆడది మగవాడికి సన్నిహితంగా వెళ్ళేటప్పుడు కులమత భేదాలు ముఖ్యంకావనీ, కాని సంఘం విమర్శకు ఎదురునిలచే ఆత్మవిశ్వాసంమాత్రం ఉండాలనీ, ఏది ఏమయినా తానిచ్చిన చనువు ముందురోజు పశ్చాత్తాపపడవలసిన అవసరం రాకూడదనీ చెప్పింది. ఆ మర్నాడే తను రవిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు పరిచయం చేసింది. ఆనాటినుండి అతనితో ఏ అరమరికలూ లేకుండా ఉంది.

కాని రవిలో తనకు అర్థంగాని విషయం ఎప్పుడూ ఒకటే! ఎన్నోసార్లు అతను అకస్మాత్తుగా మాయమవుతూండేవాడు.

ఒకసారి అతనికోసం చూసి చూసి విసిగిపోయి తాము ఎప్పుడూ కలుసుకునేచోట ఒంటరిగా ఉదాసీనంగా కూర్చుంది.

వెనుకనుంచి వచ్చి రవి కళ్ళుమూశాడు.

"నిన్ను నేను ఇక్కడే ఇలాగే ఉంటావని అనుకున్నాను పూర్ణిమా! ఒక్కసారి చూసేదాకా మనసాగక ఆఘమేఘాల మీద పరిగెత్తుకొచ్చేశాను," అన్నాడు రవి.

"నాకూ పరిగెత్తుకొని రావాలనివున్నా నువ్వు ఎప్పుడు మాయమవుతావో ఎప్పుడు ఎక్కడ ప్రత్యక్షమవుతావో నేను ఊహించలేకపోతున్నాను," అంది తాను అతని చేతులు విడిపించుకుంటూ.

"కోపం వచ్చిందా?" అంటూ అతను ముందుకు వచ్చేడు.

"ఏమిటీ దాగుడుమూతలు!" అంది తాను.

"ఏం దాగుడుమూతలు బాగుండవా?"

"ఆటగా బాగానే ఉంటాయి. కానీ జీవితంలో దాగుడు మూతలు భయంకరంగా ఉంటాయి."

"దేనికీ భయపడకు పూర్ణిమా! జీవితంలో మనిషిని భయమే కృంగదీస్తుంది. అది లేకపోతే మనిషికి అడ్డేలేదు. కమాన్! బి చీర్‌ఫుల్!"

కాని తన మనసులో దిగులు తొలగలేదు. ఎలాగైనా రవి ఎందుకిలా మాయమవుతాడో తెలుసుకోవాలనిపించింది. అదే మాట అడిగింది. రవి హఠాత్తుగా సీరియస్ అయిపోయేడు.

"విశ్వాసం ఉన్నచోట సందేహం లుండవు పూర్ణిమా?" అన్నాడు.

"అంటే నీ ఉద్దేశ్యం? నాకు నీమీద విశ్వాసం లేదనా?

"అది నాకంటే నీకు బాగా తెలిసే విషయం. ఆలోచించి నువ్వే జవాబు చెప్పాలి."


దీపావళి శుభాకాంక్షలతో

ఫోను: 73064

రేఖా క్లాత్ ఎంపోరియం

షాపింగ్ సెంటర్

ఆర్ట్ సిల్కులు, సూటింగ్స్,
షర్టింగ్స్ మరియు
డ్రస్ మెటీరియల్స్ కు

దర్శించండి

రేఖా క్లాత్ ఎంపోరియం

3277, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500 003

"నీమీద నా విశ్వాసాన్ని శంకించకు రవీ! ఐ బిలీవ్ సోమచ్ ఇన్ యూ—" అంటూ తను రవివాడిలో వాలి పోయింది.

"హౌనైస్! దటీజ్ లైక్ గుడ్‌గర్ల్!" అంటూ కొంచెం వెనక్కు జరిగేడు రవి.

వెంటనే తమ సంభాషణలో రవి మొదటిమాటలు మళ్ళీ వినబడ్డాయి.

"ఏమిటది?" తను ఉలిక్కిపడింది.

మన అంతరాత్మలు ప్రతిధ్వనిస్తున్నాయి" అన్నాడు రవి. తరువాత ఇద్దరి సంభాషణ చివరివరకూ వినిపించింది. చూస్తే కేసెట్ టేప్ రికార్డర్! వస్తూనే ఆన్‌చేసేడు రవి.

"మన ఎడబాటులో నీకు తోడుగా ఉండేందుకు దీన్ని బహుమతిగా తెచ్చాను," అన్నాడు రవి దాన్ని చేతిలో పెడుతూ.

"నాకొద్దు."

"ఎందుకు? బాగులేదా?"

"ఇది బాగానేఉంది. ఇది ఉన్నాకూడా ఎడబాటు బాగుండదు. టేప్ రికార్డర్‌లో ఏదో ముందు రికార్డుచేసిన ప్రేమ గీతం వస్తూంది. ఇద్దరూ పరవశించి ఒకటైపోయారు. తను రవిని పూర్తిగా విశ్వసించింది. అందుకే ఎన్నిసార్లు కనబడక పోయినా తరవాత మరెప్పుడూ ఆ ప్రశ్న అడగలేదు.

తర్వాత ఒకరోజురాత్రి పడుకోబోతూండగా తండ్రీ గదిలోంచి ఏదో వింత శబ్దంవచ్చింది. తాను పరుగెత్తుకొని గదిలోకి వెళ్ళింది. తండ్రి ముచ్చెమటలు పోసివున్నాడు. ఊపిరి అందటంలేదు. ఏదో సైగచేస్తున్నాడు. తను ఖంగారు పడి తల్లిని లేపింది. తల్లిని తండ్రిదగ్గరుండమని తాను డాక్టరుకోసం వెళ్ళింది. దారిలోవున్న రవిని లేపి జరిగిన ఉపద్రవం చెప్పింది. ఇద్దరూ వెళ్ళి డాక్టరును తీసుకొచ్చేరు.

డాక్టరు ఏదో ఇంజక్షను ఇచ్చేడు. కాని వెంటనే హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళటం మంచిదనీ ఆక్సిజను పెట్టవలసిన అవసరం రావచ్చనీ చెప్పేడు. తండ్రిని హాస్పిటల్‌లో చేర్చారు.

తండ్రి కాళ్ళదగ్గరే కళ్ళల్లో ఒత్తులుపెట్టుకొని కూర్చుంది తల్లి.

రవి తనను బయటకు పిలిచేడు.

"రవీ! నాకేమో భయంగా ఉంది. నాన్నకేమీ ప్రమాదం లేదుగా?" అంది తను.

"ఏమీ భయంలేదు" అన్నాడు రవి. తాను రవిని పొదివి పట్టుకుంది.

"పూర్ణిమా! నేనొక అర్జెంటు పనిమీద వెడుతున్నాను వచ్చేవరకు ధైర్యంగా ఉండు," అన్నాడు రవి.


మీకు మా శుభాకాంక్షలు

Hotel Rajdoot

**ANDHRA**

**NON-VEGETARIAN HOTEL**

Lakdi-ka-pul, Hyderabad

Phone : 33034

"వెళ్ళక తప్పదా ?"

"సారీ పూర్ణిమా! పొద్దున్నే వచ్చేస్తానుగా."

తన కళ్ళల్లోంచి ఉబికివచ్చిన కన్నీళ్ళు తుడిచి వెళ్ళేడు రవి. అతను మెల్లగా చీకట్లో కలసిపోతుంటే రెప్పవాల్చకుండా చూసింది తను కనపడినంతవరకూ. తిరిగి తండ్రి మంచం దగ్గరకు వచ్చింది. తల్లి చూస్తూ కూర్చుంది. తను తల్లి ఒడిలో తలవాల్చుకొని ఒరిగింది. తల్లి ప్రేమతో తల నిమిరింది. అలా ఎప్పుడు నిద్రపోయిందో తనకే తెలియదు.

తిరిగి ఉలిక్కిపడి లేచింది. తండ్రి బాధతో మెలికలు తిరుగుతున్నాడు. తల్లి నిస్సహాయంగా ఏంచెయ్యాలో తెలియక ఖంగారుపడుతూంది.

బాధనంతా ఓర్చుకొని ఆయాసంతో తండ్రి, "పూర్ణిమా ఇలా రామ్మా!" అని పిలిచేడు. తను వెళ్ళింది."ఆ భగవద్గీత పుస్తకం ఇటియ్యమ్మా!" భగవద్గీత పుస్తకం తండ్రికిచ్చింది. దాన్ని ఆయన తనహృదయంపై పెట్టుకున్నాడు.

"ఎంత మనసుకు దూరంగా ఉంచుకుందామన్నా నీ భవిష్యత్తు ఎలా ఉంటుందోననే ఆలోచనను దూరం చేసుకోలేకపోతున్నానమ్మా!"

"ఫరవాలేదు నాన్నా! నువ్వుండగా నాకు లోటేముంది!" అంది తను.

"నేనున్నా లేకపోయినా ఒక్క విషయం గుర్తుపెట్టుకోమ్మా! సత్యానికి మించిన శక్తి ఈ ప్రపంచంలో లేదు. అదే ఎప్పుడూ నిన్ను కాపాడుతుందమ్మా! ఇదొక్కటీ ఎన్నడూ మరచిపోకు సుమా!...." అన్నాడు. తండ్రిచేతిలో చేయి కలిపింది పూర్ణిమ.

తండ్రి తల్లివైపు తలతిప్పి చూసేడు.

"రాధా! మనసులో మనసువై ప్రాణంలో ప్రాణమయిన నీకు కృతజ్ఞత ఎలా చెప్పను!....మళ్ళీ మనిద్దరికీ జన్మంటూ ఉంటే తప్పకుండా కలుసుకుందాము...."

"అలా మాట్లాడకండి! అంతా బాగానే ఉంటుంది." తనకు లేని ధైర్యాన్ని చెప్పడానికి ప్రయత్నించింది తల్లి.

ఆ రాత్రే తండ్రి కన్నుమూసేడు. తమ జీవితాల్లో దారి చూపే పెద్దవెలుగు ఆరిపోయింది.

తర్వాత తండ్రి ఫోటోముందు అఖండదీపం పెట్టి దాని ముందు నిలబడి పవిత్ర స్మృతులతో ముఖం వెలుగుతూంటే తల్లి అన్నమాటలు తానెన్నటికీ మరచిపోలేదు.

"మీ నాన్న అందరిలాంటివారు కాదమ్మా! దేశంకోసం నలుగురితో నిలబడి పోరాడినా అవకాశాలు చూసుకొని అందలాలకోసం ఎగబడిన వాళ్ళను ఎంతోమందిని చూసేను.



కాని కంటికి కనబడక నేలలో దాక్కొని గోడను నిలబెట్టే పునాదిరాయిలాంటి మీ నాన్నలాంటివాళ్ళు ఎంత వెదకినా దొరకరమ్మా!"

"ఆయనతో పరిచయమై ప్రక్కనుండి స్వాతంత్ర్యోద్యమంలో పనిచేసినప్పుడే అనుకొన్నాను ఈ జీవితానికి ఈయనే నా మనిషని. కాని జీవితమంతా ఆయనతో గడిపిన తర్వాత ఇప్పుడా దేవుణ్ణి అడుగుతున్నానమ్మా జన్మజన్మలకూ ఈయనే నా మనిషి కావాలని!...."

తల్లితండ్రుల ఆదర్శ దాంపత్యం కళ్ళముందు ఆరని వెలుగై నిలచి ఒకవిధమైన విషాదపు పారవశ్యంలో కన్నీళ్లు ఏకధారలుగా జారిపోయాయి పూర్ణిమ చెక్కిళ్ళమీదనుంచి.

## 15

మర్నాడు వివేకానందం వచ్చినప్పుడు మొదటిసారిగా మనసువిప్పి గతమంతా చెప్పింది పూర్ణిమ. అతనితో చెప్తూంటే చిత్రమైన ఉపశమనం కలిగింది. తరవాత చదువు ఆపుచేయడం, అకస్మాత్తుగా తల్లి చనిపోవటం, హైదరాబాదువచ్చి ఏకాకిగా నిలచి యూనివర్సల్ ఇంజనీరింగ్ కంపెనీలో ఉద్యోగంలో చేరటం వివరంగా చెప్పింది.

"మరి రవి?...." వివేకానందం అడిగాడు.

"మా నాన్న పోయినరోజు వెళ్ళిన రవి మళ్ళీతిరిగిరాలేదు. అతని రూమ్‌కు వెడితే తాళంవేసివుంది. ఎక్కడ వెదకాలో, ఎవర్ని అడగాలో, అసలు ఏం జరిగిందో, ఏమైపోయాడో తెలీలేదు."

"కాని నాలుగు నెలలక్రితం మీరూ సుమిత్రాదేవి షాపింగ్ కోసం ఆఫీసునుంచి తొందరగా వచ్చినరోజున కనబడ్డాడు. తరువాత...."

పూర్ణిమ ఆశ్చర్యంగా వివేకానందంవైపు చూసింది. కొంచెం ఆగి మొదలుపెట్టింది.

"....ఆ రోజు రవి ఓ కారులో కూర్చోటం చూసేను. నా పిలుపు అతనికి వినబడలేదు. కారు ముందుకు వెళ్ళిపోయింది. కొంచెం దూరంగా ట్రాఫిక్ సిగ్నల్ ముందు ఆగింది. మళ్ళీ ఆశతో పరిగెత్తుకొని వెళ్ళాను. సరిగా దగ్గరకు వెళ్ళేసరికి సిగ్నల్ మారిపోయింది. మళ్ళీ కారు వెళ్ళిపోయింది. కాని కారునంబరు చూసేను. దొరకక దొరకక దొరికిన రవిని, అంత దగ్గరలోవున్న రవిని మళ్ళీ దూరం చేసుకోలేను. ఏమయినా కలుసుకొని తీరాలి. మరో ఆలోచన నా మనసులో లేదు. ఎదురుగా ఖాళీటాక్సీవస్తే అందులో కూర్చున్నాను. రాత్రి పదయ్యేవరకూ ఊరంతా గాలించేను, ఎక్కడైనా ఆ కారు కనబడుతుందేమోనని. తిరిగి ఇంటికి చేరుకొన్నాను. గడిచే ప్రతిక్షణమూ ఆ కారు నాకు దూరంగా వెళ్ళిపోతూం


పరుమల్లెలాంటి మెత్తని నూలువస్త్రాలపై
హరివిల్లులోని అందాల రంగులతో
చిరులు చిందించే డిజైన్ల సముదాయంతో
కనుల పండుగ చేస్తాయి కల్పన ప్రింట్లు

కల్పన ప్రింట్స్
కృష్ణలంక
విజయవాడ - 520002.

దనిపించింది. ఆ తర్వాత రెండురోజులూ అలాగే నిర్విరామంగా వెదికేను. కాని మళ్ళీ ఆ కారు కనబడలేదు.

సుమిత్ర ఆ కారు బొంబాయిదనీ, అక్కడకు ఉత్తరం వ్రాస్తే తెలుస్తుందనీ చెప్పింది. నా మనసుకు దేన్నిగురించీ ఆలోచించే శక్తే చచ్చిపోయింది.ఒకటే ధ్యాస! రవి ఉన్నాడు. ఎలాగైనా అతన్ని చేరాలి! ఆలస్యానికి వీలులేదు!

వెంటనే బొంబాయికి ప్రయాణమయ్యేను. అక్కడ ఆర్.టి.వో. ఆఫీసులో ఆ కారు యజమాని అడ్రసు రవిదే కావడం నాకు ఎంత ఆనందాన్నిచ్చిందో చెప్పలేను. రవిని కలుసుకున్నట్లే సంబరపడ్డాను.

రవి ఎడ్రసు తీసుకొని వెళ్ళేను.

అది శాంతాక్రజ్‌లో ఒక అందమైన బిల్డింగ్. కాంపౌండ్ మీద చెక్కివున్న రవిపేరు చేతితో తాకి పరవశించిపోయాను. గుండె వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టింది. రవి ఎదురుగా నిలబడితే గుండెపగిలిపోకుండా ఉంటుందా అనిపించింది.

గేటు తీసుకొని లోపలకు వెళ్ళేను.

గారేజిలో అదే కారు. మనసులోని ఉద్వేగం యింకా ఎక్కువైంది.

కాలింగ్‌బెల్ బటన్ నొక్కేను. చుట్టూ ఈ సంపద.... రవి దేనికైనా సమర్థుడనిపించింది.

తలుపు తెరుచుకుంది. ఒక యూరోపియన్ లేడీ తలుపు వెనకవుంది. రవి ఉన్నాడా అని అడిగేను. మర్యాదగా లోపలకు రమ్మంది.

అర్జెంటు పనిమీద ఢిల్లీ వెళ్ళేడనీ మరో గంటలో వచ్చే ప్లేన్‌లో వస్తాడని చెప్పింది.

నేను కూర్చున్నాను.

స్పాంజిముక్కల్లాంటి గోడలు, పాలరాతి నేల, పట్టు పరుపులాంటి తివాచీలు. విశాలమైన అందమైన సోఫాలు, గోడలమీద అందమైన చిత్రాలు, అక్కడక్కడా అందమైన పురాతన శిల్పాలు, చిత్రమైన ఎలక్ట్రిక్ ఫిట్టింగ్స్, మెత్తని ఉడుకులోన్ వాసన మత్తెక్కిస్తోంది. స్వర్గలోకంలో ఉన్నట్లుంది. అంత ఇంటిలో రవి ఒక్కడు. నావైపు ప్రశ్నార్థకంగా చూస్తూన్న ఆమెకు చెప్పేను, కాలేజీలో రవి నాకు మంచి స్నేహితుడని. ఆమె ఎంతో మర్యాద చేసింది. ఇద్దరమూ మాటల ధోరణిలో పడ్డాము.

రవికీ నాకూ ఎలా పరిచయమైందీ చెప్పాను.అతనిలోఉన్న గుణగణాలన్నీ వివరించి వర్ణించి చెప్పేను. ఆమెకూడా నేను


*With the best compliments of*

# VICTORY TILES

*Manufacturers of*

**Victory Brand Tiles**

**Dwarapudi, East Godavary Dist.**

చెప్పిన వాటినన్నింటినీ సమర్థిస్తూ రవిని పొగుడుతూంది. అలా ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలీయదు.

మధురమైన సంగీతంలా వినబడగానే తలతిప్పి చూసేను. అది కాలింగ్‌బెల్ చప్పుడు.

ఆమె వెళ్ళి తలుపు తీసింది. ఒకామె ఇద్దరు బంగారు బొమ్మల్లాంటి పిల్లల్ని తీసుకొచ్చింది.

అయిదేళ్ళ పిల్లవాడొకడు. మూడేళ్ళ పాప ఒకతె. ప్రాణమున్న సిల్కు బొమ్మల్లా వున్నారు. "మమ్మీ" అని ఆవిడ మీదపడ్డారు.

"ఈవిడకు విష్ చెయ్యండి. డాడీస్ ఫ్రెండ్!" అందామె. నాకు క్రింద భూమి పగిలినట్లయింది. మిన్ను విరిగి మీద పడినట్లయింది! ఒక్కసారి కాలం స్తంభించిపోయింది. ఇంద్రియాలు పనిచెయ్యటం మానివేశాయి. చివరకు ఎలాగో "యూ మీన్....యు ఆర్ మిసెస్ రవీ?" అన్నాను.

"అఫ్‌కోర్స్!" అందామె సగర్వంగా.

ఆ తర్వాత నేనేం చేశానో నాకు సరిగా గుర్తులేదు. నన్ను వారిస్తూ ఆమె వెనక్కు పిలుస్తూన్న శబ్దాలు గుర్తున్నాయి.

నా ఒళ్ళు నాకు తెలిసేటప్పటికి నేను హైదరాబాదు ట్రెయిన్‌లో ఉన్నాను. అంతే! కొంతకాలం నాకు తెలిసి గడిచింది. కొంతకాలం నాకు తెలియక గడిచింది. కాని అంతకూ అర్థం ఒకటే! అర్థంలేకపోవడం. కొన్నిసార్లు నాకు ఏ పని ఎందుకుచేస్తున్నానో అర్థంకాదు...."

పూర్ణిమలో ఉద్వేగం చూసేసరికి జాలి కలిగింది వివేకానందానికి. తాను చేయని పొరపాట్లకు వెలలేని వెల చెల్లించిన ఆమెపట్ల ఎంతో సానుభూతి కలిగింది.

"అయామ్ రియల్లీ సారీ పూర్ణిమా ఫర్యూ!" బరువుగా నిట్టూర్చేడు.

కొంతసేపు ఇద్దరూ మాట్లాడలేదు.

"మీరేమీ అనుకోకపోతే మరి ఆ దొంగతనాలు మీరు ఎలా....?"

"అది నిజంగా నాకు తెలీదు. నేను చేసినమాట నిజమే కాని అవి ఎందుకు చేశానో నాకు తెలీదు. కొన్నిసార్లు వాటిని చూస్తే వాటిని దొంగిలించిన ఈ చేతులు తెగ్గొట్టుకోవాలనిపిస్తుంది. అందుకే వాటిని కనబడని అరలో దాచిఉంచేదాన్ని. కాని ఒక్కొక్కప్పుడు నా మనసులో ఏదో అయిపోతూంది. అప్పుడు వాటిని తెరచి రెప్పవాల్చకుండా చూస్తూంటాను. రవికి వాటిలో ఏదో జవాబుచెప్పినట్లుగా అనిపిస్తుంది. ఏమయినా అవి నా మనసులో ఆరని చిచ్చులు. అవి ఎందుకు రగులుకుంటాయో ఎలా రగులుకుంటాయో తెలీదు. కాని నా మనసును కాల్చి కాల్చి దహించివేస్తాయి...."


*With the Best Compliments from*

# M/s. HOTEL TILOTTHAMA

A TWO STAR HOTEL

**VIJAYAWADA**

**While at Vijayawada**

***Stay at***

**HOTEL TILOTTHAMA**

## 16

వివేకానందం తాను సేకరించిన వివరాలన్నీ రిపోర్టులో వ్రాసేడు. దాని చివర తన పరిశీలన ఈ విధంగా వ్రాసేడు.

పూర్ణిమ తండ్రి శ్రీనివాసరావు చాలా అరుదుగా కనపడే ఆదర్శమూర్తులలో ఒకడు. అతడు రాధాదేవిని వలచి ఆమె అందాన్నీ, శీలాన్నీ ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరూ శ్రీనివాసరావు బంధువులచేత వెలివేయబడ్డారు. అది రాధాదేవిని మానసికంగా గాయపరచింది. ఆ అన్యాయాన్ని వేలెట్టి చూపించడానికే అన్నట్లు పతివ్రతగా బ్రతికింది. స్వాతంత్ర్యోద్యమంలో భర్తచేసే సాహసకృత్యాలకు అండదండగా నిలచి ఆయన ఎడబాటును ధైర్యంగా సహించింది. వాళ్ళ అపురూప సంతానం పూర్ణిమ. గుణగణాలలో తల్లిదండ్రులకేమీ తీసిపోదు. వారి అపురూప దాంపత్యం ఆమె కాదర్శమైంది. తల్లిద్వారా ఆడదానికి ఒకటే మనువు ఒకడే మగడు అనేది చెరగని నీతిగా ఆమె మనసులో ముద్రపడిపోయింది. అహంకారానికి, దౌర్జన్యానికి గురి అయిన రవి ఆమెను మొదటిచూపులోనే ఆకర్షించేడు. ఆర్థికంగా పేదవాడయిన అతని సాహసచర్యలు ఆమెనింకా సన్నిహితం చేసేయి. అతనిలో ఆమెకు తండ్రిలాంటి ఆదర్శమూర్తి కనబడ్డాడు. అతని ఎడబాటులో ఆమె పొందిన మానసికక్షోభ తండ్రి జైలుకెళ్ళినప్పుడు తల్లి పొందిన వేదనతో పోల్చుకుంది. ఆ ఆదర్శభ్రమలో హఠాత్తుగా జీవితంలోంచి అదృశ్యమయిన రవి ఎడబాటును భరించగలిగింది. ఎప్పటికయినా అతన్ని కలుసుకోగలననే ధైర్యంతోనే ఉంది.

హాస్టల్‌లో సుమిత్రకు వచ్చే ఉత్తరాలు చూసిచూసి తనకు కూడా ఉత్తరాలు వస్తే బాగుండుననుకుంది. కాని రాసేవారే లేరు. ఎప్పుడో ఒక బలహీనమయిన క్షణంలో రవి తనకు ఉత్తరం వ్రాసినట్లు ఊహించుకొని ఆ ఉత్తరం తానే వ్రాసుకుంది. అది పోస్టులో వేసి అందుకున్న తర్వాత ఒక కృత్రిమమైన ఆనందాన్ని పొందింది. చివరకు అది వ్యసనంగా మారి ఏ కారణంచేతనయినా ఆ ఉత్తరం చేరకపోతే ఆందోళనపడే స్థితివరకూ వచ్చింది. ఈ విషయం నేర్పుగా ఆమె బాస్ శేఖర్ తెలుసుకున్నాడు. ఆమె వింతప్రవర్తన తెలుసుకుని ఆమెకు సహాయం చెయ్యాలనే సదుద్దేశంతో కొన్ని ఉత్తరాలు ఆమెకు అందకుండా చేసేడు. నిజంగా దీనివలన ఆమె మానసికస్థితి కొంత దిగజారింది. ఈ లోపులో అనుకోకుండా మరో సంఘటన జరిగింది. ఆమె హఠాత్తుగా రవిని చూసింది. అతన్ని కలుసుకోడానికి విశ్వప్రయత్నాలుచేసి చివరకు బొంబాయిలో అతని ఇంటికి వెళ్ళింది. రవి మరో స్త్రీని పెళ్ళిచేసుకోగలడన్నది ఆమె ఊహకందని విషయం. కాని అది

*With best Compliments from*

# Khaitan Tibrewala Electricals Private Limited

**A-13, CO-OPERATIVE INDUSTRIAL ESTATE, BALANAGAR, HYDERABAD-500 037**

నిజంగా గుర్తించిన తర్వాత జీవితంమీద ఆమె దృక్పథమే చెదిరిపోయింది. పెండ్లిచేసుకుని సంసారం చేస్తూన్న రవిని తన ప్రియుడిగా ఊహించలేకపోయింది. అలా అని మానసికంగా అతనికి ఎంతో సన్నిహితంగా పోయిన తనను దూరమూ చేసుకోలేకపోయింది. ఈ రెండు భావాల సంఘర్షణ ఆమెలో కొత్త ఆలోచనల్ని ప్రేరేపించింది. రవి తనను కాదని మరొకరిని ఎందుకు పెళ్ళిచేసుకున్నాడు అనే సందేహం వచ్చినప్పుడు ఆమెకు ఆలోచించగా ఆలోచించగా ఒకటే కనబడింది. రవి ఆరాధించిన సాహసమే తనలో లేదని. ఆ ఆలోచన తీవ్రతరమయినప్పుడు ఆమె మనసు ఆమె వశం తప్పేది. రవి సంపదకు చిహ్నమయిన ఏదో ఒక వస్తువు దొంగిలించేది. అతను పెట్టిన పరీక్షకు నెగ్గినట్టుగా ఒక విధమైన సంతృప్తి పొందేది. కాని ఆ భావావేశం తగ్గగానే తాను చేసిన పనిలోని నీచత్వం గుర్తించి కుమిలిపోయేది.

ఈ నేరంచేస్తూ పట్టుబడటం ఒక రకంగా ఆమెకుకూడా మంచిదే అయింది. పట్టుబడకుండా వుంటే చివరకు ఆమె మనస్తత్వంలో ఎటువంటి పరిణామాలు కలిగేవో ఊహించడం కష్టం.

ఆమె చేసిన పని నేరమే అయినా ఆమెకు ఆ నేరం చెయ్యటంలో ఎటువంటి నీచమైన ఆలోచనా లేదు. ఆమెను శిక్షించి మిగిలిన నేరస్తుల సరసన వుంచడంవలన ఆమె మానసికస్థితి ఇంకా దిగజారి వికృతమైన మార్పులు చెందే అవకాశం వుంది. ఆమె కే శిక్ష విధించినా ఎంతో ఆలోచించి బాధ్యతతో చేయవలసి ఉంటుంది.

ఏదిఏమైనా పూర్ణిమ ఒక అసాధారణమైన వ్యక్తి! జడ్జి వివేకానందం రిపోర్టు చాలా ఆసక్తితో చదివేడు.

పదిహేనురోజుల తర్వాత కోర్టులో ఈ విధంగా తీర్పు చెప్పేడు.

"....ఒక నాగరిక సమాజంలో చదువు సభ్యతలుగల తరగతిలో పుట్టిపెరిగి బాధ్యత చూపవలసిన పూర్ణిమలాంటి స్త్రీ ఆమెచేసిన నేరంలాంటి నేరాలుచెయ్యటం చాలాతీవ్రమైన విషయం, చాలా గర్హించదగినవిషయం. కాని ఆమె మానసిక స్థితివెనుక ఉన్న విచిత్ర ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఆమె ఆరునెలలపాటు ఒక ప్రొబేషను ఆఫీసరు కట్టడిలోవుంటుంది. ఈ ఆరునెలలూ ప్రతి ఆదివారమూ ఆమె పదిరూపాయల ఖరీదుచేసే స్వీట్స్‌కొని అవి ప్రభుత్వ అనాథ శరణాలయానికి తీసుకొనివెళ్ళి ఆ శరణాలయపు వార్డెనుకు స్వయంగా ఇచ్చి వార్డెను సంతకంచేసిన స్వీట్స్‌బిల్లు కోర్టులో దాఖలు చెయ్యాలి.


*Deepavali Greetings from:*

**Sri Venkateswara Nitriding Works**

Plot No. 169-170/B-9 Block

**Jawahar Autonagar, Vijayawada-520 007**

**Equipped with Modern Gas Nitriding Plant, Crack Detector and Degreasing Plant and necessary Quality Control Equipment.**

*Managing Partner*

**Y. L. Jayarama Prasad, B.E., (Mech.)**

కఠిన శిక్షకోసం ఎదురుచూసిన పూర్ణిమకు ఈ శిక్ష ఎంతో నిరుత్సాహాన్ని కలిగించింది.

ఆమెను శిక్ష అనుభవిస్తూన్న ఒక నిందితురాలిగా ఊహించుకోలేని శేఖర్‌కు ఈ తీర్పు ఎంతో ఊరట నిచ్చింది.

రిపోర్టుద్వారా అంత సమగ్రంగా ఆమె మనస్తత్వాన్ని అర్థంచేసుకొని తగినశిక్ష విధించిన జడ్జిని మనస్ఫూర్తిగా అభినందించేడు వివేకానందం. ఆమెకు ప్రొబేషను ఆఫీసరుగా కోర్టు తిరిగి వివేకానందాన్నే నియమించింది.

## 17

రాను రాను ఆఫీసు వాతావరణంలో కొంచెం మార్పు రావడం గమనించేడు శేఖర్.

ముఖ్యంగా మేనేజరు నారాయణ వైఖరి పూర్ణిమ పట్ల అంత బాగాలేదు. ప్రతిరోజూ ఏదో సందర్భంలో ఆమెను వ్యంగ్యంగా విమర్శించడం, ఆమెకు ఎక్కువ పని యిచ్చి ఆమెను తప్పుపట్టడం జరుగుతూంది. శేఖర్ ముఖ్యంగా ఆమె విషయాలు మరీ సూక్ష్మంగా పరిశీలించడం వలన ఈ విషయం గ్రహించగలిగేడు. తగిన అవకాశంచూసి ఒకసారి నారాయణను హెచ్చరించాలనుకుంటూంటే ఒకరోజు నారాయణచేసిన సూచన శేఖర్‌కు చాలా కోపం తెప్పించింది.

ఆఫీసులో ఇనప్పెట్టెను ఏవైనా ముఖ్యమైన డాక్యుమెంట్లు ఒకసారి రిఫరెన్స్‌కు కావలసివచ్చినప్పుడు శేఖర్, నారాయణ కాక పూర్ణిమకూడా తెరవటం ఎప్పటినుంచో అలవాటుగా జరుగుతూండేది.

"పూర్ణిమ సేఫ్ తెరుస్తూండడం అంత మంచిదికాదేమో!" అన్నాడు ఆ రోజు నారాయణ.

"ఎందుకు?" అన్నాడు శేఖర్ కోపాన్ని అణచుకుంటూనే.

"ఆమెకున్న బలహీనతనుబట్టి ఆఫీసులో ఏదయినా చేస్తే...."

శేఖర్ ఇంక నిగ్రహించుకోలేకపోయాడు.

"పూర్ణిమకంటె నిజాయితీగల మనిషిని నేనింకా చూడవలసి ఉంది," అన్నాడు. ఆ జవాబు నారాయణకు సరిపోతుందనుకున్నాడు.

"మొన్న జరిగిన కేసు తర్వాత కూడానా?" అన్నాడు నారాయణ. ఎగతాళిచేస్తూన్న అతని చిరునవ్వు చూసి అతని సాహసానికి ఆశ్చర్యపోయాడు శేఖర్.

"ఆమెను అర్థంచేసుకోడానికి నువ్వు మరో జన్మ ఎత్తాల్సి ఉంటుంది. ఈ విషయం నాదగ్గర మరోసారి ఎత్తవద్దు." కటువుగా అన్నాడు.


*With best compliments of*

**CHANDRASEKHARA SOAP INUDSTRIES**

**G. MEDAPADU, West Godavari Dist.**

ఆ రోజంతా ఆ సంభాషణ గుర్తుకువచ్చి శేఖర్ బాధ పడుతూనే ఉన్నాడు. ఒకప్పుడయితే పూర్ణిమ గిరిగీసి నారాయణను అతని చోటులో నిలబెట్టేది. చేసిన నేరానికి అనుక్షణం పశ్చాత్తాపపడుతూన్న ఆమె అందరి విమర్శ లనూ ఒక శిక్షగానే భరిస్తూంది.

తీర్పు చెప్పిన తరువాత ఆదివారం పూర్ణిమ ప్రభుత్వ అనాధశరణాలయానికి దగ్గరఉన్న ఒక మిఠాయి దుకాణానికి వెళ్ళింది. పదిరూపాయల మిఠాయి ఇయ్యమని అడిగింది. వాడు ఏదికావాలన్నాడు. ఆమె షాపులో అన్నింటినీ కలయ జూసింది. కాని ఓ నిర్ణయానికి రాలేకపోయింది. ఏదో ఒకటి ఇమ్మంది. వాడు అట్టపెట్టెలో కట్టి ఇచ్చేడు. పదిరూపాయల నోటిచ్చి రశీదు ఇయ్యమంది. వాడు మిఠాయి కొన్నందుకు రశీదు ఇచ్చే అలవాటు లేదేమో ఓసారి పూర్ణిమను వింతగా చూసి రశీదు రాసిచ్చేడు.

అనాధ శరణాలయంలోకి పిల్లలకోసం అప్పుడప్పుడు ఎవరైనా తినుబండారాలు తీసుకురావడం జరుగుతూంటుంది అలాగే పూర్ణిమ ప్యాకెట్ తీసుకొచ్చి ఇయ్యగానే వార్డెన్ ఆనందమయి దానిని తీసుకొని "థాంక్సమ్మా!" అంది.

పూర్ణిమ రశీదు ముందుకు పెట్టి "దీనిమీద సంతకం చెయ్యండి," అంది.

ఆనందమయికి అర్థంకాక తెల్లబోయింది.

"ఏమిటిది?" అందామె. పూర్ణిమ కోర్టు ఆర్డరున్న కాగితం చూపించింది.

ఆనందమయి మాట్లాడకుండా సంతకంచేసి రబ్బరు స్టాంపు వేసింది. ఆమె ఇంకా ఆశ్చర్యంలోంచి కోలుకోక ముందే పూర్ణిమ బయటకు వచ్చేసింది.

మరో మూడు వారాల తర్వాత ఆమె శరణాలయానికి వెళ్ళి మిఠాయి ఇచ్చి వస్తూంటే పదిమంది పిల్లలు పూర్ణిమ వెనకాల పడ్డారు.

"ఏమిటమ్మా ఏంకావాలి?" అంది పూర్ణిమ ఆగి.

"నువ్వు ప్రతీ వారం ఒకే స్వీటు ఎందుకు తెస్తున్నావు ఆంటీ? నాకు బర్ఫీ ఇష్టం. వచ్చేవారం తీసుకురావా?" అంది ఆరేడేళ్ళ ఒక పాప.

వెంటనే మిగిలినవాళ్ళందరూ తలోపేరూ అరవడం మొదలుపెట్టేరు.

వాళ్ళనెలాగో తప్పించుకొని బయటకు వచ్చింది పూర్ణిమ.

వారానికో రెండుసార్లు వివేకానందం శేఖర్‌కు టెలిఫోను చేసి పూర్ణిమనుగురించి అడుగుతూండేవాడు. ఆమె కారణంగా ఇద్దరిమధ్యా మంచిస్నేహం ఏర్పడింది.


Deepavali Greetings from

**TECCAST FOUNDRIES**

**Engineers & Contractors**

**Nidamanuru, VIJAYAWADA - 521 108     Phone: 84-367**

Manufacturers of

**Grinding Media, Flour Mills. Tobacco Curing Pipes & Furnaces and all Alloy Castings.**

పదిరోజుల కోసారి వివేకానందం పూర్ణిమ ఇంటికొచ్చి ఓ గంట కూర్చొని ఓ కప్పు టీ తాగి వెళ్ళేవాడు. ఆమె మనోనైర్మల్యానికీ, విషయాలపై ఆమెకున్న సూటి అభిప్రాయాలకూ అతనికి ఆ గంటసేపూ ఎంతో ఆనందంగా గడిచిపోయేది.

## 18

పూర్ణిమకు ఆరోజంతా ఆఫీసులో మనసంతా చికాకుగా ఉంది. పాత జ్ఞాపకాలన్నీ ముసురుకుంటున్నాయి. ఆఫీసు లోంచి ఎప్పుడు బయటపడతానా అని ఎదురుచూసింది.

ఆఫీసు బయటకు వస్తూంటే పెద్ద పెళ్ళి ఊరేగింపు ఎదురయింది.

ముందుగా చెమ్కీ డిజైన్‌లతో కుట్టిన ఎర్రని యూనిఫామ్, కుచ్చుటోపీలు ధరించిన బ్యాండుమేళం. ముప్పై మంది ఒక్కసారిగా రకరకాల వాయిద్యాలతో వాయిస్తూన్న పాట అంతటా నిండి మరేశబ్దమూ వినబడకుండా చేస్తూంది. పాట స్థాయిలో వస్తూన్న హెచ్చుతగ్గులు, బాణీలోని మాధుర్యం హృదయంలో జిల్లుమనిపిస్తున్నాయి. బ్యాండు మేళం వెనుక వధూవరుల బంధుకోటి, కొత్త సూట్సులో, పల్చగా పాలనురుగులా మెరిసే గ్లాస్కో పంచె లాల్చీలలో, రంగు రంగుల పట్టుచీరల మెరుపుల్లో అందరి ముఖాలమీద సంతోషం వెల్లివిరిసి మనసును ఉత్తేజపరుస్తూంది.వారి వెనుక దేవరథంలాగా అలంకరించిన కారుమీద ఎత్తుగా చెమ్కీలతో మెరుస్తూన్న సింహాసనంలో చిలకాగోరింకల్లా వధూవరులు. నునుసిగ్గుతో కనురెప్పలు వాల్చిన వధువు చెవిలో వరుడు ఏదో ప్రేమరహస్యం చెప్తూన్నట్లున్నాడు. దానివెనుక కళ్ళు మిరుమిట్లుగొలిపే ముత్యాలు వెదజల్లే చిచ్చుబుడ్లు. కొత్త కోరికలా రివ్వున ఆకాశంలోకి దూసుకొనిపోయే తారాజువ్వలు.

ఊరేగింపు ముందుకు సాగిపోయింది.

చెప్పలేని ఉద్వేగంతో పూర్ణిమ ముఖం వెలిగిపోతూంది. రెప్పవాల్చకుండా ఆమె పరిసరాలను గుర్తించనట్లుగా ముందుకు సాగిపోతూంది.

అదొక పెద్ద నోవెల్టీ స్టోర్. పూర్ణిమ అందులో అడుగు పెట్టింది. లోపల ఉన్న కస్టమర్స్‌తో స్టోర్స్‌లో మనుషులు సందడిగా ఉన్నారు. పూర్ణిమ కన్నులు ఎదురుగా ఉన్న వస్తువులన్నింటినీ పరిశీలనగా చూస్తున్నాయి. ఆమె మనస్సులో రవిఇంటిలోని డ్రాయింగ్‌రూమ్ గిర్రున తిరుగుతూంది. మ్యధలో కప్పుకు వ్రేలాడుతూన్న గులాబి రంగు ఛాండిలీర్, గోడలో బిగించిన కొంత శిధిలమైన పురావస్తు శిల్పసుందరి, మరో గోడకు వ్రేలాడుతూన్న మనసును




దోచే రంగులతో ఉన్న మాడర్న్ పెయింటింగ్, మూలగా ఉన్న ముక్కోణాకారపు బల్లమీద ఉన్న కంచు ముదుసలి మనోనేత్రంముందు గిరగిరా తిరుగుతూంటే పూర్ణిమ కన్నులు స్టోర్స్‌లో దేనికోసమో వెదకుతూనే ఉన్నాయి. ఒకతను పూర్ణిమ చూపులు చూసి "ఏంకావాలమ్మగారూ!" అని అడిగేడు. ఆమె వినలేదు. తల తిప్పి చూడలేదు. మనుషుల్ని తప్పించుకొని ముందుకు పోతూనే ఉంది. అతని మనసులో ఏదో అనుమానం వచ్చినట్లుంది. చేతికింద ఉన్న గాజు పెట్టెలను గుడ్డతో తుడుస్తూన్నట్లు నటిస్తూ ఆమె వెనుకనే వెళ్ళేడు.

చివరకు పరుగుపెడుతూంటే ప్రస్ఫుటంగా బలంగా ఉబ్బిన కండరాలతో ఆయాసంతో వెడల్పైన ముక్కుపుటాలతో వేగానికి చెదిరిన జూలుతో ఉన్న నల్లని కంచుగుర్రపు బొమ్మపై ఆమె దృష్టి నిలచింది. నిస్సంకోచంగా ఆమె ఆ బొమ్మను చేతిలోకి తీసుకొని అన్నివైపులా తిప్పిచూసి హేండ్‌బ్యాగ్‌లో వేసుకుంది.

ఆమెను వారించడానికి ఆమె చేతిని పట్టుకోడానికి ఆమె వెనుకనే వచ్చిన స్టోర్సుమనిషి చేయి చాపబోతే మరో బలమైనచేయి అతనికి అడ్డువచ్చింది. అతను తలెత్తి చూసేడు.

"ఆ బొమ్మ ఖరీదెంత?" శేఖర్ స్టోర్సుమనిషిని అడిగేడు, పక్కకు పిలచి పర్సుతీస్తూ.

"రెండువందల యాభై రూపాయలు." అన్నాడతను స్టోర్సులోంచి బయటకు వెళ్ళిపోతూన్న పూర్ణిమను రెప్ప వాల్చకుండా చూస్తూ.

"క్యాష్‌బిల్ రాసియ్యి." అని రెండువందలయాభై రూపాయలు అతనికిచ్చేడు శేఖర్.

అతను బిల్లు వ్రాయబోతూంటే "పేరు మిస్ పూర్ణిమ" అన్నాడు శేఖర్.

బిల్లు వ్రాయగానే దానిని జేబులో పెట్టుకొని బయటకు నడిచేడు శేఖర్.

రెడు గంటలతర్వాత ఆ బొమ్మను దాచిన అలమారు వైపు చూడలేక జుగుప్సతో తల రెండోవైపు తిప్పుకొని మంచంమీద పడుకొని ఉంది పూర్ణిమ. రెండు కన్నీటిబొట్లు చెక్కిళ్ళమీదనుండి తలగడమీదకు జారిపోయాయి.

## 19

మిఠాయి దుకాణంవాడు అల్లంత దూరాన పూర్ణిమను చూసి పదిరూపాయల లడ్డూ తూచి అట్టపెట్టెలో పాక్‌చేసి పదిరూపాయలకు రశీదు వ్రాసి మడతపెట్టి పెట్టెకు చుట్టిన

*With Best Compliments from:*

**THE VIJAYAWADA PARBOILED RICE MILL**

**Plot No. 1, Phase 3, Jawahar Auto Nagar Vijayawada-520 007.**

రబ్బరుతాడు క్రిందపెట్టేడు. పూర్ణిమ దగ్గరకు రాగానే ఆమె బేరాన్ని ప్రత్యేకమైన శ్రద్ధతో చేసినట్లు నవ్వి ప్యాకెట్ అందించేడు. పూర్ణిమ పదిరూపాయలకాగితం ఇచ్చి నాలు గడుగులు వేసి మళ్ళీ వెనక్కు వచ్చింది.

"ఇందులో ఏమున్నాయి?" అని అడిగింది దుకాణ దారుణ్ణి.

"అవే అమ్మగారూ! ప్రతి ఆదివారం మీరు తీసుకెళ్ళే లడ్డూ," అన్నాడు వాడు అతి వినయంతో.

"ఇవి తీసేసి బర్ఫీ కట్టియ్యి." అంది ఆమె ప్యాకెట్ తిరిగిఇస్తూ.

"నిజంగా ఇయ్యమంటారా?" అన్నాడు వాడు అర్థంకాక.

"అవును" అందామె.

వాడు తెల్లబోయి లడ్డూ తీసి బర్ఫీ కట్టిచ్చేడు. అంతకు సరిగా ఒక గంటక్రితమే వివేకానందం శరణాలయానికి వెళ్ళేడు. ఆనందమయిని పూర్ణిమ గురించి అడిగేడు. అంతా విని పూర్ణిమను శరణాలయంలోని పిల్లలకు పరిచయం చెయ్యమనీ ఆమె అక్కడికివచ్చినప్పుడల్లా వారి జాలిగాథలు ఆమెకు వినిపించమనీ చెప్పేడు.

పూర్ణిమ మిఠాయి ప్యాకెట్ తీసుకెళ్ళేసరికి ఆనంద మయి ఆఫీసులో ఉంది.

"అమ్మా పూర్ణిమా! నువ్వేం అనుకోకపోతే నేను ఆఫీసుపనిలో కొంచెం బిజీగా ఉన్నాను. పక్క హాలులో పిల్లలున్నారు. కొంచెం ఆ స్వీట్సు వాళ్ళకు పంచేసి వెళ్ళిపో!" అంది.

పూర్ణిమ సరేనని ప్రక్కహాలులోకి వెళ్ళింది. పిల్ల లందరూ "ఆంటీ! ఆంటీ!" అంటూ చుట్టుముట్టేరు.

ముందు వారం బర్ఫీ అడిగిన పాపను గుర్తుపట్టింది పూర్ణిమ.

"నువ్వు బర్ఫీ అడిగేవుగా ఈరోజు తెచ్చేను." అని ఒకటి ఆమె చేతిలో పెట్టింది. మళ్ళీ మిగిలిన పిల్లలందరూ ఎవరికి ఇష్టమయిన మిఠాయి పేర్లు వాళ్ళు అరవడం మొదలు పెట్టేరు. వాళ్ళకు ఎలాగో మళ్ళీవారం తెస్తానని జవాబు చెప్పి అందరికీ మిఠాయి పంచుతూంది. ప్రేమతో ఇచ్చే చిన్నముక్కకు ముఖమంతా ఆనందంచేసుకొని ఆశతో ఎగబాకే ఆ పిల్లలను చూస్తే జాలికలిగింది పూర్ణిమకు ప్యాకెట్‌లోని మిఠాయి అయిపోయింది.

సరిగా అప్పుడే మూడేళ్ళ పాపాయి పక్కగదిలోంచి వచ్చి గుమ్మంలో నిలబడింది.

ముద్దులొలికే బంగారుపళ్ళెంలాంటి ముఖం. చక్రాల్లాంటి కళ్ళు. వాటిలో గూడుకట్టుకున్న దిగులు. చెదిరి పాయలుగా


With Best Compliments of

india block makers

Gandhi Nagar, Vijayawada-3

Tel : 72295

ముఖంమీద పడుతూన్న జుట్టు. రెప్పవాల్చకుండా పూర్ణిమ ముఖంలోకి చూస్తూంది.

తనచేతిలో ఖాళీ అట్టపెట్ట చూడగానే పూర్ణిమ మనసు చివుక్కుమంది. చేసేదిలేక వెనక్కు వచ్చేసింది. తాత్కాలికంగా ఆ సంఘటన పూర్ణిమ మరచిపోయింది కాని తరచుగా తరువాత అదే గుర్తుకు రావడం మొదలుపెట్టింది.

ఇంట్లో ఏదైనా పుస్తకం చదువుతూన్నప్పుడు ఆ పేజీల్లో పక్కగదిలోంచి నడచివచ్చి గుమ్మందగ్గర నిలబడ్డ ఆ అమ్మాయి బొమ్మ కనబడేది.

ఆఫీసులో టైపుచేస్తూంటే హఠాత్తుగా రోలర్ నిలిచిపోయేది. దిగులు దాచుకున్న చక్రాల్లాంటి కళ్ళతో రెప్పవాల్చకుండా ఆ పాప తన కళ్ళల్లోకి చూసిన దృశ్యం గుర్తుకు వచ్చేది.

దారిలో ఎక్కడ మిఠాయిదుకాణం కనబడినా ఆ రోజు చివరకు తాను ఆ పాపముందు ఖాళీపెట్టెతో నిలబడ్డ దృశ్యమే గుర్తుకొచ్చేది.

ఒకసారి ఆ పాపను చూసి మిఠాయి చేతిలో పెట్టేవరకు మనసు నిలచేటట్లులేదు. ఆదివారం ఇంకా నాలుగురోజులుంది. అయినా వెళ్ళడానికే నిశ్చయించుకుంది. ఆ రోజు తన షాపుముందు పూర్ణిమను చూసి మరోసారి ఆశ్చర్యపోయాడు మిఠాయిదుకాణంవాడు.

ఆ రోజు లడ్డూ, బర్ఫీ కాకుండా అన్ని రకాల మిఠాయిలూ కట్టించింది. చిన్నపాపకు వేరే ఒక చిన్న పాకెట్ తీసుకుంది. అతను రశీదు రాయబోతే ఆ రోజు అక్కర్లేదని చెప్పింది.

శరణాలయంలో పిల్లలందరూ ఆడుకుంటున్నారు. చిన్నపాపకోసం ఎంత చూసినా కనబడలేదు. మిగిలిన పిల్లలందరికీ ఎవరికి కావలసినది వాళ్ళకు పంచిపెట్టింది. పెట్టె ఖాళీ అయింది.

సరిగా అప్పుడే ఆ పాప వచ్చి మళ్ళీ నిలబడింది. అదే నడక. అదే చూపు. కళ్ళల్లో దిగులు మరికొంచెం ఎక్కువగా ఉంది.

పిల్లలందరూ దూరంగా వెళ్ళిపోయారు. పూర్ణిమ తన బాగ్‌లోనుంచి చిన్నపాకెట్ తీసి పాప కివ్వబోయింది. పాప చెయ్యి చాచలేదు. చూపు మరల్చలేదు. పూర్ణిమ హృదయం కరిగిపోయింది. పెట్టె తెరిచి ఒక మిఠాయి తీసి ఇయ్యబోయింది. అయినా పాప తీసుకోలేదు. పూర్ణిమ పాపను ఎత్తుకుంది. బుజ్జగించి ముద్దాడింది. అప్పుడు మిఠాయి తినమని బ్రతిమాలితే నోరు తెరిచింది.

*With best compliments of*

**AUTOMOTIVE RUBBER INDUSTRIES**

Industrial Estate, Vijayawada

"నీ పేరేమిటమ్మా?" పూర్ణిమ అడిగింది.

"బేబి" అంది ముద్దుగా.

అప్పుడే అక్కడికి వచ్చిన ఆనందమయి మంగళవారం నాడు శరణాలయంలో పూర్ణిమను చూసి ఆశ్చర్యపోయింది. అదీకాక ఆ పాపను పూర్ణిమచేతుల్లో చూసి మరీ ఆశ్చర్యపోయింది. ఓసారి పిల్లల్ని చూడాలనిపించి మధ్యలో వచ్చేనంది పూర్ణిమ.

ఆనందమయి తర్వాత చెప్పింది.

ఆ అమ్మాయి కలయింటి బిడ్డ. కొద్దిరోజుల క్రితం జరిగిన రైలుప్రమాదంలో ఆ అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు అందరూ చనిపోయారు. ఎవరూ పాపను తీసుకెళ్ళకపోతే శరణాలయానికి తీసుకొచ్చేరు. పాప మిగిలిన పిల్లలతో కలవడంలేదు. తిండి సరిగా తినడం లేదు.

ఇప్పుడు ఇంత చనువుగా పూర్ణిమదగ్గరకు రావడంవల్ల తనకు ఎంతో ఊరట కలిగిందనీ పూర్ణిమ తరచుగా వస్తే వీలయినంత త్వరగా పాప కోలుకోవచ్చుననీ ఆనందమయి చెప్పింది.

పూర్ణిమ సంతోషంగా ఒప్పుకుంది. బేబీతో మరో గంటసేపు ఆడుకొని ఇంటికి వెళ్ళింది పూర్ణిమ.

## 20

"గుడ్ మార్నింగ్ సర్!" అన్నాడు నారాయణ శేఖర్ కేబిన్ తలుపు తీసుకొని లోపలకు వచ్చి.

"గుడ్ మార్నింగ్! కమాన్! కూర్చోండి. మీకోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు శేఖర్.

"చెప్పండి సార్!" నారాయణ వినయంగా ముందుకు వంగేడు.

"రేపు బ్యాంకులన్నీ స్ట్రైక్ చేస్తున్నాయి కదూ?"

"అవును సార్!"

"మనకి పే డే కదా! అదీకాక జీతాలతోపాటు రేపు బోనస్ కూడా ఇవ్వాలి. ఏంచేద్దాం మరి!"

నారాయణ ఆలోచిస్తున్నాడు.

"ఈవేళే కాష్ డ్రాచేసిపెడితే!...." శేఖర్ సూచించేడు.

"చెయ్యొచ్చు సార్!"

మొత్తం బిల్లు ఎంతుంటుంది?"

"ఇంచుమించుగా రెండు లక్షలు సర్!"

"ఓకే! చెక్ తయారుచెయ్యండి" అన్నాడు శేఖర్.

మరో పదినిముషాల్లో చెక్ తయారుచెయ్యడమూ, శేఖర్ సంతకం చెయ్యడమూ జరిగింది.


With best compliments from:

**KANTHI PRINTING INKS PRIVATE LIMITED**

Anjaneya Panthulu Street, Labbipet,

Vijayawada - 520 010

Phones : Offi 72060
Fact : 74083
Res : 77047

*Manufacturers of*

**Quality Printing Inks for Letter Press, Offset and Litho**

*Distributors for Twin Cities*

**SRI LAKSHMI ENTERPRISES**

Raj Bhavan Road, Hyderabad-500 004. Phone : 35842

బ్యాంకుకు వెళ్ళేముందు నారాయణ మళ్ళీ శేఖర్ దగ్గరకు వచ్చేడు.

"రెండు గవర్నమెంటు ఆఫీసుల్లో మనవి యాభై వేల రూపాయలదాకా బిల్లులు నెలరోజులకు పైగా పెండింగ్ ఉండిపోయాయి సార్!"

"మిమ్మల్ని టెలిఫోనుచేసి చూడమన్నానుగా."

"నిన్న టెలిఫోను చేసేను. కొన్ని ఐటమ్స్ డిస్కస్ చెయ్యాలి. ఈ సాయంత్రం ఎవరినైనా పంపమని ఆఫీసు వాళ్లు చెప్పేరు సార్! ఎవర్నైనా పంపితే...."

"ఎవరో ఎందుకు? సాయంత్రం మీరే వెళ్ళిరండి. అలాగే రెండో ఆఫీసుకు కూడా వెళ్ళి దాన్నిగురించి కూడా మాట్లాడి రండి."

"ఓకే సార్!" నారాయణ బయటకు వచ్చేడు. బ్యాంకుకు వెడుతూ కంపెనీ ఎక్స్‌పోర్టు బిజినెస్‌కు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్సు పూర్ణిమ కిచ్చి సాయంత్రానికి టైపు చెయ్యమన్నాడు. పూర్ణిమ సరేనంది.

పూర్ణిమకు అనాథశరణాలయంలోని పిల్లలకు చేరువగా వెళ్ళినప్పటినుంచి మనసులోని ఒంటరితనం కొంతవరకూ తగ్గి ప్రశాంతత కలుగుతూంది. కొంతమంది మనుషులు చేసిన పొరపాట్లవలన, మరికొన్ని దైవికమైన ఆపదలవలన దిక్కులేనివారైన పసికూనల్ని కడుపులో దాచుకొని పెంచుతూన్న ఆ శరణాలయం ఆలోచించగా ఆలోచించగా ప్రపంచంలో దేవుడుచేసిన సృష్టిలో చాలా ఉత్తమమైన అంశంగా కనబడింది. వేరు వేరు మతాల్లోంచి, వేరు వేరు కులాల్లోంచి, వేరు వేరు పరిసరాల్లోంచి పరిస్థితుల్లోంచి అక్కడకు చేరిన ఆ చిన్నపిల్లలు ఏ భేదమూ ఎరుగక కేరింతలు కొడుతూ ఆడుతూఉంటే ఆదర్శప్రపంచానికి అద్దొక మచ్చుతునకలా అనిపించింది. అదే సమయంలో ఇంత విస్తృతమైన నాగరిక ప్రపంచంలో ఒక అనాధాశ్రమం, దిక్కులేని పిల్లలు చేరిన ఇల్లే బయటి ప్రపంచంకంటె మెరుగనిపించినప్పుడు ఆ సంఘం ఎంత దిగజారిపోతూందో నన్న బాధ కూడా కలిగింది.

ఈ ఆలోచనలతో రాను రాను మానసికంగా పిల్లలందరికీ మరీ చేరువవుతూ వచ్చింది. ముఖ్యంగా బేబీని విడిచి వుండడం రోజు రోజుకూ కష్టమవుతూంది. బేబీ కూడా పూర్ణిమ వెళ్ళేసరికి గేటుదగ్గర నిలబడి ఎదురుచూస్తూనే ఉంటుంది. దగ్గరకు రాగానే రెండుచేతులూ చాచి కౌగిలించుకుంటుంది. ఎప్పుడో ఒకరోజు ఇబ్బందిగా ఉండే తప్ప పూర్ణిమ ప్రతిరోజూ శరణాలయానికి వెడుతూనే ఉంది.

Phones: H. O. 268 B.O. 568 President 314

Grams: URBANBANK
P. B. No. 25

**THE GUDIVADA CO-OPERATIVE URBAN BANK LIMITED,**

No. 1482 Gudivada (Estd. 1915) GUDIVADA-521 301. Krishna Dist. (A. P.)

***Diamond Jubilee celebrated on 9-5-1976***

| | (Rs. in lakhs) |
|---|---|
| Authorised Share Capital ... | 20.00 |
| Paid-up Share capital ... | 6.00 |
| Reserve fund and other reserves ... | 7.70 |
| Deposits ... | 157.30 |
| Loans and advances ... | 96.30 |
| Working capital ... | 171.00 |
| Profit for the Co-operative year 1977-78. (Subject to Audit) ... | 3.34 |

*Safety lockers are available.*
*The bank is recognised as insured bank.*

**Rates of interest on Fixed deposits:**

| | |
|---|---|
| 15 days to 45 days ... | 3.50% |
| 46 days to 90 days ... | 4.00% |
| 91 days to below 6 months ... | 5.00% |
| 6 months to below 9 months ... | 5.50% |
| 9 months to below 12 months ... | 6.00% |
| 1 year to 3 years ... | 7.00% |
| 3 years above & upto and inclusive of 5 years ... | 8.50% |
| 61 months and above ... | 10.00% |
| Current account deposits ... | 0.50% |
| Savings bank deposits ... | 5.50% |

Accepting Savings, Recurring, Current and Cash - certificates and providing all types of Banking facilities.

Cash-certificates with maturity value and rate of interest.

| | Amount | Period | Maturity value | Rate of interest |
|---|---|---|---|---|
| (1) | Rs. 100 | 61-months | Rs. 165.19 | 12.84% |
| (2) | Rs. 100 | 120-months | Rs. 268.48 | 16.84% |
| (3) | Rs. 100 | 180-months | Rs. 439.93 | 22.66% |
| (4) | Rs. 100 | 240-months | Rs. 720.87 | 31.04% |

**R. Sobhanadri Chowdary**
President

**A. S. Bhaskararao, B. A., H.D.C.**
Secretary

ప్రపంచ బాలల దినోత్సవానికి శరణాలయంలో పండుగలు జరుపుతామనీ దానికి తగినట్లు పిల్లలచేత ఏమైనా ఆట పాటలు ఏర్పాటుచేయమనీ ఆనందమయి పూర్ణిమను కోరింది. పూర్ణిమ మనసులో మెరపులాంటి ఆలోచన వచ్చింది.

తుంపరలుగా మొదలై చినుకులుగా నేలబడిన నీరు వాగులై వరదలై, నదుల్లోంచి సముద్రాల్లోకి చేరి ప్రపంచ వ్యాప్తమైనట్లు మనిషికీ మనిషికీ మధ్య పుట్టిన మమత కుటుంబాలూ కులాలూ మతాలూ ఊళ్ళూ దేశాలూ దాటి ప్రపంచవ్యాప్తమై అందర్నీ ఒకటిగా చేస్తుంది అనే పాట వ్రాసి దానికి బాణీ కట్టి, బేబీతో మొదలైన పాట శరణాలయం లోని పిల్లలందరూ కలిసి తగువిధంగా నాట్యంచేస్తూ పాల్గొనేటట్లుగా శిక్షణనిస్తూంది పూర్ణిమ. చదువుకొనే రోజుల్లో నేర్చుకున్న ప్రావీణ్యమంతా తిరిగి సాక్షాత్కరించింది. పూర్ణిమద్వారా శరణాలయంలో వస్తూన్న మార్పు ఆనందమయికి ఎంతో ఆనందం కలిగించింది.

ఈ ఆలోచనలతో కొద్దిసేపు పరిసరాలు మరచిపోయిన పూర్ణిమ నారాయణ పిలుపుతో ఉలిక్కిపడింది.

"నేను ఉదయం టైపుచెయ్యమని ఇచ్చిన డాక్యుమెంట్సు పూర్తి అయ్యాయా?" అన్నాడు నారాయణ.

"లేదు. ఈ రోజు కాకపోవచ్చు" అంది పూర్ణిమ.

"ఎంతవరకూ అయితే అంతవరకూ చేసి బాస్ దగ్గర సేఫ్ తాళం చెవులు తీసుకొని అందులో పెట్టేసి తిరిగి తాళంచెవులు బాస్‌కు ఇచ్చెయ్. నేను కంపెనీ బిల్సు గురించి బయటికి వెడుతున్నాను," అన్నాడు నారాయణ.

సరేనంది పూర్ణిమ.

నారాయణ మరోసారి శేఖర్‌కు చెప్పి వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఆఫీసు టైమయ్యేసరికి పూర్ణిమ డాక్యుమెంట్సు టైపుచెయ్యడం పూర్తిచెయ్యగలిగింది.

నారాయణ చెప్పినట్లుగానే వాటిని సేఫ్ తెరిచి అందులో పెట్టి తాళంచెవులు శేఖర్‌కిచ్చి వెళ్ళిపోయింది.

మర్నాడు ఉదయమే నారాయణ వచ్చి తనదగ్గర తాళం చెవులు తీసుకొని వెళ్ళి సేఫ్ తెరిచి అందులో అంతకు ముందు తను పెట్టిన రెండు లక్షల రూపాయలు కనబడటం లేదని చెప్పినప్పుడు శేఖర్ ముందుగా ఆశ్చర్యపడినా ఆలోచించగా ముందురోజు జరిగిన సంఘటనల అన్నిటి వెనుక చాలా జాగ్రత్తగా అల్లబడిన ఒక సూత్రం కనబడింది.

వెంటనే నారాయణను తన కేబిన్‌లోకి పిలిచేడు. కూర్చోమన్నాడు. నారాయణ కూర్చున్నాడు. శేఖర్ పరిశీలనగా


Phones : 30151 - 10 Lines

*Stay at*

**HOTEL KRISHNA**

**Lakdikapul, Hyderabad-500 004**

- For Luxurious Airy Rooms, Homely Comforts with attached Bathrooms
- Two way channel music
- Telephone and efficient service and wholesome vegetarian meals.

*With best compliments from*

**SANGAM CINEMA (Air conditioned), Charminar X Road**

**BHAGYANAGAR FILM STUDIOS, Banjara Hills, Hyderabad.**

కొంతసేపు అతని ముఖంలోకి చూసేడు. తరువాత నెమ్మదిగా అన్నాడు.

"సాయంత్రంనుంచి ఇప్పటివరకూ తాళంచెవులు నా దగ్గరే ఉన్నాయే!....ఏంజరిగి ఉండవచ్చు నంటావు?"

"నిన్న సాయంత్రం మీరు సేఫ్ తాళంవేసే వెళ్ళేరా?"

"నేను సేఫ్ తాళం వేసే ప్రసక్తేముంది? లేదు. నువ్వు నాకు తాళా లిచ్చినతర్వాత నేను సేఫ్ తెరవనేలేదు.... జరిగిందేదో నిన్న నువ్వు తాళాలు వేసేముందే జరిగి ఉండాలి...."

"లేదు." నారాయణ మనసులో ఉద్రేకాన్ని బయటపడ కుండా బ్రహ్మప్రయత్నం చేస్తున్నాడు. "నిన్న నేను తాళం వేసినప్పుడు లేని ఎక్స్‌పోర్ట్సు డాక్యుమెంట్సన్నీ సేఫ్‌లోనే ఉన్నాయి ఇప్పుడు....మీ రేమైనా పెట్టారా?" నారాయణ అడిగేడు.

"లేదు. నేను వాటి నసలు చూడనేలేదు. బాగా గుర్తుకు తెచ్చుకో! నిన్న నువ్వు వెళ్ళేముందే అవి నువ్వు లోపల పెట్టి ఉండాలి."

"లేదు. నాకు బాగా గుర్తుంది. నేను వెళ్ళేటప్పటికి వాటిని పూర్ణిమ ఇంకా టైపు చేస్తూంది." నారాయణ ముఖం మీద చిరుచెమటలు కమ్ముతున్నాయి.

"ఓ! ఐసీ! అయితే వాటిని పూర్ణిమ పెట్టి వుండాలి" అన్నాడు శేఖర్.

"అందుకనే నేను ఆమెకు తాళాలివ్వడం అంత మంచిది కాదన్నాను," అన్నాడు నారాయణ ఏదో సూచిస్తున్నట్లుగా.

శేఖర్‌కు నారాయణ వేసిన పథకం అర్థమయ్యింది. నారాయణకు మొదటినుంచీ ఉన్న బలహీనతలవల్ల తనకు లొంగని పూర్ణిమను కొంచెం అల్లరిచెయ్యడానికి అతను అప్పుడప్పుడు ప్రయత్నిస్తున్నాడు గానీ ఇంత ఆలోచన చేస్తాడని ఊహించలేదు. ఏమైనా ఇప్పుడు నిజం బయట పడాలి. మాటలు మిగలడంవలన ప్రయోజనంలేదు అనుకొని పట్టలేని ఆవేశాన్నంతా దిగమింగుకొని శేఖర్ అన్నాడు.

"మిస్టర్ నారాయణా! ఒక్కొక్కప్పుడు మనం కొన్ని బలహీనతలకు లొంగి కొన్ని కొన్ని పనులు చేస్తాం. వాటిని సరియైన టైములో దిద్దుకుంటే గట్టెక్కి బయట పడతాం. లేకపోతే జీవితాలే నాశనమవుతాయి. ఇదంతా నువ్వు చేసిన పనిగా నేను భావిస్తున్నాను. రేపు ఉదయందాకా నువ్వు చేసిన పొరపాటును సర్దుకోడానికి నీకు టైమిస్తు న్నాను. అన్నీ సవ్యంగా జరిగితే నేను అన్నిటినీ మరచి పోవడానికి సిద్ధమే. కాకపోతే కాలం అన్నీ నిర్ణయిస్తుంది. టిల్ దెన్ యు ఆర్ సస్పెండెడ్!"


దీపావళి శుభాకాంక్షలు!

నాణ్యమైన వస్త్రములు, సరసమైన ధరలకు

# వెంకటేశ్వర వస్త్రాలయము

బృందావన్ బిల్డింగు, నాంపల్లి స్టేషన్ రోడ్డు,
హైదరాబాదు–500 001.
ఫోన్: 2 2 1 2 2 6.

మేఘంలేని ఆకాశంలోంచి పిడుగు పడ్డట్టయింది నారాయణకు.

ఒక్క క్షణం అలాగే కూర్చొని తర్వాత బయటకు వెళ్ళిపోయాడు.

శేఖర్ పూర్ణిమను పిలిచి నారాయణ సస్పెన్షను ఆర్డరు డిక్టేట్ చేసేడు.

## 21

మర్నాడు శేఖర్ ఆఫీసుకు వెళ్ళేసరికి మొత్తంఫ్యాక్టరీ సిబ్బంది అంతా బయట ఉన్నారు.యూనియన్ బేనర్ నిలబడి ఉంది. నారాయణను సమర్థిస్తూ శేఖర్‌ను నిందిస్తూ నినాదాలు చెవులు గింగురుమంటున్నాయి. నారాయణ తన పనిని ఎంత పథకంవేసుకొని చేస్తున్నాడో అర్థమయింది.

ఆఫీసు లోపలికి వెళ్ళగానే పూర్ణిమ తన టైపురైటర్ దగ్గర కూర్చొని ఏమీ జరుగనట్లుగా పనిచేసుకోవడం చూసేడు శేఖర్. ఆమెముఖంమీద ముద్రవేసుకున్న ఆత్మ స్థైర్యానికి ముగ్ధుడయ్యాడు శేఖర్. ఇటువంటి తోడేఉంటే జీవిత సమరం ఎంత ఉత్సాహపూరితంగా ఉంటుంది అనుకున్నాడు.

తాను స్వయంగా వెళ్ళి యూనియన్ లీడరును పిలిచి తనవైపునుండి విషయం విపులీకరిద్దామనుకుంటూంటే అతడే వచ్చేడు. చెప్పింది వినకుండా యూనియన్ పరిభాషలో శేఖర్ చేసిన నేరాన్ని తద్వారా ప్రపంచ కార్మికవర్గానికి జరిగే అక్రమానికి ముడిపెట్టి చెప్పి నారాయణను ఉద్యోగంలోకి తీసుకొని అందరిలో అతనికి క్షమాపణ చెప్పుకొనే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించేడు.

“మరి పోయిన డబ్బు?” శేఖర్ అడిగేడు.

“కార్మిక వర్గానికి ఎదురుశక్తులు ఫాక్టరీలో చేరి యాజమాన్యాన్ని విలాసాలలో ముంచుతూ చేసే దొంగతనాలకు దోపిడీలకు కార్మికవర్గంలో సభ్యులెవరూ బాధ్యులు కాలేరు.” అన్నాడు.

“అంటే మీ ఉద్దేశం?”

“దానిని అంతకంటె వివరించవలసిన అవసరం లేదు.”

“అయామ్ సారీ! నేను కేసును పోలీసుకు అప్పగిస్తాను. అది తేలేవరకూ నారాయణను ఉద్యోగంలోకి తీసుకోవడం జరుగదు. మీ యిష్టం వచ్చినట్లు చెయ్యవచ్చు.”

యూనియన్ లీడరు వెళ్ళిపోయాడు.

శేఖర్ పోలీసుకు టెలిఫోను చెయ్యబోయి టెలిఫోను తీగలు తెంపివేసినట్లు గ్రహించేడు.

బయటకు వెళ్ళబోతే కారుటైర్లు కోసివేయబడ్డాయి. గోడకట్టినట్లు జనం అడ్డుగా నిలబడ్డారు.

*With Best Compliments of*

**Sri SYAMALA AGENCIES**

**Bose Road, Tenali 522201**

నాలుగైదు కోడిగుడ్లు టమాటోలు మీదపడి చితికి బట్టలన్నీ పాడుకాగా మరో మార్గంలేక తిరిగి ఆఫీసులోకి వచ్చి కూర్చున్నాడు శేఖర్.

సాధారణంగా తప్పుదారిపట్టని యూనియన్‌ను కూడా తప్పుదారి పట్టించిన నారాయణకు ఎలాగైనా లొంగటానికి వీల్లేదని నిశ్చయించుకున్నాడు.

ఇది పూర్ణిమ సమర్థించే విషయం ఒక్కటేకాదు, ఒక అమాయకురాలిపై చెయ్యని నేరాన్ని మోపడానికి ప్రయత్నించే ఈ చర్యను తానెన్నటికీ సమర్థించలేడు. ఇన్నాళ్ళూ తాను ఆర్జించిన పలుకుబడి, సంపద, చివరకు తన ప్రాణం ఇందులో అర్పించవలసివచ్చినా సరే!

పూర్ణిమ ఎదురుగా వచ్చి తాను వెడుతున్నానని చెప్పింది. ఎందుకని శేఖర్ అడగలేదు. ఆమె చెప్పలేదు. పూర్ణిమ వెళ్ళిపోయింది.

మరో రెండునిముషాల్లో ఆకాశాన్నంటే నినాదాలు విన్నాడు శేఖర్. తనకూ పూర్ణిమకూ అక్రమమైన సంబంధాన్ని ఆరోపిస్తున్న అశ్లీలమైన అరుపులు విన్నాడు.

మరో రెండుగంటల తర్వాత పోలీసు సిబ్బంది వచ్చింది.

వారి మధ్య ఒకచేతికీ నుదుటికీ కట్టు కట్టుకున్న పూర్ణిమ ఉంది.

శేఖర్ కేసు పోలీసులకు అప్పగించేడు. ఫాక్టరీకి లాకౌట్ ప్రకటించేడు.

పూర్ణిమను ఆమె యింటివద్ద దింపి ఆమె చూపించిన సాహసానికి ఎంతగానో అభినందించేడు. ఆ మనోస్థైర్యం చివరిదాకా ఉంచుకోవాలని ఆశిస్తున్నానన్నాడు.

తర్వాత శేఖర్ వివేకానందాన్ని కలసి కొన్ని విషమ పరిస్థితుల వలలో చిక్కుకొని అప్పుడే విజయవంతంగా బయటికి రావడానికి ప్రయత్నిస్తూన్న పూర్ణిమపై ఇది క్రూరమైన అభాండమనీ తొందరగా విచారణ జరిపి దోషి ఎవరో నిర్ణయంకావడం చాలా అవసరమనీ అభ్యర్థించేడు.

కంపెనీ ఉద్యోగులు నారాయణకూ, శేఖర్ పూర్ణిమకూ జామీనుఇచ్చి విడిపించేరు.

## 22

కేసు విచారణ రెండు రోజులుందనగా ఒకరోజు సాయంత్రం రోడ్డుమీద కనబడ్డ పూర్ణిమను నారాయణ వెంబడించేడు. ఆమె అనాధశరణాలయంలోకి వెళ్ళడం చూసేడు. ఎంతసేపటికీ రాకపోతే తానుకూడా లోపలకు వెళ్ళేడు. లోపల పూర్ణిమ పిల్లలతో ఆడుతూంది. నారాయణ తిన్నగా వార్డెనుదగ్గరకు వెళ్ళేడు. ఆనందమయి పదిహేను


*With Best Compliments from*

**RAJESWARI & CO.,**

**ESTD. 1954**

Besant Road, Vijayawada-520 002

**Phones : Office 74479 Res. 76884.**

**Leading Quality Office Stationers, Govt. Tender Suppliers**

***Specialists in:*** **Art Materials as Brushes, Oil and Poster Colours and Drawing Equipment, Engineering Material as Drawing Boards, 'T' Squares, Setsquares, Mini Drafters, and Instrument Boxes etc.**

**Available at Moderate Prices.**

A TRIAL WILL CONVINCE YOU

రోజులు శలవుపెడితే మరో శరణాలయంలో పనిచేస్తున్న వనజాక్షిని తాత్కాలికంగా ప్రమోట్‌చేసి ఇక్కడ వేసేరు.

నారాయణను చూడగానే ఏంకావాలని అడిగింది.

"అక్కడ పిల్లలతో ఆడుతూంది చూడండి. ఆ అమ్మాయి మీకు తెలుసా?"

"తెలుసు. ప్రతీ ఆదివారం ఆ అమ్మాయిని ఈ శరణాలయంలో స్వీట్సు ఇచ్చివెళ్ళమని కోర్టువారి ఆర్డర్సు ఉన్నట్లు ఆనందమయిగారు చెప్పేరు."

"కాని ఈ రోజు ఆదివారం కాదుగా!"

"ఆ అమ్మాయి కాస్త పిల్లలతో కలివిడిగా ఉంటుంది. ఇంతకీ మీరెవరు?"

"నేను ఆ అమ్మాయిని గురించి హెచ్చరిద్దామని వచ్చేను. ఆమె ఏది కనబడితే అది దొంగిలిస్తుంది. దానికే కోర్టువారు ఆడదికదా అని కనికరించి ఈశిక్ష వేసేరు. మరో దొంగతనం కేసు ఆమెమీద ఉంది. ఎల్లుండి విచారణ. ఇలా పసిపిల్లలతో కలవనిస్తే అభంశుభం తెలియని పిల్లలకు మంచిదికాదని చెప్పడానికి వచ్చేను. మీ యిష్టం." నారాయణ బయటకు వచ్చేసేడు.

వెంటనే వనజాక్షి భయపడి పూర్ణిమదగ్గరకెళ్ళి ఆదివారం నాడు మాత్రమే శరణాలయానికి రమ్మనీ, తనపని చేసుకొని పోవాలిగాని పిల్లలతో కలవొద్దనీ హెచ్చరించింది.

హఠాత్తుగా వచ్చిన పరిణామానికి ఆశ్చర్యపోయి పూర్ణిమ కారణం అడుగబోతే వనజాక్షి దుర్భాషలాడింది. పూర్ణిమ గత్యంతరంలేక అవమానంతో గుడ్లనీళ్ళు కుక్కుకొని వచ్చేసింది.

మర్నాడు ఆదివారం. మిఠాయిపాకెట్ ఇవ్వడానికి పూర్ణిమ నలిగిపోయిన మనస్సుతో శరణాలయానికి వెళ్ళింది. వనజాక్షి పాకెట్ తీసుకొని రశీదుమీద సంతకంచేసి వెళ్ళిపొమ్మంది. పూర్ణిమకోసం కళ్ళు కాయలు కాచేటట్లు ఎదురుచూసిన బేబీ పరిగెత్తుకొని రాగానే అమాంతం కౌగిలించి ముద్దు పెట్టుకుంది పూర్ణిమ. వనజాక్షి క్రూరంగా బేబీని విడదీసి ప్రక్కగదిలో పెట్టి తలుపువేసి పూర్ణిమను వెళ్ళిపొమ్మని అరచింది.

ప్రక్కగదిలో బేబీ రోదనకు గుండెలు తరుక్కుపోతూంటే శరణాలయాన్ని విడువలేక విడువలేక కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ వెళ్ళింది పూర్ణిమ.

## 23

కేసు విచారణ ప్రారంభమైంది.


# దీపావళి శుభాకాంక్షలు

## విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

1978 నవల పోటీలలో

ద్వితీయ బహుమతి

బలిపశువు —జాతశ్రీ 5-00

తృతీయ బహుమతి

కోటి కుటుంబాల ఘోష 5-00

—కె. బ్రహ్మానందరావు

కన్సొలేషన్ బహుమతి

సంకెళ్ళు తెగుతాయి —మల్లిక్ 6-00

1977 నవలల పోటీలో

ప్రథమ బహుమతి

దేవుళ్లారా మీ పేరేమిటి —శ్రీకాంత్ 6-00

ద్వితీయ బహుమతి

కన్నీటికి నోరొచ్చింది 6-00

—ఎస్. కాశీవిశ్వనాథ్

తృతీయ బహుమతి

వీళ్ళూ మనుషులే 6-00

—డా॥ పరుచూరి రాజారామ్

## విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-4

## విశాలాంధ్ర బుక్ హౌస్

విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్టణం, అనంతపురం, తిరుపతి, వరంగల్లు, గుంటూరు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వివరాలన్నీ ఇచ్చి మొదట ముద్దాయిగా నారాయణను ప్రవేశపెట్టేడు.

నారాయణచేత ప్రమాణం చేయించేరు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశ్నించడం మొదలుపెట్టేడు.

"మీ పేరు?"

"నారాయణ."

"ఎక్కడ పనిచేస్తున్నారు?"

"యూనివర్సల్ ఇంజనీరింగ్ కంపెనీలో."

"మీ డిజిగ్నేషను ఏమిటి?"

"మేనేజరు."

"ఎన్నాళ్లనుంచి పనిచేస్తున్నారు?"

"పదమూడు సంవత్సరాలనుంచి."

"మేనేజరుగా ఎన్నాళ్లనుంచి చేస్తున్నారు?"

"ఏడు సంవత్సరాలుగా."

"అంతకు ముందు?"

"ఎకౌంటెంటుగా పనిచేసాను."

"మేనేజరుగా మీ పనులేమిటి?"

"ఆఫీసు పని సూపర్‌వైజ్ చెయ్యడం."

"అందులో ఎకౌంటెంట్ పని కూడా ఉంటుందా?"

"ఉంటుంది."

"రోజూ సేఫ్ ఎవరు తెరుస్తుంటారు? సాయంత్రం వరకూ ఎవరి అధీనంలో సేఫ్ ఉంటుంది?"

"సేఫ్ రోజూ నేనే తెరుస్తాను. సాయంత్రంవరకూ నా అధీనంలో ఉంటుంది."

"మీరు కాక ఇంకెవరయినా సేఫ్ తెరుస్తుంటారా?"

"అప్పుడప్పుడు మా ప్రొప్రయిటరు ఇంకా మిస్ పూర్ణిమ, క్లర్క్ కమ్ స్టెనోగ్రాఫర్ తెరుస్తుంటారు."

"సాయంత్రం సేఫ్ తాళంచెవులు ఎక్కడుంటాయి?"

"మా ప్రొప్రయిటరుగారి కేబిన్‌లోని అలమారులో."

"దాని తాళంచెవులు ఎవరిదగ్గరుంటాయి?"

"ప్రొప్రయిటరుగారి దగ్గర."

"సేఫ్ తాళంచెవులు అందులో ఎవరు పెడతారు?"

"సాధారణంగా నేనే పెడతాను."

"దొంగతనం కనిపెట్టిన ముందురోజు మీరు బ్యాంకుకు వెళ్ళేరా?"

"వెళ్ళేను."


*మా అభిమానులకు... మా ఖాతాదారులకు దీపావళి శుభాకాంక్షలు!*

* రుచికరమైన కేకులు * రకరకాల బిస్కెట్లు * తాజా మిల్క్ బ్రెడ్ * చక్కని ఫ్రూట్ బ్రెడ్

*అన్నిరకాల ఫాన్సీసామానులు!! సరసమైన ధర! తప్పక విచ్చేయండి!

**గౌతమి**
బేకరి అండ్ స్టోర్స్
వి. హెచ్. ఆర్. మున్సిపల్ కాంప్లెక్స్
షాపు నెం: 3
బీసెంట్‌రోడ్, విజయవాడ - 2

**డిలైట్**
బేకరి అండ్ స్టోర్స్
బీసెంట్‌రోడ్, విజయవాడ - 2

* మర్చిపోకండి!

క్రిస్టమస్ ... న్యూ ఇయర్ మరియు బర్త్‌డే కేకులకు ప్రత్యేకత!

"మీ కూడా ఎవరైనా ఉన్నారా?"

"ఆఫీసుగార్డ్ ఉన్నాడు."

"ఎంత డబ్బు తెచ్చేరు?"

"రెండులక్షల మూడువందల రూపాయలు."

"మీరు డబ్బు తెచ్చి ఎక్కడ పెట్టారు?"

"ఆఫీసు సేఫ్‌లో పెట్టేను."

"పెడుతుంటే ఎవరైనా చూసేరా?"

"తెలీదు."

"తరువాత తాళంచెవులు ఎవరి కిచ్చేరు?"

"శేఖర్‌గారికి."

"ఆయన చేతికిచ్చేరా? లేకపోతే మామూలుగా ఆయన అలమారులో పెట్టేరా?"

"ఆ రోజు మాత్రం చేతికే ఇచ్చేను."

"ఆ రోజు ప్రత్యేకంగా చేతికెందుకు ఇచ్చేరు?"

ఆ ప్రశ్నకు నారాయణ లాయరు అడ్డుపెట్టేడు. అతడు వృత్తి ధర్మంగా మామూలుగా చేసే పనిలోనుంచి విపరీతార్థాలు తియ్యడానికి ప్రయత్నిస్తున్నాడనేది అతని అభ్యంతరం. దానికి జడ్జి ఒప్పుకున్నాడు.

ఆ తరువాత సేఫ్ ఎవరైనా తెరిచినట్లు మీకు తెలుసా?"

"ఆ మర్నాడు తెలిసింది."

"ఎలా?"

"నేను తాళం వేసినప్పుడు లేని డాక్యుమెంట్సు కొన్ని అందులో ఉన్నాయి."

"అంతకుమించి మరేం తేడా లేదా?"

"లేదు."

"ష్యూర్?"

"ష్యూర్."

"అయితే అందులో పెట్టిన డబ్బు కూడా అలాగే ఉండి ఉండాలే!"

నారాయణ ఖంగారుపడ్డాడు. జడ్జీ, పూర్ణిమలాయరు కృష్ణమూర్తి నవ్వుకున్నారు.

"అసలు డబ్బులేదని రిపోర్టు చేసిందతనే! దాన్ని గురించి మళ్ళీ చెప్పనవసరంలేదు," అన్నాడు నారాయణ లాయరు – జడ్జీ అతనివైపు జాలిగా చూసేడు.

మళ్ళీ పబ్లిక్ ప్రాసిక్యూటరు మొదలుపెట్టేడు.

"మీ ఉద్దేశంలో ఆ డాక్యుమెంట్సు ఎవరు పెట్టి ఉంటారు?"

"మిస్ పూర్ణిమ."

"ఎలా చెప్పగలరు?"

*With best compliments of*

**PRABHU STEEL INDUSTRIES PRIVATE LIMITED**

53, West Maredpally, Secunderabad 500 026

*Factory*

Kukatpally, Hyderabad-500 037

Phone: 269611, 269614

"అంతకుముందురోజు నేను ఆఫీసునుండి వెళ్ళేసరికి ఆమె వాటిని టైపుచేస్తూంది. తరువాత సేఫ్‌లో పెట్టమని నేనే చెప్పేను."

"వాటిని సేఫ్‌లో పెట్టమని ఎందుకు చెప్పేరు?"

"అది అలవాటుగా వస్తున్న పద్ధతి కనుక."

"అయినప్పుడు చెప్పవలసిన అవసరం ఏముంది?"

"ముందు జాగ్రత్తగా?"

"దేనికి ముందు జాగ్రత్త?"

మళ్ళీ అందరూ ఫక్కుమన్నారు. నారాయణ లాయరు ఇదివరకు చెప్పిన కారణంమీదే మళ్ళీ అభ్యంతరం చెప్పేడు.

నారాయణ డబ్బుతెచ్చి సేఫ్‌లో పెట్టినట్లు ఎవరూ చూడ లేదన్న పాయింట్ గుర్తుపెట్టుకోమని జడ్జికి సూచిస్తూ ఆ రోజుకు నారాయణను ప్రశ్నించటం ఆపేడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

తరువాత పూర్ణిమను పిలిచేరు. మామూలు వివరాలన్నీ అడిగేరు. వాటికి జవాబుగా నారాయణ డాక్యుమెంట్స్ సేఫ్‌లో పెట్టమని చెప్పేడనీ తాను శేఖర్ అలమారులోంచి తాళాలు తీసుకొని డాక్యుమెంట్స్ సేఫ్‌లోపెట్టేననీ, అప్పుడు అందులో డబ్బు ఉందో లేదో తాను గమనించలేదనీ, తిరిగి తాళాలు శేఖర్ అలమారులో పెట్టేననీ పూర్ణిమ చెప్పింది.

ఆమెను క్రాస్ ఎగ్జామిన్‌చేస్తూ నారాయణ లాయరు కొన్ని ప్రశ్నలడిగి....

"ఇదివరలో నువ్వెప్పుడైనా దొంగతనం చేశావా?" అని అడిగేడు. దానికి కృష్ణమూర్తి ఒంటికాలిమీద లేచేడు. ఈ కేసుకీ ఆమె గతానికీ ఏమీ సంబంధంలేదనీ దాన్ని ఇక్కడ చర్చించడం అసందర్భమనీ అన్నాడు.

దానికి నారాయణ లాయరు రెచ్చిపోయేడు. దొంగతనం చేసే ఆమె మనస్తత్వం ప్రస్తుత విషయానికి సంబంధించి ఉన్నదనీ గతంలో ఆమె చాలా దొంగతనాలు చేసిందనీ, ఆ విషయం కోర్టువారి నోటీసుకు వచ్చిందనీ, ఆమె ఆరునెలలు ప్రొబేషనులో ఉందనీ కోర్టువారికి గుర్తుతెచ్చేడు. అంతేకాక కోర్టువారు కనికరించి విధించిన సంస్కారపూరితమైన శిక్ష ఆమెపై ఎట్టి మంచి ప్రభావమూ చూపించలేదనీ ఆరోపించేడు. ఆమె దొంగతనాలు చేస్తూనే ఉందన్న విషయం మళ్ళీ చెప్పి దానికి ఋజువు కావాలంటే మూడుతేదీలలో మూడు షాపుల్లో ఆమె తరువాతచేసిన దొంగతనాల వివరాలుచెప్పి అప్పటికప్పుడు ఆమె గది సోదాచేస్తే ఆ వస్తువులు దొరుకుతాయనీ హామీఇచ్చేడు. పూర్ణిమ ముఖం వివర్ణమైంది.

పోలీసులు సోదాచేసి ఒక కంచుగుర్రం, ఒక పురావస్తు

With best Compliments from

***

HOTEL VASANT MAHAL

Main Road, Eluru.

శిల్పం, ఒక యంత్రబద్ధమైన ఎలెక్ట్రిక్ ఫిట్టింగ్‌తెచ్చి కోర్టు వారి హస్తగతంచేసేరు.

నారాయణ సగర్వంగా నవ్వేడు శేఖర్‌నుచూసి.

గతంలోలాగే ఆ బొమ్మల వెలలు, అవిపెట్టిన షాపుల చీటీలు వాటికి వ్రేలాడుతూనే ఉన్నాయి. ఆ రోజు కోర్టు టైము అయిపోయింది. తరువాయి విచారణ మర్నాటికి వాయిదా పడింది.

మర్నాడు శేఖర్ లాయరు కృష్ణమూర్తిద్వారా ఆ మూడు వస్తువులకూ తాను డబ్బుచెల్లించి తెచ్చిన రశీదులు కోర్టుకు ఇచ్చేడు. ఆ విషయం బయటకు చెప్పకుండా కృష్ణమూర్తి ఆరోజు నారాయణను చేసిన పరీక్షలో పూర్ణిమచేసిన మూడు దొంగతనాలు ఎలా తెలిసేయని అడిగేడు. ఋజువైనవాటికి ఎలా తెలిసిందనే విషయాన్ని చెప్పనక్కరలేదని నారాయణ లాయరు వాదించేడు.

అప్పుడు అవి దొంగతన్నాలు కావనీ, డబ్బిచ్చికొన్న వస్తువులనీ ప్రకటించి, ఆమె ఆ వస్తువులను ఆయా షాపుల్లోంచి తీసుకున్న విషయాన్ని శేఖర్ డైరీద్వారా రహస్యంగా తెలుసుకొని అవి ఆమెచేసిన దొంగతనాలుగా భ్రమపడి, ఆమెమీద నేరంమోపవచ్చుననే ధైర్యంతో నారాయణే ఆఫీసు డబ్బు దొంగిలించేడని కృష్ణమూర్తి ఆరోపించేడు.

దానికి ఋజువు ఆమెచేయని దొంగతనాన్ని ఆమె మీద మోపడానికి చేసిన ప్రయత్నమేనని చెప్పేడు. ఆ తర్వాత పోలీసులు చేసిన ఇన్వెష్టిగేషన్‌లో నారాయణ గతంలో తలకు మించి చేసిన అప్పులు తీర్చినవైనం తెలిసి నారాయణ దొంగతనం ఋజువైంది.

నారాయణకు రెండు సంవత్సరాలు కఠినశిక్ష, వేయి రూపాయల జరిమానా అది కట్టలేకపోతే మరో ఆరునెలలు శిక్ష విధింపబడింది.

యూనివర్సల్ ఇంజనీరింగ్ కంపెనీ యూనియన్ లీడరు నారాయణ మోసాన్ని గుర్తించేక శేఖర్‌ను క్షమాపణకోరేడు


అందరికీ దీపావళి శుభాకాంక్షలు! ఇదే మా చిత్రావళి

**1978** కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించిన బి. విఠల ఆచార్య సృష్టి

# జగన్మోహిని

జయమాలిని, ప్రభ ... సావిత్రి నరసింహరాజు సారధి

| | | |
|---|---|---|
| * బంగారు పతకం (కలర్)<br>శివాజీ గణేశన్ ... కె. ఆర్. విజయ | * భక్త ప్రహ్లాద<br>ఎస్.వి.రంగారావు, రోజారమణి, వాణిశ్రీ | * సతీ సక్కుబాయి<br>ఎస్. వి. రంగారావు, అంజలి సూర్యకాంతం |
| * శ్రీకృష్ణలీలలు<br>ఎస్.వి. రంగారావు, రేలంగి | * శకుంతల<br>రామారావు...సరోజాదేవి | * శ్రీకృష్ణ తులాభారం<br>ఎన్.టి. రామారావు వాణిశ్రీ జమున అంజలి |
| * భీమాంజనేయ యుద్ధం<br>కాంతారావు, సత్యనారాయణ | * కదలడు వదలడు<br>రామారావు, సత్యనాయరాణ, జయమాలిని | * గండికోట రహస్యం<br>ఎన్. టి. రామారావు, దేవిక |
| * ఒకే కుటుంబం<br>ఎన్.టి. రామారావు, లక్ష్మి | * భలే అమ్మాయిలు<br>రామారావు, సావిత్రి | * లేతమనసులు<br>జమున, హరనాథ్ |
| * కులగోత్రాలు<br>నాగేశ్వరరావు, కృష్ణకుమారి | * పిల్లా! పిడుగా!<br>రామకృష్ణ...జ్యోతిలక్ష్మి | * నమ్మకద్రోహులు<br>కృష్ణ...చంద్రకళ |
| * తోటలో పిల్ల - కోటలో రాణి<br>కాంతారావు వాణిశ్రీ రాజశ్రీ | * మళ్ళీ పెళ్ళి<br>కృష్ణ, కృష్ణంరాజు | * ఆస్తికోసం<br>రామకృష్ణ...ప్రమీల |
| * రైతే రాజు<br>శోభన్‌బాబు, చంద్రకళ | * నేనూ మనిషినే<br>కృష్ణ, కాంచన | * విచిత్ర దాంపత్యం<br>శోభన్‌బాబు విజయనిర్మల |

**జైకిసాన్ పిక్చర్స్** డాబా గార్డెన్స్, విశాఖపట్టణం - **530004**

ఫోన్స్: ఆఫీసు: 3996 రెసిడెన్సి: 8335

## 24

పూర్ణిమ ఆరునెలల ప్రొబేషను అయిన సందర్భంలో అభినందించడానికి వచ్చేడు వివేకానందం.

మాటల సందర్భంలో "మీరు రోజా పేపరు చూస్తారా?" అని అడిగేడు.

"చూస్తాను," అంది పూర్ణిమ.

"ఈరోజు పేపరు చూసారా?"

"ఇంకాలేదు."

"చూడండి తెచ్చాను," అని వివేకానందం చేతిలో పేపరు ఇచ్చేడు.

పేపరుచూసి పూర్ణిమ నిర్ఘాంతపోయింది.

'బొంబాయిలో ప్రముఖ స్మగ్లర్ రవి అరెస్టు' అని రవి ఫోటోతోపాటు వివరాలన్నీ ఉన్నాయి. అప్రయత్నంగా పూర్ణిమ కళ్ళల్లో నీళ్ళు నిండేయి. తరువాత వివేకానందం అన్నాడు.

"....చదువుకొనే రోజుల్లో ఎలక్షన్సులో నిలబడి పాంప్లెట్స్ అచ్చువేసుకోడానికి డబ్బులేని రవి, కొద్ది సంవత్సరాల్లో మీరు బొంబాయిలో చూసినంత భోగాన్ని యెలా సంపాదించుకో గలిగాడా అని అనుమానం కలిగి మేము బొంబే పోలీసును హెచ్చరించేము. దాని ఫలితమే ఇది.

"బహుశా ఆ రోజుల్లో అతను తరచుగా మాయమవుతూండడానికి కారణం మీ కిప్పుడు అర్థమయి ఉంటుంది. ఏమాత్రం మామూలుగా ఆలోచించినా మీ కీవిషయం అప్పుడే తెలిసేది. కాని ఎదుటివాళ్ళ నీచత్వాన్ని చీటికిమాటికీ ఆరోపించని మీ ఆదర్శ మనస్తత్వమే అతనిలో లోపాన్ని మిమ్మల్ని చూడనివ్వలేదు.

"జీవితాన్ని నిరుపేదగా మొదలుపెట్టిన రవి ప్రపంచాన్నంతనీ జయించాలనుకున్నాడు. అతడు సాహసి. సందేహం లేదు. కాని మంచిచెడ్డల విచక్షణాజ్ఞానం లేని సాహసం దుస్సాహసం అవుతుంది. అతడు అవకాశవాది. అతనికి వచ్చిన ప్రతి అవకాశాన్నీ స్వార్థానికే ఉపయోగించుకున్నాడు. నమ్మినవాళ్ళను, వారికంటే ఉన్నతమైన అంతస్థు దొరికిందని అనిపించగానే నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా, అర్థాంతరంగా వదిలేశాడు. అతను చేరదలచుకున్న గమ్యాలు కాలినడకతో చేరేవికాదు. అత్యాశతో దూకి చివరకు కాళ్ళు విరక్కొట్టుకున్నాడు.

"సాహసి అంటే చంద్రశేఖర్. అతనూ నిరుపేదగానే జీవితాన్ని ప్రారంభించేడు. బూట్ పాలిష్‌చేసీ, పేపర్లమ్మి తనమీద ఆధారపడిన చెల్లెలికి తానే తల్లీ తండ్రి అయి నీడనిచ్చేడు. ఆమెను బ్రతికినంతకాలమూ సుఖంగా ఉండే


యువ డిసెంబర్ సంచికలో

1978 చక్రపాణి మూడవ అవార్డు పొందిన

శ్రీ వేమకోటి సీతారామశాస్త్రి నవల

ధరిత్రి

మూడవ అవార్డు పొందిన

శ్రీ రాజా రామ్‌మోహనరావు కథ

'కూలితల్లి'

ఇంకా

యద్దనపూడి సులోచనారాణి, సి. యస్. రావు గార్ల సీరియల్స్, యామినిగారి 'మొగలి రేకు,' ఇంకా ఇతర ప్రముఖ రచయితల కథలతో వెలువడుతుంది.

గూటికి చేర్చేడు. నీతిమార్గంలో శ్రమచేసి తాను సంపద కూర్చుకొని వందలాది మనుషులకు జీవనోపాధి కలిగే ఉపాయాన్ని అవలంభించేడు.

"మీలో ఉన్న నైర్మల్యాన్నీ నిజాయితీనీ నిజంగా ఆరాధించేడు.

"రవి మిమ్మల్ని దొంగగా చేస్తే మీ దొంగతనాలకు మిమ్మల్ని నీడలా వెన్నంటి డబ్బు చెల్లించి మిమ్మల్ని కాపాడేడు.

"చివరకు నేరం మీ మీదకు మొగ్గినప్పుడు మీ నిజాయితీని నమ్మి యింతవరకు జీవితంలో తాను సాధించిందంతా దానికి ఎదురొడ్డడానికి నిశ్చయించుకున్నాడు. సాహసం అంటే అది! శేఖర్ మూలంగా కాకపోతే ఇంత ఉన్నతభావాలుకల మీరు రవి చేసిన ద్రోహానికి బలిఅయిపోయేవారే!"

కన్నీటి పొరల్లోంచి కంటిముందు కనబడేదంతా కదిలి పోతూన్నట్లనిపించింది పూర్ణిమకు. కారు చప్పుడయితే కళ్ళు తుడుచుకు చూసింది పూర్ణిమ.

బయట ఆగిన కారులోంచి దిగి వస్తున్నాడు శేఖర్. వస్తూనే వివేకానందానికి విష్ చేసేడు.

"పూర్ణిమా! అనాథశరణాలయంనుంచి ఆనందమయిగారు టెలిఫోన్ చేసేరు. బేబీ కండిషను సీరియస్‌గా ఉందట! నిన్ను అర్జెంటుగా తీసుకొని రమ్మన్నారు," అన్నాడు ఖంగారుగా.

పూర్ణిమ పైప్రాణం పైనే పోయింది.

అందరూ అనాథశరణాలయానికి వెళ్ళేరు. వెళ్ళగానే ఆనందమయి తానారోజు డ్యూటీలో చేరగానే బేబీ చాలా అస్వస్థతలో ఉన్నట్లు గమనించినట్లు చెప్పింది.

"—ఫిట్లొస్తున్నాయన్నారు. ఎందుకో కారణం తెలియదు పాపం పసిగుడ్డు వెర్రిచూపులు చూస్తూంది. నేను నీకోసం ఎదురుచూస్తున్నాను. చివరకు ఇప్పుడే తెలిసింది వనజాక్షి నిన్ను ఇక్కడికి రానియ్యలేదని. రోజూ నీకోసం గేటు దగ్గర నిలబడి ఎదురుచూస్తూంటే గుండెలు పగిలిపోయేవని ఆయాలు అన్నారు. అంతా తలచుకుంటూంటే నాకు మతిపో తూంది," అంది ఆనందమయి.

"నేను బేబీని చూడలేకపోతున్నాననే మధనపడు తున్నాను కాని ఇంత ప్రాణంమీదకు వచ్చిందని నాకూ తెలియదు," అంది పూర్ణిమ.

మంచంమీద బేబీ స్పృహలేకుండా పడివుంది. డాక్టరు స్పృహ తెప్పించడంకోసం విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

బేబీని చూడగానే పూర్ణిమ మంచంమీద భోరున ఏడుస్తూ వాలిపోయింది.


*With best compliments from*

**GOLI ESWARAIAH**

***Dealers in :*** **Papers, Boards and Printing Materials**

**General Bazar, SECUNDERABAD-A. P.**

Phone : 74386
Res : 74383

Grams: 'FANCY PAPER'
Secunderabad

# యువ

పాఠకులకు, ప్రకటనదారులకు, ఏజంట్లకు, శ్రేయోభిలాషులకు

## దీపావళి శుభాకాంక్షలు


## 25

ఆరాత్రి మరో మూడు గంటల తర్వాత బేబీకి స్పృహ వచ్చింది. మెల్లిగా కళ్ళుతెరచి చూసి ఎదురుగా ఆత్రుతతో చూస్తున్న పూర్ణిమను బల్లిలా వాటేసుకుంది.

ఒక్కక్షణంకూడా బేబీని ఆమెనుండి వేరుచేయవద్దనీ పూర్తిగా కోలుకునేవరకూ ఆమెతో ఉండాలనీ డాక్టరు అన్నాడు.

ఆనందమయితో చెప్పి పూర్ణిమ బేబీని తన యింటికి తీసుకొని వెళ్ళింది.

శేఖర్ ఉదయమూ సాయంత్రమూ వచ్చి ఓ గంట కూర్చొని వెడుతున్నాడు.

మూడు రోజుల తర్వాత సాయంత్రం.... బేబీ అప్పటి దాకా ఆడుకొని పూర్ణిమ ఒడిలో నిద్రపోయింది.

పూర్ణిమ బేబీని పరుపుమీద పడుకోబెట్టింది. ఎదురుగా కుర్చీలో శేఖర్ కూర్చొని కిటికీలోంచి చూస్తున్నాడు దూరంగా.

పూర్ణిమ అతనివైపు చూస్తూంది రెప్పవాల్చకుండా. అతనిపట్ల కృతజ్ఞత సముద్రంలా పొంగుతూంది మనసులో. మనసులోని విషాదఛాయలన్నీ తొలగిపోయి ఏదో భయంకరమైన బంధాలనుంచి విముక్తిపొందినట్లుగా అనిపిస్తూంది.

అతని కుర్చీకి దగ్గరగా మంచంమీద కూర్చుంది. అతను దృష్టి మరల్చలేదు. ఆమె అతనిమీదనుండి చూపు మార్చ లేదు. అలా ఎంతసేపు కూర్చుందో ఆమెకే తెలియదు.

నీరెండల కాంతికూడా మాసిపోయింది. ప్రకృతి ప్రశాంతంగా ఉంది.

"నాపై మీకెందుకింత కరుణ?"

ఇద్దరి హృదయాలూ ఒక విషయాన్నే ఆలోచిస్తున్నాయి. హృదయస్రోతులోంచి వస్తూన్న ఆ మాటలకు వేరే ముందుమాట అక్కర్లేదు.

శేఖర్ తలతిప్పి చూసేడు. ఆమె కడిగినముత్యంలాఉంది.

"ఆ పాపపై నీకెందుకింత మమత?" శేఖర్ అడిగేడు. తరువాత అన్నాడు. "నేను స్వచ్ఛతను ఆరాధిస్తాను. దాన్ని ఎక్కడున్నా కొలువగలను."

"నేనొక ధూర్త బాలికను. అడుగడుగునా మీరు నన్ను కంటికి రెప్పలా కాపాడేరు....ఆ చనువుతోనే ఒకమాట అడగనా?" అంది పూర్ణిమ.

తప్పకుండా అన్నాడు శేఖర్.

"నన్ను మీ నీడన బ్రతకనివ్వండి." అశ్రుపూరిత నయనాలతో అతనివైపు చూసింది పూర్ణిమ.

"పూర్ణిమా!" చేతులు చాచి ఆమెను హృదయానికి దగ్గరగా తీసుకున్నాడు శేఖర్.

ఆరోజు పూర్ణిమ.

అప్పుడే రవి అస్తమించేడు.

చంద్రోదయమైంది.


Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road, Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO